మ్యాగజైన్ నేటి సారాంశాల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-10-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 260 పేజీలు: 10+4 వెల: 6.50

## తపాలా ఉద్యోగులకు రూ. 13,816 బోనస్
3లో

## ఫ్రాన్స్ నుంచి ఇటలీ దాకా ఆగని అల్లర్లు
5లో



ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ ఆటాపాట దృశ్యం

## నీటి పరిరక్షణే నిజమైన దైవారాధన
6లో

- బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- పాల్గొన్న మంత్రులు జూపల్లి, సీతక్క, అమెరికా, జర్మనీ కాన్సల్ జనరల్స్, సినీనటులు విజయ్, రష్మిక
- ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు



## ఆలయం వద్ద మరో ఘోరం
2లో

అదుపుతప్పి భక్తులపైకి దూసుకెళ్లిన లారీ
గ్వాలియర్ శీతలమాత ఆలయం వద్ద పెను ప్రమాదం
15 మంది మృతి, 30 మందికి పైగా గాయాలు

## బాలీవుడ్ నటుడు టైగర్‌ష్రాఫ్ కారుపై కాల్పులు
3లో



డ్రైవర్ సహా ఇద్దరికి గాయాలు
క్షేమంగా బయటపడ్డ ష్రాఫ్

## వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి ప్రభుత్వం అనుమతి
3లో



## మాస్కోపై నిప్పులు కురిపించిన ఉక్రెయిన్
2లో

450 పైగా డ్రోన్లు కూలివేశామన్న రష్యా
ఇద్దరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు

# 32 వేల కోట్ల కరవు నిధులివ్వండి

- కరవు ప్రాంతాలకు రూ. 30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజ
- దెబ్బతిన్న పంటలకు మరో రూ. 1987 కోట్ల సాయం
- రాష్ట్ర వ్యాప్తంగా 13.22 లక్షల ఎకరాలపై ఎఫెక్ట్
- 1.20 లక్షల ఎకరాల్లో వరి, 8.93 లక్షల ఎకరాల్లో పత్తికి నష్టం
- 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 చోట్ల మోస్తరు అనావృష్టి
- కేంద్రానికి కరవు ప్రభావ నివేదిక ఇచ్చిన తెలంగాణ

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జరిగిన నష్టాలు, కరువు నివారణ చర్యలకు సంబంధించి రూ.32 వేల కోట్ల నిధులను మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి, తాగు నీరు తదితర రంగాల్లో వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం కోరింది. అంతే కాకుండా దెబ్బతిన్న వివిధ పంటలకుగాను రూ.1,986.89 కోట్ల సహాయ ప్యాకేజీని ప్రతిపాదించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఈ ప్యాకేజీ నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో ప్రాథమిక కరువు పరిస్థితులను గుర్తించింది. వీటిలో 101 మండలాలు తీవ్ర కరువును, 214 మండలాలు మోస్తరు కరువును ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత రూ.1,986.89 కోట్ల సహాయ ప్యాకేజీలో విత్తన రాయితీలు, సూక్ష్మ నీటిపారుదలకు మద్దతు, ఉద్యానవన పంటలను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాలు ఉన్నాయి. రాబోయే నీటి కొరత దృష్ట్యా, 2026-27 రబీ సీజన్‌లో వరి సాగుకు దూరంగా ఉండే రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున కేంద్ర సహాయం మంజూరు చేయాలని నివేదికలో సిఫార్సు చేసింది. రాష్ట్రంలో ఏర్పడిన వర్షపాతం లోటు వ్యవసాయ కార్యకలాపాలపై ప్రభావం చూపింది. దీని ఫలితంగా సాగు విస్తీర్ణం గత ఏడాది 139.28 లక్షల ఎకరాల నుండి ఈ ఏడాది 126.06 లక్షల ఎకరాలకు, అంటే 13.22 లక్షల ఎకరాలు తగ్గింది. వరి సాగు 69.19 లక్షల ఎకరాల నుండి 57.04 లక్షల ఎకరాలకు పడిపోయింది. అలాగే 8.93 లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు, దిగుబడులు 50 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. 1.20 లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతినగా, దిగుబడి 30 నుంచి 35 శాతం వరకు తగ్గుతుందని అంచనా. అత్యధికంగా 3.58 >>2







ఆదివారం తిరుమలలో చంద్రప్రభవాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

# సిఎం రేవంత్‌రెడ్డి నేడు ఫ్యూచర్ సిటీలో పర్యటన

**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం ఫ్యూచర్ సిటీలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించనున్నారు. సాయంత్రం 5:30 గంటలకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్‌యూనివర్సిటీని సందర్శించనున్నారు. సాయంత్రం 6:00 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయుఎం) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

# ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

## సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా: డి.సిఎం భట్టి

**వైరా, ప్రభాతవార్త, అక్టోబరు 18:** రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం నాచారంలోని అద్భుత వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఆయన, ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ.44 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రామదాసు నాయక్ పట్టుదలతో ఈరహదారికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యం కలగడమే కాకుండా స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.2,500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీపరివాహక ప్రాంతాలు, ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

ప్రజల కుటుంబ అవసరాలను తీర్చడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయంఅందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, వైరా నియోజకవర్గానికి కూడా ఈ పాఠశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి అడ్వాన్స్‌డ్‌టెక్నాలజీ సెంటర్‌ను కూడా కేటాయించామన్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# ఆలయం వద్ద మరో ఘోరం

**గ్వాలియర్, అక్టోబరు 18:** మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్‌లో శీతల మాత ఆలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ విషాదకర ఘటన జరిగింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఆ సమయంలో చిన్నిర్ వైపు నుంచి ధాన్యంతో వస్తున్న ఒక భారీ లారీ కొండవాలు ప్రాంతంలో అకస్మాత్తుగా అదుపు తప్పింది. ఈ ప్రాంతంలో భారీ వాహనాల ప్రవేశంపై నిషేధం ఉన్నప్పటికీ లారీ అక్కడున్న పోలీసు బారికేడ్లను, చెక్‌పోస్టును బద్దలుకొట్టుకుంటూ వేగంగా దూసుకొచ్చింది. నియంత్రణ కోల్పోయిన ఆ లారీ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న భక్తులపైకి దూసుకెళ్లడంతో పాటు, ఆలయ ప్రహరీ గోడను, గేటును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు, భక్తులు లారీ కింద నలిగిపోయారు. ఈ దుర్ఘటనలో దాదాపు 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లు, ఇతర వాహనాల ద్వారా సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఐదు నుంచి ఆరుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు పోలీసు సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే గ్వాలియర్ కలెక్టర్ రుచికా చౌహాన్, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ధర్మవీర్ సింగ్ తదితరతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. నవరాత్రి సమయాల్లో భద్రత కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను లారీ ఎలా దాటగలిగిందనేదానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అలాగే లారీలో సాంకేతిక లోపం తలెత్తిందా లేక డ్రైవర్ నిర్లక్ష్యమా అనే కోణంలో ఆర్టీఓ బృందం కూడా విచారణ జరుపుతోంది. ఈ అకస్మాత్తు ప్రమాదంతో గ్వాలియర్‌లో తీవ్ర విషాదం అలుముకుంది.

# 32 వేల కోట్ల కరవు నిధులివ్వండి

>> లక్షల ఎకరాల్లో నల్గొండ ప్రభావితం అయ్యాయి. ఆ తర్వాత గద్వాల్ 1.45 లక్షల ఎకరాలు, నాగర్‌కర్నూల్ 1.41 లక్షల ఎకరాలు, రంగారెడ్డి 1.29 లక్షల ఎకరాలు దెబ్బతిన్నాయి. పంట నష్టాలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం అందించాలని అధికారులు ప్రతిపాదించారు. అలాగే పతిపాదిత ఆర్థిక ప్యాకేజీ రూ.30 వేల కోట్లలో చెరువులు, ఇతర నీటి వనరుల పునరుద్ధరణకు రూ.3,552 కోట్లు, కీలక నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.16,448 కోట్లు, వ్యవసాయ అవసరాల కోసం నీటిని పంపింగ్, లిఫ్టింగ్ చేసేందుకు విద్యుత్ సబ్సిడీల కింద రూ. 10 వేల కోట్లు ఉన్నాయి. కరువు సహాయం, నీటిపారుదల మౌలిక సదుపాయాలు, నీటి సరఫరా నిర్వహణ కోసం ఆర్థిక సహాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను కేంద్రంతో చర్చించేందుకు నివేదికలో సిఫార్సు చేసింది. మరోపక్క జూలై 2027 వరకు త్రాగునీటి అవసరాల కోసం ప్రత్యేకంగా 85 టీఎంసీ అడుగుల నీటిని కేటాయించాలని కూడా ప్రభుత్వానికి సలహా ఇవ్వబడింది. సింగూర్, మంజీరా జలాశయాలలో నీటిమట్టాలు తగ్గడంతో హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. ప్రస్తుతం నగరానికి రోజుకు సుమారు 56 కోట్ల గ్యాలన్ల నీరు అందుతోందని, ఈ రెండు జలాశయాలలో నీటి కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయ వనరులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుందని అధికారులు తెలిపారు. ప్రతిపాదిత అత్యవసర చర్యలలో భాగంగా కృష్ణా నది నుంచి అదనపు నీటిని తోడటం, మిషన్ భగీరథ కింద సరఫరాలను సవరించడం, తాగునీటి అవసరాలను తీర్చడానికి గోదావరి నీటి వినియోగాన్ని పెంచడం వంటివి ఉన్నాయి. హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మాణం, ఇతర అత్యవసరం కాని పనులకు తాగునీరు, బోర్‌వెల్ నీటి వినియోగాన్ని పరిమితం చేయాలని కూడా అధికారులు సిఫార్సు చేశారు. నీటి కొరత తీవ్రతను బట్టి, కొన్ని ప్రాంతాలలో నీటి సరఫరాను మూడు రోజులకు ఒకసారికి పరిమితం చేసే అవకాశం ఉంది. అంచనా వేయబడిన కొరతను పరిష్కరించడానికి మరియు వినియోగదారులపై దాని ప్రభావాన్ని తగ్గించడానికి, అధికారులు సుమారు రూ. 57.55 కోట్ల వ్యయంతో తొమ్మిది ప్రత్యామ్నాయ ప్రణాళికలను ప్రతిపాదించారు. నివేదికలో పేర్కొన్న అంచనా ప్రకారం, డిసెంబర్ నాటికి హైదరాబాద్ మహానగర ప్రాంతంలోని సుమారు 3 లక్షల కనెక్షన్లకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలగవచ్చుని అంచనా వేసింది.

# మాస్కోపై నిప్పులు కురిపించిన ఉక్రెయిన్

**మాస్కో, అక్టోబరు 18:** అమెరికా అభ్యంతరాలను పట్టించుకోకుండా ఉక్రెయిన్ రష్యా రాజధాని మాస్కోపై భారీ డ్రోన్ దాడికి పాల్పడింది. ఇది ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి అని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ వెల్లడించారు. రాజధానిని లక్ష్యంగా చేసుకుని వచ్చిన కనీసం 450 డ్రోన్లను కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో మాస్కో చమురు శుద్ధి కర్మాగారం, ఓ నివాస భవనం దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఇద్దరు మరణించగా, మరో ఆరుగురు గాయపడినట్లు మాస్కో ప్రాంత గవర్నర్ ఆంద్రీ వొరోబ్యోవ్ సామాజిక మాధ్యమం టెలిగ్రామ్‌లో వెల్లడించారు. రష్యా పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ చివరి రోజున ఈ దాడులు చోటుచేసుకున్నాయి. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెందిన యునైటెడ్ రష్యా పార్టీ ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని అంచనా వేస్తున్నారు. యుద్ధాన్ని వ్యతిరేకించే ఏకైక పార్టీకి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం నిరాకరించగా, ప్రతిపక్ష కార్యకర్తలు జైళ్లలో ఉన్నారు. రష్యా అధికారుల సమాచారం ప్రకారం, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని చమురు టెర్మినల్ కూడా దాడికి గురైంది. ఈ దాడిలో ఉపయోగించిన డ్రోన్లను తయారు చేసే ఉక్రెయిన్‌కు చెందిన ఫైర్ పాయింట్ సంస్థ, దాడి అనంతరం టెర్మినల్ ప్రాంగణంలో అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలిపింది. ఈ టెర్మినల్ ద్వారా ఏడాదికి 1.25 కోట్ల టన్నుల వరకు చమురును నిర్వహించవచ్చు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఓ లాజిస్టిక్స్ కేంద్రంపైనా దాడి జరిగినట్లు రష్యా పంపిణీ సంస్థ ఓజోన్ వెల్లడించింది. స్థానిక అధికారుల ప్రకారం, ఈ దాడుల్లో ఒకరు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. నివాస గృహాలు కూడా దెబ్బతిన్నాయి. ఉక్రెయిన్ దాడులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీకి మధ్య సంబంధాలు క్షీణిస్తున్న సమయంలో చోటుచేసుకున్నాయి.

## మాదాపూర్ యూనిస్టింగ్ టెక్ సొల్యూషన్స్‌లో

# భారీ అగ్నిప్రమాదం

## రూ.కోటి ఆస్తి నష్టం!

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), అక్టోబరు 18, ప్రభాత వార్త:** మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సమీపంలో ఉన్న యూనిస్టింగ్ టెక్ సొల్యూషన్స్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.కోటి విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. రక్షణ, సైనిక రంగాలకు అవసరమైన డ్రోన్ నిరోధక వ్యవస్థలను తయారు చేసే ఈ కంపెనీ గోదాములో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది. మంటలు వేగంగా వ్యాపించడంతో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అగ్నిప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అగ్నిప్రమాదానికి అసలు కారణం, నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారుల విచారణ అనంతరం వెల్లడికావాల్సి ఉంది.

## వారం - వర్జ్యం

19-10-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి.అష్టమి ఉ.10.50
న.ఉత్తరాషాఢ మ.3.36
వ. రా.7.59-రా.9.45
దు.1. మ.12.15-మ.1.02
దు.2. మ.2.36-మ.3.23
రా.ఉ.7.30-ఉ.9.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** వాహన మరమ్మత్తులు చేస్తారు. విశాల హృదయంతో వ్యవహరిస్తారు. అందరి పట్ల సమన్యాయాన్ని కనబరుస్తారు.

**వృషభం :** రాజకీయరంగంలోని వారికి అనుకూలం. జీవితభాగస్వామితో కీలక విషయాలపై చర్చలు సాగిస్తారు.

**మిథునం :** క్రీడాకారులు మంచి ఫలితాలను సాధించగలుగుతారు. దీక్షా కార్యక్రమాలు చేపడతారు.

**కర్కాటకం :** మీ అభిప్రాయాలతో పెద్దలు కూడా ఏకీభవిస్తారు. అవకాశాలు కలిసి వస్తాయి.

**సింహం :** దారి, తెన్నులేని వ్యవహారాలను ఒక గాడిలో పెట్టడానికి మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

**కన్య :** వినోదకార్యక్రమాలకు, విలాసాలకు ప్రాముఖ్యతనిస్తారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఖర్చులు ఆలోచింప చేస్తాయి.

**తుల :** నూతన రంగంలోని వారితోటి పరిచయాలు ఏర్పడతాయి. మానసిక వత్తిడికి దూరంగా ఉండగలుగుతారు.

**వృశ్చికం :** శుభవార్త శ్రవణం చేస్తారు. సలహాలు, సూచనలు ఇచ్చేవారు అధికంగా ఉంటారు.

**ధనుస్సు :** స్వార్థ ప్రపంచాన్ని చూసి నివ్వెర పోతారు. పార్ట్‌టైం జాబ్స్‌ను సంపాదించుకోగలుగుతారు.

**మకరం :** రచనా వ్యాసంగాలను సాగిస్తారు. గృహాలంకరణలకు ప్రాముఖ్యతనిస్తారు. ఉపయుక్తమైన ఒప్పందాలు కుదుర్చుకుంటారు.

**కుంభం :** శ్రేయోభిలాషులతో కలిసి చర్చలను సాగిస్తారు. ఆహార నియమాలను పాటించడం చెప్పదగినది. ప్రయాణాలు లాభిస్తాయి.

**మీనం :** అనాలోచిత నిర్ణయాలను తీసుకుంటారు తొందరపాటు దుడుకుతనం కలిగి ఉంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## కాక్రోచ్ జనతాపార్టీకి పోటీగా

# లాల్‌హిట్ జనతాపార్టీ

## ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యమంటూ ప్రకటన

### నిరసనలతో వ్యాపారాలకు నష్టం జరుగుతోందని ఆరోపణ



అయాన్ భట్నాగర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌తో పాటు పలు ప్రాంతాల్లో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిరసనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీకి పోటీగా లాల్ హిట్ జనతా పార్టీ అనే మరో బృందం తెరపైకి వచ్చింది. ఆదివారం ఢిల్లీలోని మాలవీయ స్మృతి భవన్‌లో ఈబృందం తన తొలి సభ్యత్వ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత అయాన్ భట్నాగర్‌తో పాటు పలువురు వక్తలు సిజెపి, కాంగ్రెస్ పార్టీ, నిరసనకారులపై విమర్శలు చేశారు. ఆందోళనల కారణంగా దేశంలోని రాజ్యాంగ సంస్థలపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని, వ్యాపారాలకు నష్టం వాటిల్లుతోందని వారు ఆరోపించారు. సమావేశంలో మాట్లాడిన లాల్ హిట్ జనతా పార్టీ అధినేత అయాన్ భట్నాగర్ తమ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకోవడంతో పాటు, తక్కువ సమయంలోనే పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించగలమని నిరూపించడమే సమావేశం ఉద్దేశమని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిస్తే ఎంతమంది ప్రజలు తరలివస్తారో ఆలోచించాలని వ్యాఖ్యానించారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్న ఆయన ప్రజలు సోషల్ మీడియాకే పరిమితం కాకుండా బయటకు వచ్చి తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని అన్నారు. నిరసనకారులను ఉద్దేశించి భట్నాగర్ తన ప్రసంగంలో కీటకాలు, బొద్దింకలువంటి పదాలను ఉపయోగించారు. దసరా నుంచి దీపావళి వరకు దేశవ్యాప్తంగా వ్యాపారులకు అత్యంత కీలకమైన విక్రయాల సీజన్ అని ఆయన పేర్కొన్నారు. కన్నాట్ ప్లేస్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో కార్యకలాపాలకు అంతరాయం కలిగించే చర్యలను సహించబోమని అన్నారు. ఢిల్లీతో పాటు పలు మహానగరాల్లో నిరసనకారులు అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. నిరసనల ద్వారా ప్రభుత్వం ఎలా మారుతుందని భట్నాగర్ ప్రశ్నించారు. ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకోవడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేయడం రాజ్యాంగ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆయన అన్నారు. నేడు సిఇసి రాజీనామా కోరుతున్నవారు రేపు ప్రధాని మోడీ రాజీనామాను కూడా డిమాండ్ చేయవచ్చని వ్యాఖ్యానించారు. 50 వేల మంది ఒకచోట చేరినంత మాత్రాన ఏదైనా బృందం డిమాండ్లను అంగీకరించాల్సిన అవసరం లేదని అన్నారు. 2023లో ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి తీసుకొచ్చిన విధానాన్ని కూడా భట్నాగర్ ప్రస్తావించారు. నియామక ప్రక్రియలో ప్రతిపక్ష నేతకు స్థానం కల్పించారని పేర్కొంటూ ప్రస్తుత సిఇసి రాజీనామా కోరే ముందు నియామక విధానం, గతంలో పనిచేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ల పదవీకాలాలను పరిశీలించాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతోనే లాల్ హిట్ జనతా పార్టీ ఏర్పాటైందని భట్నాగర్ తెలిపారు. సిజెపి నిరసనలు పోలీసు వ్యవస్థపై, ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. బిజెపి ప్రభుత్వాన్ని తొలగించి తమ ప్రభుత్వం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ) సిజెపికి మద్దతు ఇస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వాస్తవాల ఆధారంగా అంచనా వేయాలని అన్నారు. రాజకీయ కార్యకలాపాల ద్వారా దేశంలో పరిస్థితులను, వ్యాపారాలను దెబ్బతీస్తున్నారని కొన్ని వర్గాలపై విమర్శలు చేశారు. సిజెపి నిరసనల వల్ల రాజకీయంగా ఎలాంటి ప్రభావం ఉండబోదని వ్యాఖ్యానించారు. దసరా నుంచే కాక్రోచ్ జనతా పార్టీపతనం ప్రారంభమవుతుందని ఆయన హెచ్చరించారు.



ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో గవర్నర్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న మంత్రి జూపల్లి

# అన్ని శాఖల్లో ఇహెచ్‌ఆర్‌ఎంఎస్

## డిజిటల్ దిశగా ఆర్థిక శాఖ అడుగులు

**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కీలక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సర్వీసు వివరాలను డిజిటలైజ్ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణ సమగ్ర ఆర్థిక నిర్వహణ సమాచార వ్యవస్థ పరిధిలో రూపొందించిన ఎలక్ట్రానిక్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఇహెచ్‌ఆర్‌ఎంఎస్)ను అమల్లోకి తీసుకొస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయంలోని అన్ని శాఖలు, శాఖాధిపతుల కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు, క్షేత్రస్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు ఈ విధానాన్ని వర్తింపజేయనున్నారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఉద్యోగుల సర్వీసు వివరాల నిర్వహణ మరింత సులభతరం కావడంతో పాటు పరిపాలనలో పారదర్శకత, వేగం పెరిగే అవకాశం ఉంది. ఇహెచ్‌ఆర్‌ఎంఎస్ అమలుతో ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన పలు కీలక కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. సెలవుల మంజూరు, వార్షిక ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, బదిలీలు వంటి సాధారణ సర్వీసు వ్యవహారాలతో పాటు వార్షిక రహస్య నివేదికలు, వార్షిక పనితీరు మదింపు నివేదికలు, స్థిరాస్తుల వివరాల సమర్పణ, విజిలెన్స్‌కు సంబంధించిన వ్యవహారాలు, పదవీ విరమణ కేసులను కూడా ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు. తద్వారా ఉద్యోగుల సర్వీసు వివరాల పరిశీలన, సంబంధిత ప్రతిపాదనల ఆమోదం, పరిష్కార ప్రక్రియలను ఒకే డిజిటల్ వేదిక ద్వారా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ వ్యవస్థ అమలును పర్యవేక్షించే బాధ్యతలను ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్‌కు ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఒకే విధమైన డిజిటల్ విధానాన్ని అమలు చేయడం ద్వారా సర్వీసు రికార్డుల నిర్వహణలో ఏకరూపత తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



ఆదివారం గోవాలోని మార్గావ్‌లో జరిగిన 'గోయ్ రఖాన్ యాత్ర'లో పాల్గొన్న రాహుల్ గాంధీ తదితరులు

# విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధా నామినేషన్

**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధా నామినేషన్ దాఖలు చేసారు. జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ (వంగవీటి రాధ) విజయవాడ మేయర్ అభ్యర్థిగా ఆ పార్టీ అధ్యక్షుడు, డి.సిఎం పవన్ కల్యాణ్ ప్రకటిం చారు. ఈ క్రమంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థిగా ఆదివారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి తన కార్యాల యం నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా వంగవీటి రాధా మీడియాతో మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపిల పూర్తి ఆమోదంతోనే తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. కూటమి మద్దతుతో తన విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నగర ఎమ్మెల్యేల సహకారంతో విజయవాడను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. దివంగత కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా కుమారుడైన రాధా, గతంలో కాంగ్రెస్, ప్రజారాజ్యం, వైఎస్సార్‌సిపి, టిడిపిలో పనిచేసి ఇటీవలే జనసేన పార్టీలో చేరారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయవాడ మేయర్ పోరు ఆసక్తికరంగా మారింది.

**మేయర్ అభ్యర్థిగా ఎబివి కూడా నామినేషన్**

విజయవాడ నగర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. విశ్రాంత ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు (ఎబివి) విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేసారు. విజయవాడ మేయర్ ఎన్నికల్లో పోటీ చేస్తానని, మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్‌తో సిపిఐ, సిపిఎం, వామపక్షాలు, పలు ప్రజాసంఘాలను ఆయన కోరారు. అందుకు వారి నుంచి మద్దతు రావడంతో ఆయన ఆదివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలనుకొండ శివాజీ, ఇతర సిపిఐ, సిపిఎం కీలక నేతలు వెంటరాగా వెళ్ళి మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసారు. దీంతో బెజవాడ మేయర్ స్థానం కోసం జరగనున్న ఎన్నికల్లో ముక్కోణపు పోరుకు రంగం సిద్ధమైనట్లయింది. ఎబి వెంకటేశ్వరరావు ప్రజా సమస్యలపై స్పందిస్తున్నారు. ప్రభుత్వాన్ని సైతం ఎండగడుతున్నారు. ఆ మధ్య ఆయన ఓ సెమినార్‌లో చేసిన వ్యాఖ్యలపై మాట్లాడిన మాటలపై టిడిపి సోషల్ మీడియాలో కథనాలు రావడం వివాదాస్పదంగా మారింది.

# కాళేశ్వరం పునరుద్ధరణకు కొత్తగా టెండర్?

## బ్యారేజి నిర్మాణ సంస్థలకు ఇవ్వడంపై భిన్నస్వరాలు

## పెండింగ్ బిల్లుల కోసం కోర్టులకు ప్రభుత్వాన్ని ఈడ్చిన సంస్థలకు పనులు కట్టబెట్టడంపై మల్లగుల్లాలు

**హైదరాబాద్,అక్టోబరు 18ప్రభాతవార్త:** కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతు పనుల అప్పగింత అంశంలో ఏజెన్సీ ఎంపిక కోసం నీటిపారుదలశాఖలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మించిన కాంట్రాక్టు సంస్థలకు పనులు అప్పగించే విషయంలో కొందరు సుముఖంగా ఉంటే మరికొందరు బ్యారేజిలను లోపభూయిష్టంగా నిర్వహించిన సంస్థలకు మళ్లీ కట్టబెట్టి ప్రజాధనం దుర్వినియోగం చేయవద్దనే వాదన వినిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొత్తగా టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించాలనే అంశంపై ఎక్కుమంది మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. బ్యారేజిలు నిర్మించిన సంస్థలతో టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ తోపాటు ఎన్‌డిఎస్ఎ, సిడబ్ల్యుసి, తెలంగాణ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కీలక సమావేశాల్లో భాగస్వాములు చేస్తూండటంతోపాటు వారితో చర్చలు కూడా జరుపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ తీసుకొనే నిర్ణయం బట్టి మరమ్మతుల ఏజన్సీ ఎంపిక ఉండే అవకాశం ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులకు తొలుత సుమారు రూ.700 కోట్లు అవసరమవుతాయని భావించారు. అయితే బ్లాక్-7ను పెద్ద ఎత్తున తొలగించి పునర్నిర్మించాల్సి వస్తే ఖర్చు గణనీయంగా పెరిగే అవకాశముంది. మేడిగడ్డతోపాటు సుందిళ్ల, అన్నారం బ్యారేజీల మరమ్మతులన్నింటికీ కలిపి మొత్తం వ్యయం రూ.2,500 కోట్లు లేదా అంతకంటే ఎక్కువకు చేరవచ్చని సంబంధిత వర్గాల అంచనా వేసినా, తాజాగా ఇంకా ఎక్కువ కావొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి డిజైన్లు, డ్రాయింగ్స్ పూర్తయితే కానీ అంచనాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. తాజా ధరలతో అంచనాలు తయారు చేయాల్సి ఉంది. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ అంచనా ఖర్చులో 50 నుంచి 60 శాతానికి పైగా ఖర్చయ్యే పునరుద్ధరణ పనులను టెండర్ లేకుండా నామినేషన్‌పై ఇస్తే వచ్చే సమస్యలను కూడా నీటిపారుదల శాఖ పరిశీలిస్తోంది. లోపభూయిష్ట నిర్మాణాలు చేయడమే కాకుండా ప్రభుత్వంపై కోర్టుకెళ్లిన ఏజన్సీలకుపనులు తిరిగి కట్టబెట్టడంకూడా ముందు ముందు ఏమైనా ఇబ్బందులు వస్తాయా అని కూడా ఆలోచిస్తోంది. నిర్మాణం చేసిన సంస్థలకే ఇవ్వడం వల్ల అన్నింటిపై అవగాహన ఉంటుందనే అభిప్రాయాన్ని కొందరు ఇంజనీర్లు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బ్యారేజి నిర్మాణసంస్థలు తమకు బకాయిలు చెల్లిస్తేనే మరమ్మతులు చేస్తామని ఇప్పటికే సంకేతాలు పంపుతున్నాయి. అన్నారం బ్యారేజీలో నిర్మాణ సంస్థ అఫ్కాన్స్‌కు డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ పూర్తయింది. ఈ సంస్థకు తుది బిల్లు రూ.170 కోట్లు పెండింగ్‌లో ఉంది. ఈ మొత్తం చెల్లించాలంటూ సంస్థ నోటీసు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వంపై కోర్టుకు వెళ్లింది. సుందిళ్ల బ్యారేజీలో మాత్రం డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ఇంకా ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. దీనివల్ల బ్యారేజీ నిర్మాణం చేసిన నవయుగకే అదనపు పనులు అప్పగించాల్సి ఉంటుందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ తుది నిర్ణయం మంత్రివర్గంపై ఆధారపడి ఉంటుందని, పలు ప్రత్యామ్నాయాలతో ప్రతిపాదనలు తయారు చేసుకొని నీటిపారుదల ఇంజనీర్లు మాత్రం మరమ్మతు కోసం సన్నద్ధం అవుతున్నారు.

# రిటైర్డ్ డిజి సతీమణి హత్య కేసులో నేపాలీ గ్యాంగ్ పట్టివేత

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన విశ్రాంత డిజి వినయ్ రంజన్ రే సతీమణి తనూజ హత్య కేసు లో అసలు నిందితులుగా వున్న నలుగురు నేపాలీ గ్యాంగ్‌ను పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఏడాది మే నెల ఎనిమిదవ తేదీన వినయ్ రంజన్ రే బెంగళూరుకు వెళ్లిన సమయంలో ఒంటరిగా వున్న తనూజను ప్రశాసన్‌నగర్‌లోని ఆమె ఇంట్లోనే పని మనుషులూ వున్న నేపాల్‌కు చెందిన వ్యక్తులు బంధించి, నోట్లో గుడ్డలు కుక్కి, ఆనక ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసి బీరువాలోని నగలు, నగదు దోచు కోవడం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసు శాఖ తీవ్రంగా స్పందించి సిసి టివి ఫుటేజిలను పరిశీలించి నిందితుల్లో కొందరిని గుర్తించింది. ఇందు లో ఇద్దరిని అరెస్టు చేయగా అసలు నిందితురాలు కల్పనతో పాటు మిగతా వారు పారిపోయారు. వీరి కోసం ఆరు నెలలుగా ఉత్తరప్రదేశ్‌తో పా టు బిహార్ సరిహద్దుల్లో నేపాల్‌కు దారితీసే మార్గాలలో హైదరాబాద్ పోలీసులతో పాటు సరిహద్దు భద్రతా దళం, ఎస్ఎస్‌బి పోలీసులు గాలిం చ సాగారు. పోలీసుల కృషి ఫలించి ఆదివారం ఉదయం కల్పనతో పాటు మరో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. వీరిని హైదరాబాద్‌కు తీసు కు వస్తున్నారు. సోమవారం దీనిపై పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించే వీలుంది.

# ముంబైలో టైగర్‌ష్రాఫ్ కారుపై కాల్పులు.. డ్రైవర్‌కు గాయాలు

**ముంబయి, అక్టోబరు 18:** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం సాయంత్రం ముంబైలోని జుహూలో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆయన కారుపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. అయితే, ఆయన కారు డ్రైవర్ గాయపడినట్లు సమాచారం. ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి టైగర్ ష్రాఫ్ బయటకు వస్తుం డగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటన అనంతరం సోషల్ మీడి యాలో ఓ వీడియో వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో అనిల్ పండిట్ అనే వ్యక్తి తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాం గ్‌కు చెందినవాడినని చెప్పు కున్నాడు. టైగర్ ష్రాఫ్ తమ ఆదేశాలను పట్టించుకోవడం లేదని, సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేస్తున్నాడని పేర్కొంటూ, అతను తమ హిట్‌లిస్ట్‌లో ఉన్నాడని హెచ్చరించినట్లు సమాచారం. ప్రస్తుతం గుజరాత్ జైలులో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ గతంలోనూ పలుమార్లు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌ను చంపుతామని బెదిరించిన విషయం తెలిసిందే. టైగర్ ష్రాఫ్, సల్మాన్ ఖాన్ ఇప్పటివరకు పూర్తిస్థాయి ఫీచర్ సినిమాలో కలిసి నటించలేదు. అయితే, బాలీవుడ్‌లో వీరిద్దరికీ పలు ఉమ్మడి పరిచయాలు ఉన్నాయి. టైగర్ ష్రాఫ్‌ను బాలీవుడ్‌కు పరిచయం చేయడంలో సల్మాన్ ఖాన్ కీలక పాత్ర పోషించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలాకు టైగర్‌ను హీరోగా పరిచయం చేయాలని సల్మాన్ సూచించినట్లు సమాచారం. మరోవైపు, టైగర్ తండ్రి, ప్రముఖ నటుడు జాకీ ష్రాఫ్ సల్మాన్ ఖాన్‌తో కలిసి పలు ప్రముఖ చిత్రాల్లో నటించారు. వివిధ కార్యక్రమాల్లోనూ టైగర్, సల్మాన్ కలిసి పాల్గొన్నారు. ఫిట్‌నెస్, యాక్షన్ సినిమాల పట్ల తమకున్న ఆసక్తి, అంకితభావం విషయంలో ఇద్దరూ ఒకరిపై మరొకరు పలుమార్లు ప్రశంసలు కురిపించారు. మంబయి క్రైమ్‌బ్రాంచ్‌తోపాటు ఎటిఎఫ్ బృందాలు కూడా దర్యాప్తుకోసం రంగంలోకి దిగాయి.



# థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు సంక్షోభం

### 6.41 లక్షల టన్నులకు పడిపోయిన నిల్వలు

### రోజువారీ సగటు వినియోగం 74,800 టన్నులు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణలో బొగ్గు నిల్వలు అవసరమైన స్థాయి కంటే తక్కువగా ఉండటంతో, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిపై ఆందోళనలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని థర్మల్ పవర్ స్టేషన్లలో సగటున తొమ్మిది రోజుల నిల్వలు ఉంటున్నాయి. ఈ నెల మధ్య నాటికి తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో) రోజువారి సగటు వినియోగం 74,800 టన్నులకు గాను, మొత్తం ముగింపు నిల్వలు 6.41 లక్షల టున్నులుగా ఉన్నాయి. ప్రధానంగా కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కెటిపిఎస్) యూనిట్ 5, 6లో సుమారు 10 రోజులకు, కెటిపిఎస్ యూనిట్ 7లో సుమారు 13 రోజులకు, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో దాదాపు 10 రోజులు, కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కెటిపిపి) యూనిట్ 1, 2లో సుమారు 10 నుండి 11 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇక రాష్ట్రంలోనే అతిపెద్ద విద్యుదుత్పత్తి ప్లాంట్ వైటీపీఎస్‌లో ప్రస్తుతం 5 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయి. నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్‌లో రోజువారీ బొగ్గు వినియోగం 27 వేల మిలియన్ టన్నులు. కానీ ఈ ప్లాంట్‌కు సరఫరా అవుతున్న బొగ్గు 23,964 మిలియన్ టన్నులే. అంటే 3,036 మిలియన్ టన్నుల బొగ్గు తక్కువగా అందుతున్నది.

నెలకు సగటు వినియోగం 3,33,603 మిలియన్ టన్నులుంటే, ఈ ప్లాంట్‌కు అందుతున్నది 3,25,814 మిలియన్ టన్నులు మాత్రమే. ఈ విధంగా నెలకు సగటున 7,789 మిలియన్ టన్నులు బొగ్గు కొరత సమస్య ఈ ప్లాంట్‌ను వేధిస్తున్నది అయితే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) నిబంధనల ప్రకారం 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలుండాలి. కానీ రాష్ట్రంలోని ఏ ప్లాంట్‌లోనూ 21 రోజులకు సరిపడా కోల్‌స్టాక్స్ లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం సగటున కేవలం 9 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలే ఉండటం ఆందోళన కలిగిస్తున్నది.

# దసరాకు ఆర్టీసీ కార్మికులకు అడ్వాన్స్

### మూడు, నాల్గవ తరగతి ఉద్యోగులకు వర్తింపు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు దసరా పండుగ సందర్భంగా శుభవార్త అందింది. అర్హులైన ఉద్యోగులకు పండుగ అడ్వాన్స్ చెల్లించాలని సంస్థ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ సదుపాయం మూడో, నాలుగో తరగతి ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. దసరా పండుగను ఆనందంగా జరుపుకునేందుకు ఉద్యోగులకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పండుగ అడ్వాన్స్ చెల్లింపులకు సంబంధించి అర్హులైన ఉద్యోగులకు నిర్దేశించిన రేట్ల ప్రకారం నగదు అందించాలని యాజమాన్యం అధికారులను ఆదేశించింది. ఈ మొత్తాన్ని అనుబంధ వేతన బిల్లు ద్వారా వెంటనే చెల్లించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. చెల్లింపుల్లో జాప్యం జరగకుండా అర్హత కలిగిన ఉద్యోగుల వివరాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా అడ్వాన్స్ అందించాలని సంబంధిత అధికారులకు సూచించింది. మరోవైపు, ఉద్యోగులకు అందించే పండుగ అడ్వాన్స్‌ను తిరిగి వసూలు చేసే విధానాన్ని కూడా సంస్థ స్పష్టం చేసింది. అడ్వాన్స్‌గా చెల్లించిన మొత్తాన్ని ఉద్యోగుల వేతనాల నుంచి పది సమాన నెలవారీ వాయిదాల రూపంలో తిరిగి వసూలు చేయనున్నారు. దీంతో ఉద్యోగులపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా వాయిదాల పద్ధతిలో మొత్తం తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది. ఈ మేరకు వేతనాల నుంచి కోత విధించే ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టనున్నారు.

# భార్యకు ఫ్రీ.. భర్తకు డబుల్ ఛార్జీలు!

### బస్సులకు 'స్పెషల్' బోర్డులతో 50 శాతం అదనపు భారం

### ప్రజలకు పండుగ సంబురం లేకుండా చేశారంటూ హరీశ్‌రావు ఆగ్రహం

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ టికెట్ ధరలు పెంచి ప్రజలకు పండుగ సంబురం లేకుండా చేస్తున్న దుర్మార్గ ప్రభుత్వం రేవంత్ సర్కారేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. రెగ్యులర్ బస్సులు తగ్గించి, స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టడం దారుణమన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సాధారణంగా జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు రూ.230గా ఉండే టికెట్‌ను ఏకంగా రూ.400కు పెంచారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇదే తరహాలో మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు మొన్నటి వరకు రూ.220లు ఉంటే, ఇప్పుడు రూ.290కి పైగా వసూలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రూట్లలో టికెట్ ఛార్జీలు డబుల్ చేసి జేబులు గుల్ల చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్‌గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి చేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికీ ప్రజాపీడనే అవుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం అని చెప్పి పురుషుల నుంచి డబుల్ ఛార్జీలు వసూలు చేస్తారా? అని ప్రశ్నించారు. భార్యకు ఫ్రీ టికెట్, భర్తకు డబుల్ టికెట్ వసూలు చేస్తే మహిళలకు రాయితీ ఇచ్చినట్టా? లేక ఆ భారాన్ని తిరిగి అదే కుటుంబంపై మోపినట్టా అని నిలదీశారు. ఇప్పటికే మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ టికెట్ ఛార్జీలను 5 సార్లు పెంచారని గుర్తు చేశారు. ఇప్పుడు పండుగల పేరుతో డబుల్ ఛార్జీలు వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆక్షేపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుతో పండుగలకు సొంతూళ్లకు వెళ్లాలంటేనే పేద, మధ్యతరగతి ప్రజలు భయపడే దుస్థితి ఏర్పడిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పండుగల పేరుతో పెంచిన అడ్డగోలు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ బస్సులను యథావిధిగా నడిపి, పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడకుండా చూడాలని బీఆర్ఎస్‌పక్షాన కోరారు. కాగా, హైదరాబాద్‌లో తక్కువ దూరాలు తిరిగేందుకు అనువుగా ఉండే మెట్రో డీలక్స్ బస్సులకు సైతం పండగ ప్రత్యేక సర్వీసులుగా వినియోగిస్తున్నారు. 50 శాతం అదనపు ఛార్జీలతో జేబీఎస్ నుంచి మంచిర్యాల, గోదావరిఖని వంటి ప్రాంతాలకు ఇలాంటి బస్సులను నడుపుతున్నారు.

# తపాలా ఉద్యోగులకు శుభవార్త

### రూ.13,816 బోనస్

**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** తపాలా శాఖ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎం.టి.ఎస్, గ్రూప్ సి, నాన్‌గెజిటెడ్ గ్రూప్ బి సిబ్బందికి, గ్రామీణ డాక్ సేవక్‌లకు, క్యాజువల్ కార్మికులకు 2025-26 సంవత్సరానికి గాను 60 రోజుల వేతనాలకు సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్‌ను మంజూరు చేసింది. నియమితంగా పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవక్‌లకు (జి.డి.ఎస్) అదే 60 రోజుల ఫార్ములా ప్రకారం ఎక్స్‌గ్రేషియా బోనస్ లభిస్తుంది,

కాగా పూర్తికాల, తాత్కాలిక హోదాలో ఉన్న క్యాజువల్ కార్మికులకు రూ.1,200 నెలసరి వేతనం ఆధారంగా లెక్కించిన అడ్‌హాక్ బోనస్ లభిస్తుందని తపాలా శాఖ జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇది 1 ఏప్రిల్ 2025 నుండి 31 మార్చి 2026 వరకు ఉన్న కాలానికి వర్తిస్తుందని పేర్కొంది.

ఈ బోనస్ లెక్కింపును 60 రోజుల వేతనం ప్రాతిపదికన చేపట్టనున్నారు. అయితే బోనస్ గణన కోసం గరిష్ట పరిమితిగా నెలకు రూ.7,000 వేతనాన్ని ప్రామాణికంగా నిర్ణయించారు. ఈ లెక్కన అర్హత కలిగిన ఉద్యోగులకు గరిష్టంగా దాదాపు రూ.13,816 వరకు బోనస్ లభించే అవకాశం ఉంది. ఈ బోనస్ లెక్కింపు సూత్రం ప్రకారం, సగటు నెలవారీ వేతనాన్ని 60తో గుణించి, ఆపై 30.4తో భాగించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం



వేతనంలో బేసిక్ పే, కరువు భత్యం (డిఎ) వంటి కొన్ని రకాల భత్యాలను కూడా చేర్చుతారు. ఒకవేళ ఉద్యోగి వాస్తవ జీతం రూ.7,000 కంటే ఎక్కువ ఉన్నప్పటికీ, బోనస్ లెక్కింపుకు మాత్రం రూ.7,000 మాత్రమే గరిష్టంగా పరిగణిస్తారు.

గ్రామీణ డాక్ సేవకులకు కూడా వారి టిఆర్‌సిఎ, డిఎ ఆధారంగా సగటు నెలవారీ సంపాదనను లెక్కించి, గరిష్టంగా రూ.13,816 వరకు ఎక్స్‌గ్రేషియాగా చెల్లిస్తారు.

అంతే కాకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ 1, 2025 నుండి మార్చి 31, 2026 మధ్య) పదవీ విరమణ చేసిన, రాజీనామా చేసిన లేదా డెప్యుటేషన్‌పై వెళ్లిన అర్హులైన ఉద్యోగులకు కూడా వారు పనిచేసిన కాలానికి నిష్పత్తి ప్రకారం బోనస్ చెల్లిస్తారు. అయితే అసాధారణ సెలవులు తీసుకున్న వారి బోనస్‌లో కోత విధించే అవకాశం ఉంది. ఉద్యోగుల సర్వీసు కాలం, వారి సగటు అర్హత వేతనం ఆధారంగా వచ్చే అసలు బోనస్ మొత్తంలో స్వల్ప తేడాలు ఉండవచ్చు.

# ఉగాది సంగమేశ్వరుడు దసరాకే వచ్చేశాడు!

### భక్తులకు వేసవిలో ఇచ్చే దర్శనం

### వానాకాలంలోనే సాక్షాత్కారం!

### శ్రీశైలం జలాశయంలో నీటి కొరతపై ఆందోళన

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** ఉగాది సంగమేశ్వరుడు దసరనాటికి బయటికొచ్చాడోచ్ అంటూ సంబరపడాలో నీటి ఎద్దడి ఎట్లా ఎదుర్కొనాలో గాబరాపడాలో తెలియని అయోమయంలో నెట్టింది గాడ్జిల్లా ఎల్‌నీనో. శ్రీశైలం జలాశయంలో నీరు నిండుకోవడం కర్నూలు జిల్లాలోని సప్త నదుల సంగమ క్షేత్రంలో వెలసిన సంగమేశ్వరుడు వేసవి కాలంలో మాత్రమే భక్తులకు దర్శనమివ్వాల్సి ఉండగా, దానికి భిన్నంగా నైరుతీ రుతుపవనాలు ముగిసిన వెంటనే కోవెల బయటపడటంతో స్థానికులు తీవ్రభయాందోళనకు గురవు తున్నారు. ఎల్‌నీనో కారణంగా శ్రీశైలం రిజర్వాయర్‌కు నైరుతీ రుతుపవనకాలంలో 219.7 టిఎంసిల నీరుమాత్రమే వరదరూపంలో జూరాల నుంచి వచ్చింది. ప్రస్తుతం అందులో 62టిఎంసిలనీరు ఉంది. గత ఏడాది ఇదే రోజున శ్రీశైలంలో 202.97టిఎంసిల నీరు ఉండేది. పోతిరెడ్డిపాడు, కొత్తగా పూలసుబ్బయ్య వెలిగొండ నుంచి 110 టిఎంసిల నీరు ఆంధ్రప్రదేశ్ రిజర్వాయర్లలో ఎప్పటికప్పుడు భద్రపరుచుకోవడంతో శ్రీశైలం దాదాపు ఖాళీ అయింది. దీనికి తోడు తుఫాను, ఈశాన్య రుతుపవనాలు కూడా ప్రభావం చూపకపోవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో వరద నీరు చేరలేదు. ప్రతి వర్షాకాలంలో శ్రీశైలం జలాశయం నిండి గేట్లు ఎత్తడం, పాతాళగంగ ఉరకలెత్తడం ఆనవాయితీగా వచ్చేది. కానీ ఈ సీజన్లో కనీసం ఒక్కసారి కూడా ప్రాజెక్టు గేట్లు ఎత్తే పరిస్థితి రాలేదు. రోజురోజుకూ ప్రాజెక్టులో నీటిమట్టం పాతాళానికి పడిపోతుండటంతో, మొన్నటివరకు నీటిలో మునిగి ఉన్న సంగమేశ్వరుని ఆలయం చాలా వేగంగా ఇప్పుడు బయటపడుతోంది. సాధారణంగా నదీ ప్రవాహం జోరుగా ఉండే ఏళ్లలో సంగమేశ్వర ఆలయం ఉగాది పండుగ సమయానికి బయటపడు తుంటుంది. కానీ ఈసారి వర్షాలు లేక నీటి నిల్వలు తగ్గిపోవడంతో, ఏకంగా ఆరు నెలల ముందే అంటే దసరా పండుగ నాటికే ఆలయం దాదాపు నీటి నుంచి బయట పడుతోంది. ఈ నేపథ్యంలో దసరా పర్వదినం నాడు స్వామివారికి తొలి పూజలు నిర్వహించేందుకు అర్చకులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఆరు నెలల ముందే సంగమేశ్వరాలయం బయటపడటం భక్తులకు ఆధ్యాత్మికంగా ఆనందం కలిగించే విషయమే అయినా, వెనుక తీవ్రమైన ముప్పు పొంచి ఉందనే ఆందోళన మాత్రం భయపెడుతోంది. రానున్న రోజుల్లో సాగునీటికే కాక తాగే నీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఇప్పటికే అనేక అంచనాలు వెలువడుతున్నాయి. ఆలయం ఇంత ముందుగా బయటకు రావడం రాబోయే తీవ్ర కరవు పరిస్థితులకు సంకేతమని స్థానికులు, రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.



# వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణలోని యూనివర్సిటీలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉస్మానియా, కేయూ, తెలంగాణ, తెలుగు, అంబేద్కర్, శాతవాహన, పాలమూరు యూనివర్సిటీల్లో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ చేయనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో 252 పోస్టులు, కాకతీయ యూనివర్సిటీలో 49 పోస్టులు, తెలంగాణ యూనివర్సిటీలో రెండు పోస్టులు భర్తీ చేయనున్నారు. శాతవాహన యూనివర్సిటీలో 49 పోస్టులు, పాలమూరు యూనివర్సిటీలో 45 పోస్టులు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 16 పోస్టులు, సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీలో 16 పోస్టులు భర్తీ చేయనున్నారు. విశ్వవిద్యాలయాల్లో 13 ఏళ్లుగా భర్తీగానీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలోని ప్రభుత్వ వర్సిటీల్లో వెయ్యికి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీలుండగా, వాటిలో 429 పోస్టులు భర్తీ చేయడానికి ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఈ నియామక ప్రకటనల జారీకి తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. కాగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను రాత పరీక్ష ఆధారంగా కాకుండా ప్రత్యక్ష నియామక విధానంలో భర్తీ చేయాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వుల్లో వెల్లడించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఎంపికలో అవకతవకలకు తావు లేకుండా నియామక ప్రక్రియపారదర్శకంగా జరగాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను తెలంగాణ ఉన్నత విద్యా మండలి స్వీకరిస్తుంది. ప్రొఫెసర్ల నియామకంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జారీ చేసిన మార్గదర్శకాలను పాటించనున్నది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిగ్రీ, పీజీ, ఎంఫిల్ మార్కుల ఆధారంగా స్కోర్ కేటాయిస్తుంది. డిగ్రీలో 80 శాతం , అంతకంటే ఎక్కువ మార్కులు ఉంటే 15, 6080 శాతం మార్కులకు 13, 5560 శాతం మార్కులకు 10, 45 శాతం కంటే తక్కువ మార్కులుంటే 5 పాయింట్లు ఇస్తుంది. దీంతోపాటు అభ్యర్థుల్లో పీహెచ్‌డీ చేసిన వారికి 30, నెట్‌లో అర్హత సాధిస్తే 5, సెట్ 3, రీసర్చ్ పబ్లికేషన్‌కు 10, బోధనానుభవనానికి ఏడాదికి 2 మార్కుల చొప్పున గరిష్ఠంగా 10 చొప్పున మార్కుల ఆధారంగా ఉన్నత విద్యా మండలి స్కోర్ కేటాయిస్తుంది.

దరఖాస్తు చేసుకున్న వారిలో 1:10 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి.. ఆయా జాబితాలను సంబంధిత విశ్వ విద్యాలయాలకు పంపుతుంది. ఆయా వర్సిటీల వీసీల నేతృత్వంలోని కమిటీ అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి, ఎంపిక చేస్తుంది. సీఎం ఆదేశాల మేరకు నియామక ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా చేపడతామని, ఎంపికైన అభ్యర్థుల మార్కుల వివరాలు అందుబాటులో ఉంచుతామని ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు అచార్య బాలకిస్టారెడ్డి తెలిపారు

# బాలీవుడ్ నటి రాఖీసావంత్‌కు యుపి కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్

**ఝాన్సీ, అక్టోబరు 18:** ప్రముఖ బాలీవుడ్ నటి రాఖీ సావంత్ కు ఊహించిన షాక్ తగిలింది. 2010లో చోటుచేసుకున్న లక్ష్మణ్ అహిర్వార్ ఆత్మహత్య కేసులో ఆమెకు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి కోర్టులో జరుగుతున్న విచారణకు రాఖీ సావంత్ చాలాకాలం నుంచి నోటీసులు తీసుకుంటూ హాజరుకాకపోవడంతో, అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఈ కఠినమైన ఉత్తర్వులను జారీ చేసినట్లుగా డిస్ట్రిక్ట్ గవర్నమెంట్ కౌన్సెల్ మృదుల్ కాంత్ శ్రీవాత్సవ మీడియాకు వెల్లడించారు. ఝాన్సీలోని హన్సారీ ప్రేమ్‌నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ అహిర్వార్, తన భార్య అనితతో ఏర్పడిన దాంపత్య విభేదాల పరిష్కారం కోసం 2010 అక్టోబర్‌లో ప్రసారమైన రాఖీ కా ఇన్సాఫ్ అనే రియాలిటీ షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా రాఖీ సావంత్ తనపై తీవ్ర స్థాయిలో అభ్యంతరకర, అవమానకర వ్యాఖ్యలు చేశారని, ఆ అవమానాన్ని తట్టుకోలేక లక్ష్మణ్ అహిర్వార్ 2010 నవంబర్ 10న ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపణలు ఉన్నాయి. మృతుడు లక్ష్మణ్ ఆత్మహత్య అనంతరం ఆయన తల్లి సావిత్రి స్థానిక ప్రేమ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాఖీ కా ఇన్సాఫ్ షోలో రాఖీ సావంత్ వాడిన భాష, చేసిన అవమానకర వ్యాఖ్యలే తన కొడుకు మరణానికి కారణమని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా జారీ అయిన నాన్‌బెయిలబుల్ వారెంట్ నేపథ్యంలో, ఈ కేసు తదుపరి విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టు డిసెంబర్ 1కి వాయిదా వేసింది.



# అర్హులైన ఇంటర్ విద్యార్థులందరికీ పబ్లిక్ పరీక్షలు రాసే ఛాన్స్: ఇంటర్‌బోర్డు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అర్హులైన ఇంటర్మీడియట్ విద్యార్థులందరికీ వార్షిక పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తామని ఇంటర్‌బోర్డు స్పష్టం చేసింది. కళాశాలల అనుబంధ గుర్తింపు విషయంలో తలెత్తిన సమస్యల కారణంగా విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ మేరకు ఇంటర్‌బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ ప్రకటన వెలువరించారు. అన్ని నిబంధనలను పాటించిన కళాశాలలకే అనుబంధ గుర్తింపు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. నిబంధనల్లో లోపాలున్న కళాశాలలకు వాటిని సరిదిద్దుకునేందుకు నిర్దేశిత గడువు ఇచ్చినట్లు తెలిపారు. అనుబంధ గుర్తింపు ఉన్న కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలని విద్యార్థులు, తల్లిదండ్రులను పలుమార్లు అప్రమత్తం చేసినట్లు గుర్తుచేశారు. అయితే రాష్ట్రంలో అర్హులైన విద్యార్థులందరికీ వార్షిక పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తామని బోర్డు స్పష్టం చేయడంతో విద్యార్థులకు ఊరట లభించనుంది. కళాశాలల గుర్తింపు, నిబంధనల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# 21 మంది సభ్యులతో ఇఆర్‌సి సలహా కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (టీజీఈఆర్సీ) 21 మందితో రాష్ట్ర సలహా కమిటీని (ఎస్ఏసీ) ఏర్పాటు చేసింది. ఈ మేరకు కమిషన్ సెక్రటరీ వి.రాంచందర్ ఉత్తర్వులు జారీ చేశారు. టీజీఈఆర్సీ తన విధులను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి విద్యుత్ రంగానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలపై ఈ కమిటీ కమిషన్కు సలహాలు, సూచనలు అందించనుంది. వినియోగదారులకు లభించే విద్యుత్ సరఫరా నాణ్యత, నిరంతరాయత సేవల విస్తరణను పర్యవేక్షి ంచడం, విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు), ఇతర లైసెన్స్ దారులు తమ నిబంధనలను సరిగ్గా పాటిస్తున్నారా లేదా అని చూడటం. విద్యుత్ వినియోగదారుల హక్కులు, ప్రయోజనాలను కాపాడటం. విద్యుత్ సంస్థల పనితీరు, సేవా ప్రమాణాలను మెరుగు పర్చడం తదితర అంశాలను సలహా కమిటీ పర్యవేక్షి స్తుంది. విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 87 (3) నిబంధన ప్రకారం టీజీఈఆర్సీ చైర్మెన్ సలహా కమిటీకి కూడా చైర్మెన్ గా వ్యవహరిస్తారు. తెలంగాణ ప్రభుత్వ వినియోగదారుల కార్యదర్శి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని ఉత్తర్వులో పేర్కొన్నారు. కమిషన్ కార్యదర్శి సలహా కమిటీకి కూడా కార్యదర్శిగా ఉంటారు. సభ్యుల పదవీకాలం 16 అక్టోబర్ 2026 నుంచి 3 సంవత్సరాల కాలానికి ఉంటుంది.

# విద్యుత్ డిమాండ్ 325 మిలియన్ యూనిట్లు

### 115 మిలియన్ యూనిట్లు జెన్‌కో సరఫరా

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త :** తెలంగాణ విద్యుత్ అవసరాల్లో మూడోవంతుకు పైగా 36 శాతం మేర తమ నిర్వహణలోని ఉత్పత్తి కేంద్రాలు తీరుస్తున్నామని తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 325 మిలియన్ యూనిట్లు కాగా, అందులో 115 మిలియన్ యూనిట్లకు పైగా జెన్‌కో కేంద్రాలు అందిస్తున్నాయని తెలిపింది. ఈ మేరకు జెన్‌కో పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ సంస్థ సీఎండీ డాక్టర్ ఎస్ హరీశ్ ఒక నివేదిక సమర్పించారు. 2024 మార్చి 31 నాటికి 6,485.26 మెగావాట్లుగా ఉన్న జెన్కో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఈ ఏడాది జూలై 31 నాటికి 9,624.96 మెగావాట్లకు పెరిగింది. ఇందులో థర్మల్ విద్యుత్ వాటా 7,180 మెగావాట్లు, జలవిద్యుత్ వాటా 2,441.76 మెగావాట్లు, సౌర విద్యుత్ వాటా 3.2 మెగావాట్లుగా ఉంది. 2024-25లో 26,960.18 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరగ్గా, 2025-26లో ఇది 32,568.89 మిలియన్ యూనిట్లకు పెరిగిందని వివరించింది. అలాగే 2025-26లో 6,912.42 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్ ఉత్పత్తి జరిగిందని, నిర్దేశిత లక్ష్యం 3,931.69 మిలియన్ యూనిట్లతో పోలిస్తే ఇది దాదాపు 3 వేల మిలియన్ యూనిట్లు అధికమని పేర్కొంది. సింగరేణి 25 మిలియన్ యూనిట్లను, కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలు 64 మిలియన్ యూనిట్లను అందిస్తుండగా, మిగిలిన విద్యుత్‌ను బయటి నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలియచేసింది.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
(ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)
(CIN : L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001

**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

ఇది ఇలా ఉండగా, "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (చట్టం, 2002 (54 ఆఫ్ 2002) దాని క్రింద **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)** యొక్క అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13 (12) [నియమం 3] తో చదవబడే అధికారాలను వినియోగించుకుంటూ, నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని **రూ.14,93,049/- (రూపాయలు పధ్నాలుగు లక్షల తొంభై-మూడు వేల నలభై-తొమ్మిది మాత్రమే)** నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు తిరిగి చెల్లించాలని రుణగ్రహీత **కాశేశ్వరి గుజ్జేటి (రుణగ్రహీత), బాల్ కిషన్ గుజ్జేటి (సహ-రుణగ్రహీత), (రుణ ఖాతా నం. 22630000064830)**ను కోరుతూ **15-జూలై-26**న డిమాండ్ నోటీసు జారీ చేశారు.

ఇది ఇలా ఉండగా, **ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్,** ఏప్రిల్ 1, 2024 నుండి అమల్లోకి వచ్చేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలీన పథకం ద్వారా **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** తో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ద్వారా, పైన పేర్కొన్న రుణ ఖాతా **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** కు బదిలీ చేయబడింది. ఇందులో మంజూరు చేయబడిన క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించాల్సిన సొమ్ము మొత్తం తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించి అంతర్లీన భద్రత మరియు భద్రతా వడ్డీతో సహా కానీ వీటికే పరిమితం కాదు.

రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారుడు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, **13వ రోజున అక్టోబర్ 2026 సంవత్సరం** సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, క్రింద వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీత/తనఖాదారునికి మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడుతోంది.

ముఖ్యంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో జరిగే ఏదైనా లావాదేవీలు **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)** యొక్క **రూ.14,93,049/- (రూపాయలు పధ్నాలుగు లక్షల తొంభై-మూడు వేల నలభై-తొమ్మిది మాత్రమే) 15-జూలై-26** నాటికి మొత్తానికి మరియు పూర్తి చెల్లింపు వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులకు లోబడి ఉంటాయి.

"సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను నియమం 8 (6)తో చదవడం ద్వారా రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది."

**స్థిరాస్తుల యొక్క వివరణ**

సర్వే నెం. 308/^E1లో ఉన్న నిర్మాణంలో ఉన్న ఇంటి (నెం. కేటాయించబడలేదు) ఆస్తికి సంబంధించిన మొత్తం ప్రాంతం 149 చదరపు గజాల విస్తీర్ణంలో చిట్టాపూర్ గ్రామం, దుబ్బాక మండలం, సిద్దిపేట జిల్లాలో ఉంది మరియు దానికి సరిహద్దుగా:

**తూర్పు: పెద్ద రామచంద్రా రెడ్డి గారి ఖాళీ స్థలం, పడమర: 18 అడుగుల రోడ్డు, ఉత్తరం: విక్రేత యొక్క మిగిలిన ఖాళీ స్థలం, దక్షిణం: విక్రేత యొక్క మిగిలిన ఖాళీ స్థలం.**

తేది : 13/అక్టోబర్/2026 — అధీకృత అధికారి
ప్రదేశం : హైదరాబాద్, తెలంగాణ — AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

రాజకీయాలను, నీతిని విడివిడిగా పరిగణించేవారు ఆ రెండింటిలో దేనినీ, ఎన్నటికీ అర్థం చేసుకోలేరు.

న- రూసో

# భక్తిలో 'అపశ్రుతి'!

భక్తి విశ్వాసాలు భయానక విషాదాలుగా మారుతాయనడానికి శనివారం జరిగిన రెండు దుర్ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. తొక్కిసలాటల చరిత్ర మనకు కొత్తదేం కాదు. ఎక్కడ నలుగురు గుమిగూడినా అదే సమస్య. అనుభవాలు వాటి వలన కలిగిన గుణపాఠాలు నేర్చుకునేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. అదే భారతీయుల దురదృష్టం. తాజాగా కోల్‌కత్తా దుర్గామాత మందిరంలో తొక్కిసలాట జరిగి 19 మంది అమ్మవారి భక్తులు అసువులు బాసారు. 40 మంది క్షతగాత్రులై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇలాంటి సంఘటనలే మహిమాన్విత అమ్మవార్ల ఉనికిని ప్రశ్నించే పరమతస్థులకు అవకాశం కల్పిస్తాయి. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కోల్‌కతాలో జరిగిన మరో ప్రమాదంలో 14 మంది భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఒకేరోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన దుస్సంఘటనల్లో కనీసం 33 మంది పైగా బలైపోయారు. వారంతా భక్తులే. ఎంతో భక్తి పారవశ్యంతో వారు దుర్గామాతను, శీతలామాతను దర్శించుకోవచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడమంటే ఆయా కుటుంబాలకు ఎంత తీవ్రమైన శోకాన్ని మిగిల్చింది. ఎవర్ని అనుకుని ఏం లాభం? ఇలాంటి సందర్భాల్లో అత్యంత జాగరూకత వహించాల్సిన ప్రభుత్వాధికారులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి ఘోర ప్రమాదాలు జరిగి ఉండేవి కాదు. ఎలా చూసినా దీన్ని ఖచ్చితంగా మానవ తప్పిదంగానే భావించాలి. భక్తులుగా ఉన్న మానవులదా? అన్ని విధాలా భద్రతా చర్యలుతీసుకుని మానుష రూపంలో ఉన్న అధికారులదా? అని విశ్లేషించుకుంటే ఎటు నుంచి ఎటు చూసినా మానవ తప్పిదమేనని సర్వత్రా చర్చ జరుగుతోంది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలోని 4 శతాబ్దాల నాటి చరిత్ర గల శీతలామాత ఆలయం అత్యంత మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధి చెందింది. శరన్నవరాత్రులంటే భక్తులు అమ్మ దయ కోసం పరితపిస్తుంటారు. శీతలామాత దర్శనార్థం ఆ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. భక్తుల భద్రత రీత్యా ఆ ఆలయ ప్రాంత పరిసరాల్లోకి భారీ వాహనాల రాకపోకలను ప్రభుత్వం ముందుగానే నిషేధించినా మృత్యుశకటం లారీ రూపంలో వచ్చి భక్తులను మింగేసింది. వారంతా ఆ లారీ చక్రాల కింద పడి నలిగిపోయారు. ఒక్కసారిగా లారీ మీదకు వచ్చేసరికి వారెవరూ తప్పించుకోలేకపోయారు. అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో చిమ్మచీకటిగా ఉండే సమయంలో చిన్నోర్ వైపు నుంచి ధాన్యం బస్తాల ఓవర్‌లోడ్‌తో వస్తున్న లారీ ఆ ప్రాంతంలోకి ప్రవేశించింది. భారీ వాహనాలకు ఆంక్షలు ఉన్న ప్రాంతంలోకి లారీ రావడం గమనించిన పోలీస్ చెక్ పోస్టు వద్ద ఆ లారీని నిలువరించేందుకు ప్రయత్నించినా ఆపలేకపోయారు. రోడ్ మీద పెట్టిన పోలీస్ బారికేడ్లను, స్టాపర్లను ఛేదించుకుంటూ వేగంగా దూసుకెళ్లింది. కనురెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదాన్ని ఎవరూ తప్పించుకోలేకపోయారు. లారీ అదుపుతప్పింది. ఆలయం వెలుపల ఉన్న గోడను, ప్రధాన గేటును బలంగా ఢీకొంది. అమ్మవారి వేకువఝాము దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులపైకి ఆ లారీ స్వైరవిహారం చేసింది. దాంతో హాహాకారాలు మిన్నుముట్టాయి. తీవ్ర వేగంతో లారీ దూసుకురావడంతో ఆలయ ప్రహారీగోడ కూలిపోయింది. దాని శిథిలాల కింద మరెంతో మంది భక్తులు పడిపోగా వారికీ గాయాలయ్యాయి. గతంలో జరిగిన ఏ తొక్కిసలాటలోనూ ఇంతటి భయానక దృశ్యాలను చూడలేదనే అభిప్రాయం భక్తుల్లో కలిగింది.

ఉత్తర కోల్‌కతాలో జరిగిన దుర్ఘటన మరో అపశ్రుతిని తెలియజేస్తోంది. గత తొమ్మిదేళ్లుగా భక్తులు దర్శించుకుని విశేష పూజలు అందిస్తున్న ప్రఖ్యాత చోర్‌గన్ సార్వజనిన్ దుర్గాపూజా పండల్ వద్ద శనివారం రాత్రి 7.40 గంటల ప్రాంతంలో హఠాత్తుగా భారీ వర్షం పడింది. దాంతో జనం ఒక్కసారిగా మండప ప్రాంగణంలోకి దూసుకొచ్చారు. ఇరుకుగా ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ గేట్‌ల వద్ద జనం కిక్కిరిసిపోయి తొక్కిసలాట జరిగింది. ఎంతో మంది అపస్మాకర దశలోకి వెళ్లిపోయారు. వారిలో కొంతమంది చనిపోయారు. 25 మంది గాయపడ్డారు. మరికొందరి పరిస్థితి విషమంగా మారింది. శనివారం జరిగిన రెండు దుర్ఘటనలు శరన్నవరాత్రి భక్తులు విగత జీవులైన ఉదంతాలే. వీటిపై దర్యాప్తులకేం కొదువ. గుణపాఠాలు నేర్వని చోట ఎన్ని సంఘటనలు దాపురించినా బాధ్యుల్ని గుర్తించి చర్యలు తీసుకోకుంటే ఇంతే సంగతులు. భక్తుల ప్రాణాలు హరీ మంటుంటే వైరల్ అవుతున్న దృశ్యాలు చూసి ఆవేదన చెందని వారు ఉండరు. పండుగలు, ఉత్సవాలంటూ పెద్ద ఎత్తున నిర్వహించదలచిన వారెవరైనా ముందస్తు ప్రణాళికలతో అడుగులు వేయాలి. అలా కాకుండా భారీ పండాళ్లు నిర్మించి ఆధునికతతో లక్షలాది మందిని ఆకర్షించాలకున్నపుడు అందుకు తగ్గ ఏర్పాటు చేయాలి. ప్రవేశనిష్క్రమణ మార్గాలు ఇరుకుగా ఉన్న చోట తీసుకోవాల్సిన జాగ్రత్తలకూ ఓ పద్ధతి ఉంటుంది. పండుగ రోజుల్లో భక్తుల రద్దీ ఉంటుందింది కనుక దైవకార్యాలు జరిగే చోట కనీసం కిలోమీటరు దూరంలోనైనా 'నో వెహికిల్ జోన్'ను అమలు చేయాలి. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తీరిగ్గా ప్రమాదానంతరం విశ్లేషించుకుంటే ప్రయోజనాలేమీ ఉండవు. గ్వాలియర్ ప్రమాదం విషయంలో బారికేడ్ లున్నా భారీ వాహనప్రవేశాన్ని తీవ్రమైన భద్రతాలోపంగా పరిగణించాల్సిందే. భద్రతా వ్యవస్థల వైఫల్యాన్ని పదే పదే చెప్పుకోవాల్సి రావడం సిగ్గుచేటులా భావించాలి. బాధ్యులైన వారు స్పందించడమొక్కటే పరిష్కారం. ●

ప్రమాణము అంటే వెనుకంజ వేయని నిశ్చయబుద్ధి, దృఢమగు నిశ్చయం లేకపోతే అభివృద్ధికి అవకాశమే ఉండదు.



మహాత్మా గాంధీ

భూమి మీద మనిషిని మించిన గొప్ప అంశం లేదు. అలానే మనిషిలో మెదడును మించింది లేదు.



విలియం హామిల్టన్

## ప్రజావాక్కు

### ఆఫీసుల్లో దేవుళ్ల బొమ్మలు అవసరంలేదు

ప్రభుత్వ కార్యాలయాలలో మతపరమైన బొమ్మలు, చిహ్నాలను తొలగించాలి. మనది సెక్యులర్ దేశం. దేవుడు మతం వ్యక్తిగతంగా ఉండాలి. ప్రభుత్వపరంగా ప్రోత్సహించరాదు. అందుకోసం రూపాయి కూడా ప్రభుత్వధనం ఉపయోగించరాదు. ఈరోజు ప్రభుత్వకార్యాలయాలలో ఎక్కడచూసినా దేవుళ్లబొమ్మలు, మతపరమైన చిహ్నాలు దర్శనమిస్తున్నాయి. ఎవడు ఏ మతం అయితే ఆ మత గుర్తులు. దాదాపు అందరూ సాయంత్రానికి మా రెండు జేబులు నిండాలి అనుకొని దణ్ణాలు పెట్టుకుంటారు. మా దొల్లతనం బయటపడకూడదు. పైఅధికారి తిట్టకూడదు. దాదాపు అందరూ ఇంతే. అలా మీ ఇంటిదగ్గర పెట్టుకొని రండి. కార్యాలయాలు మీ ఇల్లు కాదు. మీ పనులు మీరు సరిగా చేసుకుంటే యెవరికి భయపడాల్సిన అవసరం ఉండదు. పని చేసినా చెయ్యకపోయినా ఒకటో తేదీకి మా జీతం మాకు వస్తుంది అనుకునే వారే ఎక్కువమంది.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఎల్‌నినో ప్రభావం!

ఎల్‌నినో ప్రభావం అందరి రైతుల పైన ఉంటుందా లేక కొందరి రైతుల మీదనే ఉంటుందా అన్నది ఆలోచించాలి. ఎందుకంటే ఉపాధి హామీ ద్వారా అందుతున్న సాయం సన్నచిన్న కారుకే అందుతుండడం ఈ ప్రత్యేక సమయంలో కరెక్ట్ కాదు ప్రభుత్వమే పంటలు వేయొద్దు అని చెపుతున్న ఈ తరుణంలో ఈ ఆంక్షలుఎందుకు ఎల్‌నీనో ప్రభావం అందరూ రైతుల పైన ఉంటుంది. కదా మరి అందరి మంచి కోరాలికదా. అయితే ఉపాధిహామీ ద్వారా సన్నచిన్న కారు రైతులకు సహాయం చేయాలి.

- భారత అవినాష్, జనగామ

### జర్నలిస్టుల పై దాడులు ఖండించదగినవే!

దేశ రాజధాని ఢిల్లీ 'జంతర్ మంతర్' వేదికగా గత వారంలో జరిగిన సీజేపీ (కాక్రోచ్ జనతా పార్టీ) నిరసనలపై వార్తలు కవర్ చేయడానికి వచ్చిన జర్నలిస్టులపై జరిగిన దారుణ దాడులు తీవ్రంగా ఖండించదగినవి. ప్రజాస్వామ్యం 'నాల్గవ స్తంభం'గా పత్రికా రంగంకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. నిజాన్ని వెలుగులోకి తెచ్చే వారిని లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన దెబ్బ. రక్షించడం అధికారుల ప్రాథమిక విధి అయినప్పటికీ, ఈ దాడులు స్వతంత్ర జర్నలిజాన్ని, ప్రజలు తెలుసుకునే హక్కును అణచివేయడానికి ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి.

- దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

### నీటి ఎద్దడి

గత వేసవి నుంచి హైదరాబాదు మహానగరంలో నీటి కొరత అధికవవుతున్నట్లు తెలుస్తోంది. ఈఏడాది వర్షాకాలంలో హైదరాబాదులో 26 శాతం దాకా వర్షపాతం తగ్గిందని నివేదికలు తెలుపుతున్నాయి. భూగర్భజలాలు కూడా వేగంగా అడుగంటుతున్నాయి. నగరంలో ఇంకుడు గుంతలు అంతంత మాత్రానే ఉండటం శోచనీయం. ప్రస్తుతం ప్రతిరోజు ఏడు వేల ట్యాంకర్లకు పైగా హైదరాబాదు మెట్రో నేటి సరఫరా సంస్థ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ఇక అనధికారంగా బోరు బావుల నుంచి ఎంత నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నారో లెక్కలు లేవు. ధనికులు నివసించే ప్రాంతాలైన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హఫీజ్‌పేట్, మణికొండ వంటి ప్రాంతాలలో నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. నీటిని పొదుపుగా వాడుకోవటం మంచి పద్ధతి. హైదరాబాదు మెట్రో నీటి సరఫరాసంస్థ నీటి ట్యాంకర్లను ఎవరికి సరఫరా చేస్తున్నారోపూర్తిగా తనిఖీచేసి, వారివారి నివాసాల్లో ఇంకుడు గుంతలు నిర్వహిస్తున్న వారికే నీటిని సరఫరా చేయాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### భగవంతుని కరుణా కటాక్షం లభించాలంటే..

పుణ్యమంతా తమకే దక్కాలనే ఉద్దేశంతో కొందరు 'భక్తి' అనే ముసుగులో అంగరంగ వైభోగాలకు, ఆడంబరాలకు వెళుతూ ఉంటారు. దీనికి కారణం మన చుట్టూ ఉన్న వాతా వరణం, అవగాహనా రాహిత్యం. ఇలాంటి భక్తి ఎప్పటికీ నిజమైన భక్తి అనిపించుకోదు. హృదయంలో నిత్యం భగవంతుడిని నిలుపుకొని పత్రమోత్ర, ఫలమో, పుష్పం లేదా నీటినిగాని భక్తితో భగవంతుడికి సమర్పించిన వారికి భగవంతుడి అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. అంతేకాదు ఎదుటివారినిగౌరవిస్తూ, వారిలో దేవుడ్ని చూడటమే నిజమైన భక్తి. నన్ను మించిన వారు లేరు అనే అహంభావం, అహంకారంతో ఎన్ని పూజలు చేసినా ప్రయోజనంశూన్యం.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### విపత్తును సమర్థంగా ఎదుర్కొందాం

దేశవ్యాప్తంగా ఎల్‌నినో విపత్తుతో వర్షాలు కురవకపోవడంతో ఒక వైపు జలాశయాలు అడుగంటాయి. విద్యుత్ సంక్షోభం ఎదురయ్యే విపత్కర పరిస్థితులు రాబోతున్నాయి. కావున రాబోయే ఎనిమిది నెలల ప్రజలు అవసరాల మేరకే నీటిని సమృద్ధిగా వాడుకుంటూ అదే విధంగా కరెంట్ వినియోగం కూడావీలైనంత తగ్గించుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. భవిష్యత్‌లో ఎన్నడు లేనంతగా ఉంది..

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పోలీసులలో పెరుగుతున్న మానవీయ దృక్పథం

*క్రమేపీ మానవీయ కోణంతో పోలీసులందరూ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తారని ఆశించటంలో తప్పులేదు! అక్టోబర్ 21 నాడు వృత్తిలో ప్రాణాలు అర్పించుకున్న పోలీసులకు దేశమంతటా నివాళులు అర్పిస్తారు! ఈ సందర్భంగా హెచ్చు సంఖ్యలో మహిళా పోలీసు అధికారులు మన దేశంలో వృత్తి నిర్వహణకు ప్రజల మధ్యకు వస్తున్నారు అని గుర్తు చేసుకోవటం ఒక విధంగా మంచిదే! కేవలం త్యాగాల కోసమే మిలటరీ వారైనా, పోలీసులైనా వున్నారనుకుంటే వారి వృత్తిని అర్థం చేసుకోలేని వారమవుతాము! రక్షణ కోసం దేశంఆవల ఆర్మీ జవాన్ ఉంటే దేశంలో అందరి రక్షణ కోసం రక్షణ భటుడు ఉన్నాడని ప్రజలు భావిస్తేనే యూనిఫాంలో ఉన్న వారి వృత్తికి ఒక అర్థమూ ప్రయోజనమూ ఉంటుందన్న ఊహ ప్రజల్లో పెరిగిన నాడే పోలీసులు మరింత మానవీయ దృక్పథంతో పనిచేయటానికి అవకాశం వుంటుంది!*



రావులపాటి సీతారాంరావు

పోలీసులకు 'హ్యూమన్ ఏంగిల్' లేదని ప్రతినిత్యమూ ప్రశ్నించి, తప్పు పట్టే మేధావులకూ, మీడియా వారికీ, రాజకీయ నాయకులకూపోలీసులను రిక్రూట్ చేసేవారు, వారిని దృష్టిలో పెట్టుకొని కాకుండా ప్రజా సంక్షేమం, శ్రేయస్సు, ముఖ్యంగామహిళల పట్ల జరిగే నేరాలను, శోధించి పరిష్కరించటానికి, మానవతా దృక్పథంతో పాటు నేరస్థులపట్ల నిష్కర్షగా వుండటానికి అన్నట్లుగా ఎక్కువ సంఖ్యలో మహిళా ఉన్నతాధికారులను ఎంపిక చేయటం శుభ పరిణామంగా చెప్పుకోవాల్సిన అవసరం వుంది! అయితే వీరికి కర్తవ్య నిర్వహణలో బాధితులే కాకుండా, రాజకీయాలను వృత్తిగా పెట్టుకున్నవారు ఏవిధంగా సహకరిస్తారో చూడాల్సి వుంది! నేషనల్ పోలీసు అకాడమీలో శిక్షణ పొందిన 151 మంది ఐపియస్ ఆఫీసర్లు విధి నిర్వహణ కోసం ప్రజల మధ్యకు వస్తున్నారు. అందులో 37 మంది లేడీ పోలీసు ఆఫీసర్లు వున్నారు. తెలంగాణా పోలీసులు రిక్రూట్ చేసుకున్న లేడీ (గ్రూప్-II) డియస్‌పిలు 38 (112 మందిలో) మంది వున్నారు. తెలంగాణాలో మొత్తం మహిళా పోలీసుల సంఖ్య 6700 దాకా వుండొచ్చు. ఇది 10 శాతం పూర్తి పోలీసుల సంఖ్యలో వున్నవారిగా ఉజ్జాయింపు లెక్కలు చెబుతున్నాయి! గర్వకారణంగా భాసిల్లే విషయం ఏమిటంటే వారిలో పోస్టు గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేట్స్ హెచ్చు సంఖ్యలో వుండటం! వీరంతా వృత్తిలోచేరిన తర్వాత ఏవిధంగా విధులు నిర్వర్తిస్తారో, ప్రజలకు సహాయకారిగా వుండగలరో ఇప్పుడే అంచనా వేయలేం! ట్రయినింగ్లో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన వారు క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో రాణించలేకపోవచ్చు! పోలీసు వృత్తిలోని వారు మగవారైనా ఆడవారైనా తాము పోలీసులమయ్యాము సెల్యూట్లు స్వీకరించటం గౌరవనీయం! సెల్యూట్స్ యూనిఫాంలో అందుకున్నప్పుడు కానీ, పెట్టినప్పుడు కానీ, తాము సొసైటీలో ప్రత్యేక వ్యక్తులమనే భావన వారిలో కలగటం సహజం! కాని కాప్‌లో దాగివున్న ఆ భావన క్రమేపీ నెత్తిలోకి మరోవిధంగా ప్రవేశిస్తే, వారు వృత్తి నిర్వహణబదులు అధికార పటాటోప ప్రదర్శనలోనే మునిగి తేలుతుంటారు! కారణాలు అనేకం!మచ్చుకు ఎవరినైనా యూనిఫాంలో వున్నపుడు దబాయించవచ్చు అనే భావన, గుంపు మధ్యలో వున్న తాను వుంటే తన అధికారాన్ని గుంపులోని వారు గుర్తించి తక్షణం తాను చెప్పింది చేయాలనే తప్పుడు ఆలోచనతో పాటు, యూనిఫాం సమస్త అధికారాలుఇచ్చింది అని విర్రవీగే దుర్లక్షణం చాలామందికి యూనిఫాంతో సంక్రమిస్తాయి! అప్పుడే మంచి పోలీసు తాను ప్రజలలో ఒక భాగమని తాను విధినిర్వహణ నిమిత్తం ఈ ఉద్యోగంలో వున్నానని, అధికారాలు స్వతహాగా వేసుకున్న యూనిఫాంలో లేవని, చట్టాలు అమలు చేయటానికే అవి వున్నాయన్న చిన్న ఆలోచన వుంటే సహజంగా అలాంటి పోలీసులకు వృత్తి నిర్వహణలో మానవతా దృక్పథం దానంతట అదే వస్తుంది! దురదృష్టవశాత్తు అది చాలా తక్కువ మందిలో వస్తుండటంతో పోలీసులు ప్రజలతో సన్నిహితంగా, శ్రేయోభిలాషులుగా, రక్షణ చేసే వారిగా, ఆపదలో వున్నవారికి అండగా వుండే వారుగా గుర్తింపు పొందలేకపోతున్నారు!



ఈమధ్య బయటకు వచ్చిన గణాంకాలు ఆశ్చర్యం గొలిపే విషయాన్ని బహిర్గతం చేస్తున్నాయి! పీస్ టైంలో ఆర్మీ జవానుల కంటే మన దేశంలో పోలీసులే ఎక్కువ సంఖ్యలో ప్రాణాలు అర్పిస్తున్నారని లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి! ఈ మధ్యన దిగువస్థాయి పోలీసులకు జీతాలు కొంతమేర పెరిగాయి కానీ ఇంతకు మునుపు కానిస్టేబుల్‌కు అటెండర్ కంటే తక్కువ జీతం వుండేదని పోలీసులను అభిమానించే వారు చెప్తుండే వారు! ఎవరి జీతం ఎంత అనే విషయంలోకి లోతుగా పోకూడదు. ప్రభుత్వోద్యోగం ఒకప్పుడుఎంత తక్కువ జీతం వున్నా గొప్పగా వుండేది! పోలీసుకు ఎంత జీతం వస్తుందని సమాజం ఆరా తీయదు! పోలీసులకు ఇన్ని అధికారాలా? అని మాత్రమే విస్తుపోతుంది! ఎప్పుడూ చెప్పే విషయమే! ఒక గ్రామంలో 100 మంది వుంటే అందులో 90 మంది ఎన్నడూ పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కని వారే వుంటారు! మిగతా పది మందిలో కేవలం 2-3 శాతం మాత్రమే నేరస్థులుగా పరిగణింపబడే వారు వుంటారు! ఈమధ్య కాలంలో సైబర్ నేరాలు, వైట్ కాలర్ నేరాలు పెరగటం వల్ల ఆ శాతం 5శాతంకు వచ్చివుండొచ్చు! కేవలం 10 శాతం మంది కోసమే పోలీసు వ్యవస్థ వుంటుంది అన్న హ్రస్వ దృష్టితో చూడకూడదు! దొంగతనాలు, దోపిడీల్లాంటి నేరాలు ప్రక్కన పెట్టే పోలీసులకు విధినిర్వహణలో తల ప్రాణం తోకకు వస్తుంది! పాత రోజుల్లో పోలీసుల ట్రయినింగ్లో చెప్పేవారు! 'ఊళ్ళోకి పులి వస్తే పోలీసులకు ఫోన్ చేయండ్రా' అని పెద్దలు పురమాయించే వారట! పోలీసులూ మానవమాత్రులే, పులిని ఏవిధంగా నియంత్రించగలరు అన్న చిన్నపాటి ఆలోచన ఆ రోజుల్లో కలగకపోయేది! ఈ రోజుల్లో సమాజానికి పోలీసులు 'సర్వ రోగనివారణ' కు మాత్ర ఇచ్చే డాక్టర్‌గా మారటంతో అసలుచిక్కంతా అక్కడే వస్తుంది! పోలీసులకు పని చెప్తే అన్నీ పరిష్కరింపబడతాయన్న దృక్పథం పోలీసుల ప్రాధాన్యతను పెంచుతుందేమో కానీ, వృత్తి నిర్వహణకు సహకరించదు. ప్రస్తుతపరిస్థితుల్లో మహిళలపై అనేకరకాల నేరాలు పెరిగాయి! అఘాయిత్యాలతో పాటు మాటల్లో చెప్పలేని విధంగా హింసతో కూడుకున్న దాష్టీకం పెరగటం అత్యంత దారుణంగా హేయనీయంగా భావించక తప్పదు! అందుకనే మహిళా పోలీసుల సంఖ్య పెరగటం మనం స్వాగతించక తప్పదు! ఇప్పటిదాకా కోపంగా చూసే తండ్రీ, బెత్తంతో వుండే పంతులూ పోలీసులో కనపడేవారు! మహిళా పోలీసులు వచ్చిన తరువాత ఆప్యాయంగా చూసే తల్లినీ, కష్టపడుతుంటే దయా హృదయంతో ఆదుకునే తల్లిని మహిళా పోలీసులో చూడగలం అన్న ఆశావాదంతో వుండగలుగుతే, ఆవిధంగా వుండటానికి ప్రజలు సహకరించగలుగుతే మరో కోణం పోలీసులు అందించగలరు! కిరణ్ బేడీ మొదటి మహిళా ఐపియస్‌గాఎంత గొప్పగా, ఎన్ని విధాలుగా వృత్తిలో రాణించగలిగారో చరిత్ర చెబుతుంది. మన తెలుగు రాష్ట్రాలలో గూడా గొప్పమహిళా పోలీసు ఆఫీసర్లు బరిలో దిగి విధి నిర్వహణలో మగ పోలీసులకు ఏమాత్రం తీసిపోమని నిరూపించుకుంటున్నారు! క్రమేపీ మానవీయ కోణంతో పోలీసులందరూ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తారని ఆశించటంలో తప్పులేదు! అక్టోబర్ 21 నాడు వృత్తిలో ప్రాణాలు అర్పించుకున్న పోలీసులకు దేశమంతటా నివాళులు అర్పిస్తారు! ఈ సందర్భంగా హెచ్చు సంఖ్యలో మహిళా పోలీసు అధికారులు మన దేశంలోవృత్తి నిర్వహణకు ప్రజల మధ్యకు వస్తున్నారు అని గుర్తుచేసుకోవటం ఒక విధంగా మంచిదే! కేవలం త్యాగాల కోసమే మిలటరీ వారైనా, పోలీసులైనా వున్నారనుకుంటే వారి వృత్తిని అర్థం చేసుకోలేని వారమవుతాము! రక్షణ కోసం దేశంఆవల ఆర్మీ జవాన్ ఉంటే దేశంలో అందరి రక్షణ కోసం రక్షణ భటుడు ఉన్నాడని ప్రజలు భావిస్తేనే యూనిఫాంలో ఉన్న వారి వృత్తికి ఒక అర్థమూ ప్రయోజనమూ ఉంటుందన్న ఊహ ప్రజల్లో పెరిగిన నాడే పోలీసులు మరింత మానవీయ దృక్పథంతో పనిచేయటానికి అవకాశం వుంటుంది! ●

# సవాలుగా మారుతున్న నకిలీ సర్టిఫికెట్లు!

డా. ఛేవూరి సతీష్ కుమార్

విద్య సమాజ అభివృద్ధికి పునాది. ఒక దేశం అభివృద్ధి చెందాలంటే విద్యా రంగం బలంగా ఉండాలి. ఈ రంగంలో అధ్యాపకుల పాత్ర చాలా ముఖ్యమైనది. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అధ్యాపకులు విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాకుండా, వారికి మంచి ఆలోచనలు, నైతిక విలువలు, జీవితంలో ముందుకు సాగడానికి అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తారు. అందువల్ల అధ్యాపకులకు సరైన విద్యార్హతలు ఉండటం, నిజాయితీగా తమ విధులను నిర్వహించడం ఎంతో అవసరం. అయితే, కొంతమంది వ్యక్తులు అధ్యాపక ఉద్యోగాలు పొందడానికి నకిలీ విద్యా ధ్రువపత్రాలను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు విద్యా రంగంలో ఆందోళన కలిగిస్తున్నాయి. నిజమైన విద్యార్హతలు లేకపోయినా ఉన్నట్లు చూపించడం, తప్పుడు సర్టిఫికెట్లను సమర్పించడం విద్యా వ్యవస్థలోని నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. ఇటువంటి చర్యల వల్ల కష్టపడి చదివి, నిజాయితీగా అర్హతలుసాధించిన అభ్యర్థులకుఅన్యాయం జరిగే అవకాశం ఉంది. నకిలీ సర్టిఫికెట్ల సమస్య అధ్యాపకుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసే సమయంలో కొంతమంది తమ విద్యార్హతలను నిరూపించడానికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ వంటి సర్టిఫికెట్లను సమర్పిస్తారు. ఈ సర్టిఫికెట్లు నిజమైనవో కాదో పరిశీలించడం చాలాముఖ్యం. కొన్ని సందర్భాల్లో నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు, తప్పుడు విద్యార్హత పత్రాలు లేదా పరిశోధనకు సంబంధించిన నకిలీ పత్రాలను ఉపయోగించే అవకాశం ఉంటుంది. అధ్యాపక ఉద్యోగం అనేది కేవలం జీతం పొందే ఉద్యోగం మాత్రమే కాదు. అది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతతో కూడుకున్న వృత్తి. అలాంటి వృత్తిలోకి రావడానికి తప్పుడు సర్టిఫికెట్లను ఉపయోగించడం నిజాయితీకి విరుద్ధం. నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా అధ్యాపకుల నియామకాలు జరిగితే విద్యా రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. సరైన విద్యార్హతలు లేని వ్యక్తులు అధ్యాపకులుగా నియమితులైతే విద్యార్థులకు నాణ్యమైనబోధన అందకపోవచ్చు. దీనివల్ల విద్యార్థుల జ్ఞానం, నైపుణ్యాలు, భవిష్యత్తు అవకాశాలు ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. అదేవిధంగా, నిజాయితీగా చదివి అర్హతలుసాధించిన అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను కోల్పోవచ్చు. దీనివల్ల నియామక వ్యవస్థపైనిరాశ, అసంతృప్తి పెరుగుతాయి. కళాశాలలు, విశ్వవిద్యాలయాలపై ప్రజలకు ఉన్ననమ్మకం కూడా తగ్గవచ్చు. అందువల్ల నకిలీ సర్టిఫికెట్ల సమస్యను సాధారణ విషయంగా చూడకూడదు. విద్యా ప్రమాణాలను కాపాడటానికి ఈసమస్యపై తగిన శ్రద్ధ చూపాలి. సర్టిఫికెట్ల పరిశీలన, చట్టపరమైన చర్యలు అధ్యాపకుల నియామకాల్లో విద్యా ధ్రువపత్రాల పరిశీలనతప్పని సరిగా జరగాలి. అభ్యర్థులు సమర్పించిన డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాల ద్వారా నిర్ధారించాలి. అవసరమైన చోట అర్హత పరీక్షల ధ్రువపత్రాలు, పరిశోధన వివరాలు, ఇతర విద్యా రికార్డులను కూడా పరిశీలించాలి. ఏదైనా సర్టిఫికెట్‌పైఅనుమానం వచ్చినప్పుడు సంబంధిత అధికారులు ఆధారాలను సేకరించి విచారణ జరపాలి. సర్టిఫికెట్ నకిలీ అనినిర్ధారణ అయితే, వర్తించే చట్టాలు, ఉద్యోగ నియమాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి ఉద్యోగ నియామకాన్ని రద్దు చేయడం, క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించడం సాధ్యమవుతుంది. నకిలీ సర్టిఫికెట్లను అరికట్టడంలో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ నియామక సంస్థల ముఖ్యమైన బాధ్యత ఉంది. డిజిటల్ విధానాల ద్వారా ధ్రువపత్రాలను పరిశీలించడం కూడా ఈ సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే, నకిలీ సర్టిఫికెట్లకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి విచారించడానికి స్పష్టమైన విధానాలు ఉండాలి. తప్పును గుర్తించిన వారు భయపడకుండా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాలి. అదే సమయంలో, వ్యక్తిగత కక్షలు లేదా ఇతర కారణాలతో నిజాయితీగా పనిచేస్తున్న అధ్యాపకులపై తప్పుడు ఆరోపణలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ●

# ఎల్‌నినో ముప్పును దేశం ఎదుర్కొనగలదా?

తిప్పర్తి శ్రీనివాస్

ప్రకృతి ప్రకోపాలకు మానవాళి ఎప్పటికప్పుడు సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. ఒకవైపు వాతావరణ మార్పులు, మరోవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఇంకోవైపు అస్థిరంగా మారుతున్న రుతుపవనాలు ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈనేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడేవర్షాభావ పరిస్థితులు దేశానికి పెనుసవాలుగా పరిణమించే ప్రమాదంఉంది. ముఖ్యంగా వ్యవసాయంపై అధికంగా ఆధారపడే భారతదేశంలో కరవు ఛాయలు అలుముకుంటే దాని ప్రభావం కేవలం పంటలకే పరిమితం కాదు. రైతుల ఆదాయం, గ్రామీణ ఉపాధి, ఆహార ధరలు, తాగునీటి లభ్యత, విద్యుత్ ఉత్పత్తి, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. అందువల్ల ఎల్‌నినోను కేవలం వాతావరణ పరిణామంగాకాకుండా, వ్యవసాయ, ఆర్థిక, సామాజిక రంగాలకు సంబంధించిన సమగ్ర సవాలుగా పరిగణించాల్సిన అవసరం ఉంది.

ప్రశాంత మహా సముద్రంలోని మధ్య, తూర్పు భూమధ్య రేఖా ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే పెరగడాన్ని ఎల్‌నినోగా వ్యవహరిస్తారు. ఈపరిణామం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నమూనాలను ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో నైరుతి రుతుపవనాల ప్రవర్తనపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉంది. సాధారణంగా ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడినప్పుడు భారతదేశంలో వర్షపాతం తగ్గే ప్రమాదం ఉన్నప్పటికీ, ప్రతి ఎల్‌నినో సంవత్సరంలోనూ కరవు ఏర్పడుతుందని చెప్పలేం. సముద్ర ఉష్ణోగ్రతలతోపాటు ఇతర వాతావరణ పరిస్థితులు, రుతుపవనాల గమనాన్ని బట్టి వర్షపాతం మారుతూ ఉంటుంది. అయితే వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎండల తీవ్రత, అసాధారణ వర్షాలు, దీర్ఘకాలిక వర్ష విరామాలు వ్యవసాయానికి మరింత అనిశ్చితిని సృష్టిస్తున్నాయి. వర్షపాతం సాధారణంగానే ఉన్నా, అది ఒకే సమయంలో కురిసి మిగిలిన కాలంలో వర్షాభావం ఏర్పడితే పంటలకు నష్టం వాటిల్లుతుంది. అందువల్ల వర్షపాతం పరిమాణంతోపాటు దాని విస్తరణ, సమయపాలన, భౌగోళిక పంపిణీని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. భారతదేశంలో కోట్లాది కుటుంబాలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. సాగునీటి సదుపాయాలు విస్తరించినప్పటికీ, అనేక ప్రాంతాల్లో రైతులు ఇప్పటికీ వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోతే విత్తనాలు మొలకెత్తడం నుంచి పంట చేతికొచ్చే దశవరకు అనేక సమస్యలు ఎదురవుతాయి. వర్షాభావం దీర్ఘకాలం కొనసాగితే పంటల దిగుబడులు తగ్గి రైతుల ఆదాయానికి గండిపడుతుంది. వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలు ఆయా ప్రాంతాల్లో నెలకొనే వాతావరణ పరిస్థితులను బట్టి వర్షాల కొరతకు గురయ్యే అవకాశంఉంది. పంటల పెరుగుదల కీలక దశల్లో తగినంత నీరు అందకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గవచ్చు. మరోవైపు భూగర్భజలాలపై ఆధారపడే రైతులు బోరుబావుల్లో నీటి మట్టాలు పడిపోవడంతో అదనపు ఖర్చులను భరించాల్సివస్తుంది. డీజిల్, విద్యుత్,



నీటిపారుదల పరికరాల నిర్వహణ వ్యయాలు పెరిగి సాగు మరింత భారంగా మారుతుంది. ఇప్పటికే పెట్టుబడుల పెరుగుదల, పంటలకు గిట్టుబాటు ధరల సమస్యలు, మార్కెట్ ఒడిదుడుకులతో సతమతమవుతున్న రైతులకు కరవు మరో గుదిబండగా మారే ప్రమాదం ఉంది. పంట నష్టంతో అప్పులు తీర్చలేని పరిస్థితి ఏర్పడితే గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలహీనపడుతుంది. రైతును కరవు నుంచి కాపాడటం అంటే దేశ ఆహార భద్రతను, గ్రామీణ జీవన వ్యవస్థను కాపాడటమేనన్న విషయాన్ని పాలకులు గుర్తించాలి. రైతులసంక్షేమం గురించి ప్రకటనలు చేయడం కంటే, సంక్షోభం రాకముందే వారిని ఆదుకునే కార్యాచరణ రూపొందించడం ఎంతో ముఖ్యం. తెలంగాణ రాష్ట్రంలో కూడా వర్షాభావపరిస్థితులు ఏర్పడితే వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాధార సాగు అధికంగా ఉండటంతోపాటు భూగర్భజలాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో నీటి లభ్యత కీలక అంశంగా మారింది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో వర్షాలు ఆలస్యమైతే విత్తనాల ఎంపిక నుంచి పంటల సాగు ప్రణాళిక వరకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు వ్యవసాయానికి కీలకమైనప్పటికీ, నీటి లభ్యతను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అంచనా వేయడం అవసరం. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలున్నాయనే కారణంతో విచక్షణారహితంగా నీటిని వినియోగించకూడదు. తాగునీటి అవసరాలు, పంటల ప్రాధాన్యత, భవిష్యత్తు వర్షపాతం అంచనాలను దృష్టిలో ఉంచుకుని నీటి పంపిణీపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. రైతులకు వర్షపాతం అంచనాలను గ్రామస్థాయిలో చేరవేయడం, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడం అత్యవసరం. వర్షాలు ఆలస్యమైనప్పుడు ఏ పంటలు సాగు చేయాలి? ఇప్పటికే వేసిన పంటలకు నీటి కొరత ఏర్పడితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పంట నష్టాన్ని తగ్గించేందుకు ఎటువంటి పద్ధతులు అనుసరించాలి? అనే అంశాలపైవ్యవసాయ నిపుణులు రైతులకు నిరంతరం మార్గదర్శకత్వం అందించాలి. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంతోపాటు విత్తనాలు, ఎరువులు, పంటల బీమా, వ్యవసాయ సలహాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలి. కరవు ప్రభావం పొలాలకే పరిమితం కాదన్న విషయాన్ని కూడా గుర్తించాలి. పంటల ఉత్పత్తి తగ్గినప్పుడు మార్కెట్లో సరఫరా తగ్గి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే సామాన్య ప్రజల కుటుంబ బడ్జెట్‌పై తీవ్రభారం పడుతుంది. ఇప్పటికే ఆదాయ వ్యయాల మధ్య సమతుల్యత సాధించేందుకు కష్టపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది అదనపు సమస్యగా మారుతుంది. వ్యవసాయ ఉత్పత్తి తగ్గుదలవల్ల ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, రవాణా, నిల్వరంగాలపైనా ప్రభావం పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గితేకూలీలకు ఉపాధి అవకాశాలు క్షీణిస్తాయి. ఫలితంగా గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగే అవకాశం ఉంటుంది. ఈ పరిణామాలన్నీ పరస్పరం అనుసంధానమై దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతాయి. ఈ పరిస్థితులను ఎదుర్కోవాలంటే ఆహార ధాన్యాల నిల్వలను సమర్థంగా నిర్వహించడం, సరఫరా వ్యవస్థను పటిష్టం చేయడం, ధరల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం ప్రభుత్వాల బాధ్యత. ఉత్పత్తి తగ్గే అవకాశమున్న పంటలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేయాలి. కృత్రిమ కొరత సృష్టించే నిల్వదారులపై నిఘా ఉంచాలి. అదే సమయంలో రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటూ వినియోగదారులపై అధిక ధరల భారం పడకుండా సమతుల్య విధానాలను అమలు చేయాలి. ●

## తొక్కిసలాట మృతుల కుటుంబాలకు
# రూ.25 లక్షల పరిహారం

### కుటుంబంలో ఒకరికి ఉద్యోగం: సీఎం సువేందు



**కోల్‌కత్తా, అక్టోబరు 18:** కోల్‌కతాలోని చోర్‌బగాన్ సార్వజనీన్ దుర్గాపూజ పండల్‌లో మహాసప్తమి రోజున జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోగా, 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. వర్షం కురుస్తున్న సమయంలో పూజ నిర్వాహకులు చేసిన ఒక ప్రకటన కారణంగా జనం ఒక్కసారిగా ముందుకు దూసుకురావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించడంతో పాటు వారి వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఈ దుర్ఘటనపై విచారణ జరిపేందుకు కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జోక్యంతో ప్రత్యేక దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. శాంతిభద్రతల నిర్వహణలో విఫలమైన పూజ కమిటీ సభ్యులు, పోలీసులు లేదా సెక్యూరిటీ గార్డులు ఎవరినీ వదిలిపెట్టబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ ఘటనపై సంతాపం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున పీఎంఆర్ఎఫ్ నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రధాని కార్యాలయం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదికను సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బాధితులను ఆదుకోవడానికి చర్యలు చేపడుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంతో కోల్‌కతాకు రావలసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఘటన స్థలం వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్న పోలీసులు, బాధ్యులైన వారిపై విచారణ వేగవంతం చేశారు. రద్దీగా ఉన్న ఇతర పూజ పండళ్లను కూడా ముందస్తు జాగ్రత్తగా తాత్కాలికంగా మూసివేయాలని అధికారులు ఆదేశించారు.

# బెంగాల్ బాధితులను పరామర్శించిన అమిత్‌షా!



**కోల్‌కత్తా అక్టోబరు 18:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గా పూజ ఉత్సవాల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగాన్ సార్వజనిన్ దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేడు కోల్‌కతాలో పర్యటించి, బాధితులను పరామర్శించారు. ఈ విషాద ఘటన కారణంగా రాష్ట్రంలో తన ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలను అమిత్ షా వాయిదా వేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వెంటరాగా, ఆయన నగరంలోని ఒక ప్రైవేట్ నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్. రవి, రాష్ట్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ శరద్‌వత్ ముఖర్జీ కూడా గాయపడిన వారిని పరామర్శించారు. ఈ ఘటనపై కోల్‌కతా పోలీసులు వేగంగా స్పందించారు. తొలుత 14 మందిని అదుపులోకి తీసుకోగా, విచారణ అనంతరం పూజా కమిటీ నిర్వాహకులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు కూడా ఉన్నారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి, హత్యకు సమానం కాని నరహత్య కింద అభియోగాలు నమోదు చేశారు. శనివారం సాయంత్రం ఆకస్మిక వర్షం కురవడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. అదే సమయంలో మండపంలో తప్పుడు ప్రకటనలు చేయడంతో గందరగోళం చెలరేగి తొక్కిసలాటకు దారితీసిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా సిబ్బంది కొరత, గుంపును అదుపు చేయడంలో వైఫల్యం వంటివి కూడా ఈ దుర్ఘటనకు ప్రధాన కారణాలుగా గుర్తించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు కలకత్తా హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు తలా రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది.

## ఇటలీలో భారీ నిరసనలు.. స్టోర్ల లూటీ
## ప్రధాని జార్జియా మెలోనీ ఖండన



**రోమ్, అక్టోబరు 18:** యూరప్ దేశమైన ఇటలీలో భారీ నిరసనలు జరుగుతున్నాయి. దేశ రాజధాని మిలన్‌తోపాటు బొలోగ్నా నగరంలో ఆందోళనకారులు భారీ ఎత్తున ఉద్యమించారు. దీంతో నగరం అనేక చోట్ల తగలబడింది. అటు పోలీసులకు, ఇటు ఆందోళనకారులకు మధ్య ఘర్షణ తలెత్తింది. దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, ధరల పెరుగుదల, తక్కువ వేతనాలు, వైద్య సదుపాయాల్లో లోపాలు, ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు లేమి వంటి అంశాలకు నిరసనగా ఇటలీలో యువత, విద్యార్థులతోపాటు ఉద్యోగులు, సాధారణ పౌరులు కూడా భారీ ఎత్తున శనివారం ఉద్యమం చేపట్టారు. ఇటలీలోని అనేక నగరాల్లో ఆందోళనలు మిన్నంటాయి. రాజధాని మిలన్‌లో చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. పియాజ్జా డెల్ డువోమో, గ్యాలేరియా విట్టోరియో ఎమాన్యుయెలె 2 వంటి లగ్జరీ షాపింగ్ మాల్ ప్రాంతాల్లో ఆందోళన చేపట్టారు. అయితే, ఈ ఆందోళనను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆందోళనకారులను అదుపు చేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. అయితే, ఆందోళనకారులు మరింత ఉద్రిక్తంగా మారారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల్ని ధ్వంసం చేశారు. పలు షాపింగ్ మాళ్లను తగులబెట్టారు. అనేక షాపులను లూటీ చేశారు. ఈ ఆందోళన సమయంలో అక్కడి ఒక భారీ షాపింగ్ మాల్‌ను ఖాళీ చేయించాల్సి వచ్చింది. ఈ ఘర్షణల్లో అనేక మంది ఆందోళనకారులతోపాటు, పోలీసులు కూడా గాయపడ్డారు. 50 మంది ఆందోళకారుల్ని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ ఆందోళనలను ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఖండించారు. శాంతియుతంగా ఆందోళన చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

# ఫ్రాన్స్ నుంచి ఇటలీ దాకా ఆగని అల్లర్లు

### - అట్టుడుకుతున్న ఎనిమిది దేశాలు - ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, గృహసంక్షోభాలకు వ్యతిరేకంగా చెలరేగిన ఆందోళనలు



**ప్యారిస్,అంకారా, అక్టోబరు 18:** అల్లర్లు, నిరసనలతో ప్రపంచ దేశాలు అట్టుడు కుతున్నాయి. ఫ్రాన్స్‌లో విద్యార్థి ఉద్యమంగా మొదలైన నిరసనలు, ఇప్పుడు పతాక స్థాయికి చేరాయి. హింసాత్మక సంఘటులు చెలరేగు తున్నాయి. నిరసనకారులు దోపిడీదారులుగా మారారు. వాహనాలకు నిప్పు పెట్టడం, దుకాణాల్లో దోచుకోవడం చేస్తున్నారు. ప్రముఖ భవనాలను కూడా బుగ్గి చేస్తున్నారు. ఈ అల్లర్లను అణిచివేసేందుకు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ ప్రభుత్వం తీవ్రంగా కష్టపడుతోంది. అయితే ఒక్క ఫ్రాన్స్‌లో మాత్రమే కాదు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో నిరసనలు మిన్నంటుతున్నాయి. ఇటలీ, అల్బేనియా నుంచి అర్జెంటీనా, టర్కీ వరకు ప్రజలు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, గృహ సంక్షోభానికి వ్యతిరేకంగా నిరసనలు చేపబుతున్నారు. ఫ్రాన్స్, అల్బేనియాల్లో ప్రభుత్వ వ్యతి రేక నిరసనలు తీవ్రం అవుతున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ అల్లర్లు చెలరేగాయి. ఫ్రాన్స్‌లో నిరసనలకు కారణం ఒక వైపు పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఇంధన ధరలపై ప్రజాగ్రహం ఉంది. మరోవైపు పాఠశాలల పరిస్థితులు బాగా లేకపోవడం, విద్యా బడ్జెట్‌లో కోతలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారు. గత నెలలో పారిస్‌లో ప్రారంభమైన ఈ అల్లర్లు క్రమంగా దేశం మొత్తం వ్యాపించాయి. ఫ్రాన్స్ ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం.. ప్రజల కొనుగోలు శక్తి తగ్గడానికి వ్యతిరేకంగా 5 లక్షల మంది ప్రదర్శనల్లో పాల్గొన్నట్లు చెప్పింది. ఫ్రాన్స్ పొరుగుదేశమైన బెల్జియంలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. ప్రభుత్వ వ్యయాల కోతలు, పెరుగుతున్న ఇంటి ఖర్చులు, ఉన్నత విద్య, యూనివర్సిటీల్లో ఫీజుల పెంపుకు వ్యతిరేకంగా విద్యార్థులు నిరసనలు తెలుపు తున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతుండటంపై పోర్చుగల్‌లో నిరసనలు జరుగు తున్నాయి. ఇళ్ల కొనుగోలు ధరలు పెరగడంపై రాజధాని లిస్బన్‌లో వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. 2017 నుంచి లిస్బన్, ఇతర నగరాల్లో ప్రాపర్టీ ధరలు రెట్టింపయ్యాయి. అదేసమయంలో అద్దెలు కూడా విపరీతంగా పెరిగాయి. ఇటలీ కూడా ఇలాంటి పరిస్థితుల్నే ఎదుర్కొంటోంది. మిలన్‌లో వేతనాలు నిలిచిపోవడం, ద్రవ్యోల్బణం, రోజూ వారీ ఖర్చులు తీర్చడంలో ఎదురవుతున్న ఇబ్బందులకు వ్యతిరేకంగా ప్రజలు నిరసన తెలిపారు. అల్బేనియాలో యూనివర్సిటీల్లో సౌకర్యాలు లేకపోవడం, అధిక విద్యావ్యయం, ఉపాధి లేకపోవడానికి నిరసనగా విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. టర్కీలో కూడా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, సరిపోని పెన్షన్ చెల్లింపులకు వ్యతిరేకంగా పెన్షనర్లు, కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. లాటిన్ అమెరికా దేశం అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో అధ్యక్షుడు జేవియర్ మైలీ తీసుకువచ్చిన ఉన్నత విద్యా విధానానికి నిరసనగా విద్యార్థులు ప్రొటెస్ట్ చేస్తు న్నారు. అమెరికాలో నో కింగ్స్ పేరుతో నిరసన కారులు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నగరాల్లో ర్యాలీలు నిర్వహించారు.

# ప్రధానిమోడీ, అమిత్‌షాలు భయపడుతున్నారు!

## గోవాలో రాహుల్‌గాంధీ ధ్వజం



**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** కేంద్రంలో అధికారంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. గోవాలోని మడ్గావ్‌లో నిర్వహించిన ఒక బహిరంగ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గోవాలో బీజేపీ ప్రభుత్వ అవినీతితో పాటు దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీ వెనుక నరేంద్ర మోడీ, అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక పాత్ర ఉందని ఆరోపించారు. నరేంద్ర మోడీ తెరవెనుక ఉండి ఈ పూర్తి ప్రణాళికను నడిపిస్తుంటే అమిత్ షా ఈ వ్యూహాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయిస్తున్నారని ఇక జ్ఞానేష్ కుమార్ ఓట్ల దొంగతనాన్ని ప్రత్యక్షంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో జ్ఞానేష్ కుమార్ అనే వ్యక్తి ఉన్నారని ఆయన రాత్రివేళ సరిగ్గా నిద్రపోలేకపోతున్నారని అతడు ప్రశాంతత కోల్పోయారని రాహుల్ అన్నారు. ఆయనతో పాటు నరేంద్ర మోడీ, అమిత్ షాలు కూడా సరిగ్గా నిద్రపోలేకపోతున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ వారిని జవాబుదారీగా నిలబెడుతుందని, త్వరలోనే వారు శిక్ష అనుభవిస్తారన్నారు. తనపై ఇప్పటికే మోడీ, అమిత్ షా ఇతరులు దాదాపు 45 డిఫమేషన్ కేసులు పెట్టారని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. నాపై 45 కేసులు ఉన్నప్పటికీ మోడీ ఓట్లను దొంగిలిస్తున్నారని నేను ప్రతీ వేదికపై చెబుతూనే ఉన్నాను. ప్రత్యేకంగా ఈ వ్యాఖ్యలపై నాపై కేసు పెట్టడానికి వారికి ధైర్యం సరిపోవడం లేదన్నారు. ఎందుకంటే ఓట్ల దొంగతనంపై కేసు నమోదు చేస్తే కోర్టులో సుదీర్ఘమైన చట్టపరమైన విచారణ ప్రారంభమై, దానిలో వారే స్వయంగా చిక్కుకుపోతారనే భయం వారిని వెంటాడుతోందని రాహుల్ అన్నారు. గోవా పాలకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ గోవాలో అవినీతి పరాకాష్టకు చేరిందన్నారు. నిజం చెప్పాలంటే ఇది ప్రస్తుతం దేశంలోనే అత్యంత అవినీతిమయమైన రాష్ట్రంగా మారిపోయిందని ప్రస్తుత పాలకులు గోవాను అవినీతికి ఒక మోడల్‌గా మార్చేశారని అని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మేం రాజ్యాంగానికి రక్షకులమని అది మా పవిత్రమైన బాధ్యత అన్నారు. ఓట్లను దొంగిలించడం ద్వారా వారు రాజ్యాంగంపై, మా పవిత్రమైన బాధ్యతపై దాడి చేశారు.



# ఆర్టీసి బస్సును ఢీకొన్న కారు

### చిన్నారిసహా ఐదుగురు మృతి

**ముంబయి, అక్టోబరు 18:** ఒక కారు గుంతలో పడి అదుపుతప్పింది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆ కారు నుజ్జు కావడంతో పాటు దాని భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడ్డాయి. అందులో ప్రయాణించిన చిన్నారి సహా ఐదుగురు ఈ ప్రమాదంలో మరణించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పంధర్‌పూర్ ఖమ్‌గావ్ జాతీయ రహదారిలోని షిండేవాడి ఫాటా సమీపంలో వేగంగా వస్తున్న స్విఫ్ట్ కారు ఒక గుంతలో పడింది. దీంతో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు.

ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అది పూర్తి గా నుజ్జునుజ్జు అయింది. కారు శిథిలాలు, బం పర్ ముక్కలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

# భారత్‌పై హద్దులు దాటి మాట్లాడా..

### అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పశ్చాత్తాపం



**వాషింగ్టన్, అక్టోబరు 18:** కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సిఎల్, క్యాప్‌జెమిని కంపెనీలను పర్మ్ (పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్) నుంచి సస్పెండ్ చేసిన సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా ఓ సమావేశంలో మాట్లాడుతూ.. పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. 'భారత్ విషయంలో ఆ రోజు నేను హద్దులు దాటి మాట్లాడాను. 'విదేశీ ఒప్పంద పనివాళ్లు' అని నేను వాడిన పదం సరైనది కాదు. ప్రసంగంలో ఏమైనా లోపాలు ఉంటే.. అది నా తప్పే. హెచ్-1బి వీసాదారులను లక్ష్యంగా చేసుకోవాలనేది నా ఉద్దేశం కాదు. అమెరికా కంపెనీలు, వీసీ వ్యవస్థ గురించి మాట్లాడాలనుకున్నాను. ఉద్యోగులు అమెరికాకు హెచ్-1బి వీసాపై వస్తారు. వారిని తీసుకున్న కంపెనీలు ఆ పనికి ప్రత్యామ్నాయ అమెరికన్ కార్మికుడు దొరకలేదని పేర్కొంటాయి. దీంతో స్థానికులకు అవకాశాలు దక్కవు. దేశంలో తరచుగా ఇదే జరుగుతోంది. అందుకే ఆ విధంగా మాట్లాడాల్సి వచ్చింది' అని వాన్స్ పేర్కొన్నారు. హెచ్-1బి వీసాలపై నియమించుకునే విదేశీ ఉద్యోగులను 'విదేశీ ఒప్పంద పనివాళ్ల'గా, ఆ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకునే కంపెనీలను 'వీసా మిల్లులు'గా వాన్స్ అభివర్ణించారు.

# ఫ్రాన్స్ అల్లర్లు, లూటీలకు వలసదారులే కారణం

### సరిహద్దులు మూసేయండి: డొనాల్డ్‌ట్రంప్



**వాషింగ్టన్, అక్టోబరు 18:** ఫ్రాన్స్‌లో కొనసాగుతున్న హింసాత్మక ఆందోళనలు, దహనాలు, లూటీలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. దేశంలో నెలకొన్న అశాంతికి వలసదారులేకారణమని వ్యాఖ్యానించారు. భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన వ్యక్తల మనసుల్లో ద్వేషం ఉందని ఆరోపించారు. ఫ్రాన్స్ తన సరిహద్దుల్ని మూసేసి, పరిస్థితుల్ని అదుపులోకి తీసుకురావాలని సూచించారు. ఫ్రాన్స్ మండిపోతోంది, పూర్తిగా భిన్నమైన ప్రపంచం నుంచి వచ్చిన వ్యక్తుల వలసలు, వారి మనసుల్లో ద్వేషం, గొప్పగా ఉన్న ఫ్రాన్స్‌ను ఛిన్నాభిన్నం చేశాయి. ఆలస్యం కాకముందే సరిహద్దుల్ని మూసేసి, పరిస్థితిని మీ నియంత్రణలోకి తెచ్చుకోండి అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనికి ముందు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. పాశ్చాత్య దేశాల్లోని ఉదారవాదులు భిన్న సమాజాలకు సంబంధించిన వ్యక్తుల వలసల్ని ఆహ్వానించారని, ఇప్పుడు ఫ్రాన్స్‌లో అల్లర్లకు ఇదే కారణమని ఆరోపించారు. ఈ పరిస్థితులు వస్తాయని ముందే హెచ్చరించినప్పటికీ, ఉదారవాదులు ఆ సూచనల్ని పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌లో మరిన్ని చారిత్రాత్మక కట్టడాలు తగలబడకముందే ఈ ఉన్మాదాన్ని ఆపాలని ప్రార్థిస్తున్నాను అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఫ్రాన్స్ అందమైన దేశమని, అక్కడి చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థి నిరసనల నుంచి హింసాత్మక ఘటన వరకు విద్యార్థుల నిరసనల రూపంలో ప్రారంభమైన ఫ్రాన్స్‌లో అల్లర్లు నెమ్మదిగా హింసాత్మకంగా మారాయి. పారిస్‌తో సహా దేశవ్యాప్తంగా చాలా నగరాల్లో నిరసనకారులు విధ్వంసం సృష్టిస్తున్నారు. అధ్యక్ష ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఈ హింస జరగడం గమనార్హం. మొదట్లో పాఠశాలల్లో మరింత మంది ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా పరిస్థితులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక సంఘాలు కూడా ఆందోళనల్లో భాగమయ్యాయి. జీవన వ్యయం పెరుగుదల, ప్రభుత్వ సేవలపై ఆందోళనలతో మరికొందరు నిరసనల్లో పాల్గొన్నారు. నిరసనకారులు లూటీలు, దహనాలు, కాల్పులకు పాల్పడుతున్నారు.

# సంక్షిప్త వార్తలు

### అమెరికాలో భారత్ ఐఆర్ఎస్ అధికారిణి రికార్డు!



**వాషింగ్టన్, అక్టోబరు 18:** ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిణి ఏక్తా బిష్ణోయ్ క్రీడా ప్రపంచంలో చరిత్ర సృష్టించారు. అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని దేశం గర్వపడేలా చేశారు. ఈ విజయంతో, మాస్టర్స్ 2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె రికార్డులకెక్కారు. ఈ పోటీల్లో ఏక్తా బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన ప్రత్యర్థులను అధిగమించారు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కఠినమైన పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం.

### శబరిమలై ఆలయ ప్రధాన పూజారిగా అరిక్కర సుబ్రమ్మాణ్యన్ శంకరన్ నంబూద్రి!

**పతనంతిట్ట, అక్టోబరు 18:** శబరిమల ధర్మశాస్త అయ్యప్ప ఆలయానికి నూతన మేల్‌శాంతి ఎంపిక ప్రక్రియ పూర్తయింది. రాబోయే వార్షిక మండలమకరవిళక్కు యాత్ర సీజన్‌కు ముందు దేవాదాయ బోర్డు అధికారుల సమక్షంలో డ్రా పద్ధతి ద్వారా ఈ ఎంపిక నిర్వహించారు. శబరిమల అయ్యప్ప స్వామి ప్రధాన పూజారిగా అరిక్కర సుబ్రమ్మాణ్యన్ శంకరన్ నంబూద్రి, మాలికాపురం దేవి ఆలయ ప్రధాన పూజారిగా దామోదరన్ నంబూద్రి ఎంపికయ్యారు. పథనంథిట్ట జిల్లాలోని శబరిమల సన్నిధానంలో ఈ ఉదయం పూజల అనంతరం ఈ లాటరీ ప్రక్రియను చేపట్టారు.

### టగ్ బోట్‌పై దాడి.. హెచ్చరికలు జారీ చేసిన యుకె ఎంటిఒ

**లండన్, అక్టోబరు 18:** యుఎఇలోని ఖోర్ ఫక్కాన్ పోర్టు సమీపంలో సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న టగ్‌బోట్‌పై దాడి జరిగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యుకెఎంటిఒ) వెల్లడించింది. గుర్తుతెలియని రెండు పరికరాలు బోటును ఢీకొట్టడంతో అది దెబ్బతిందని.. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. సముద్ర జలాల్లో ప్రయాణిస్తున్న నౌకలు జాగ్రత్తగా ఉండాలని.. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని యుకెఎంటిఒ సూచించింది. మరోవైపు శనివారం సౌదీ అరేబియాలోని అల్ జుబైల్ సమీపంలో ఓ నౌకను గుర్తుతెలియని పరికరం ఢీకొట్టినట్లు తెలిపింది.

### ఢిల్లీలో ఇ రిక్షాలకు పరిమితి.. గరిష్టంగా 2.5 లక్షలకే అనుమతి!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 18:** దేశ రాజధాని ఢిల్లీలో ఈరిక్షాల సంఖ్యను గరిష్ఠంగా 2.5 లక్షలకు పరిమితం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈరిక్షాల రిజిస్ట్రేషన్, యాజమాన్యం, రహదారి భద్రతకు సంబంధించి కఠిన నిబంధనలను అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఢిల్లీ ఈరిక్షా పథకం-2026 ముసాయిదాను విడుదల చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ కోసం విడుదల చేసిన ఈ ముసాయిదా ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రహదారి ప్రమాదాలను నియంత్రించడం, ఈరిక్షాల కారణంగా తలెత్తుతున్న కాలుష్య సమస్యలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించింది.

### భారత్ విమానాలకు పాక్ గగనతల నిషేధం పొడిగింపు



**కరాచి, అక్టోబరు 18:** దాయాది దేశం పాకిస్తాన్ మరోసారి భారత విమానాలకు గగనతల నిషేధాన్ని పొడగించింది. మరో నెల రోజుల పాటు ఈ నిషేధం కొనసాగుతుంది. భారత్‌లో రిజిస్టర్ అయిన విమానాలతో పాటు, భారత విమానయాన సంస్థలకు, ఆ సంస్థలు లీజు తీసుకున్న విమానాలపై ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఇది భారత సైనిక విమానాలకు కూడా వర్తిస్తుంది. పాకిస్తాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రకారం ఈ ఆంక్షలు 2026 నవంబర్ 24 ఉదయం 5.59 గంటల వరకు అమలులో ఉంటాయి. 2025 ఏప్రిల్ 23న పాకిస్తాన్ భారత విమానాలపై ఆంక్షలు విధిస్తూ, గగనతల నిషేధాన్ని విధించింది. అప్పటి నుంచి ఈ నిషేధాన్ని పొడగిస్తూ వస్తోంది.

# బీహార్ మినహా దేశంలో స్థిరంగా సిలిండర్‌ధరలు!



**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** దసరా పండుగను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. ఈనెల 1వ తేదీన కమర్షియల్ సిలిండర్ ధరలను వివిధ నగరాల్లో రూ. 62 నుంచి రూ. 72 వరకు పెంచినప్పటికీ, ఆ తర్వాత నుంచి ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఇక 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల విషయానికి వస్తే చివరిసారిగా జూన్ నెలలో ప్రభుత్వం రూ. 29 వరకు పెంచింది. ప్రస్తుతం ప్రధాన నగరాల్లో గ్యాస్ ధరలు ఎలా ఉన్నాయో పరిశీలిస్తే, జాతీయ రాజధాని అయిన ఢిల్లీలో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 942గా ఉండగా, కమర్షియల్ సిలిండర్ ధర రూ. 2810గా ఉంది. కోల్‌కతాలో గృహ వినియోగ సిలిండర్ రూ. 968కి, కమర్షియల్ సిలిండర్ రూ. 2954కి లభిస్తున్నాయి. ముంబైలో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 941.50గా, కమర్షియల్ సిలిండర్ ధర రూ. 2764.50గా ఉంది. నోయిడా, గురుగ్రామ్ ప్రాంతాల్లో గృహ వినియోగ సిలిండర్ ధర రూ. 950.50గా కొనసాగుతోంది. ఇక లక్నోలో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 979.50, కమర్షియల్ సిలిండర్ ధర రూ. 2932.50గా ఉంది. బీహార్ రాజధాని పాట్నాలో మాత్రం గ్యాస్ ధరలు ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే అధికంగా ఉన్నాయి. పాట్నాలో 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 1031.50గా ఉండగా, కమర్షియల్ సిలిండర్ ధర ఏకంగా రూ. 3100.50కి చేరింది. ఇరాన్‌అమెరికా యుద్ధం కారణంగా గతంలో భారత్‌కు ఎల్పీజీ దిగుమతుల విషయంలో కొంత సంక్షోభం తలెత్తింది. భారత్ తన అవసరాల కోసం సుమారు 90 శాతం బయటి దేశాల మీదే ఆధారపడుతుండటంతో, ప్రభుత్వం దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు ఆయిల్ రిఫైనరీ కంపెనీలకు ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించింది. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఇందులో భాగంగా రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ ఉంటేనే బుకింగ్ చేయడం, ఓటీపీ ఆధారంగా డెలివరీ అందించే విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం పీఎన్జీ కనెక్షన్ల వినియోగాన్ని కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది.

## కుటుంబ పెద్దే నూడిల్స్‌లో విషం కలిపాడు!

**నోయిడా, అక్టోబరు 18:** ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరిగిన ఒకే కుటుంబం మృతి కేసులో ఊహించని, దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. కుటుంబ పెద్ద తన భార్యాపిల్లలకు ఆహారంలో విషం కలిపి, ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆస్తి తగాదాలే ఈ ఘోరానికి దారితీశాయని పోలీసు వర్గాలు తెలిపాయి. గ్రేటర్ నోయిడా పరిధిలోని నాగ్లా శ్రీ పదం గ్రామంలో నివసిస్తున్న మహేశ్ (37), అతని భార్య లలిత (35), వారి ముగ్గురు పిల్లలు లడ్డూ (11), మిష్టి (7), సాక్షాత్ (3) శనివారం ఉదయం తమ ఇంట్లోని ఒక గదిలో విగతజీవులుగా కనిపించారు. రాత్రి స్థానికంగా జరిగిన ఒక జాతర నుంచి తిరిగి వచ్చిన ఈ కుటుంబం, రాత్రి భోజనంలో నూడుల్స్, టీ తీసుకున్నట్లు తెలిసింది. తొలుత ఇది ఫుడ్ పాయిజనింగ్ వల్లే జరిగిందని భావించినప్పటికీ, పోలీసుల దర్యాప్తులో కొత్త కోణం వెలుగుచూసింది. మహేశ్ తన ఫోన్‌లో రికార్డ్ చేసిన ఒక ఆడియో నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన కుటుంబం ఈ పరిస్థితికి రావడానికి తన ఇద్దరు సోదరీమణులు, ఒక బావమరిదే కారణమని అందులో ఆరోపించాడు. వారి వేధింపుల కారణంగానే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు మహేశ్ పేర్కొన్నాడు. ఈ ఆడియో నోట్ ఆధారంగా వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహేశే నూడుల్స్‌లో విషం కలిపి కుటుంబ సభ్యులకు పెట్టి, అనంతరం తానూ తిని మరణించి ఉంటాడని పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆహార భద్రతా అధికారులు, అక్కడ గడువు ముగిసిన ఆహార పదార్థాలేవీ లేవని, సాధారణపాయిజనింగ్ కాకుండా ఏదో విషపూరితపదార్థం వల్లే మరణాలు సంభవించి ఉంటాయన్నారు.



ఆదివారం ఉదయం లోక్‌భవన్‌లో విజయదశమి పర్వదినాన్ని పురస్క రించుకొని ఆయుధపూజలో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

## లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

# ఆయుధ పూజలు

### భక్తిశ్రద్ధలతో పండుగలు జరుపుకోవాలని

### అధికారులకు, సిబ్బందికి సూచన

**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:** విజయదశమి పర్వదినాన్ని పురస్క రించుకొని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆదివారం ఉదయం లోక్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఎలక్ట్రిసిటీ విభాగం కార్యాలయంలో దుర్గామాతకు పూజలు నిర్వహించారు. అనంతరం లోక్ భవన్ ప్రాంగణంలోని పోచమ్మ తల్లికి పూజలు చేసి, భద్రతా విధుల్లో వినియోగించే ఆయుధాలకు సంప్రదాయబద్ధంగా ఆయుధ పూజ నిర్వహిం చారు. గ్యారేజ్‌లో అధికారిక వాహనాలకు గవర్నర్ పూజలు చేశారు. అనంతరం లోక్ భవన్ అధికారులు, సిబ్బందితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. అధికారులు, సిబ్బంది గవర్నర్‌కు బతుకమ్మ, నవరాత్రి, విజయ దశమి పండుగల శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిగా గవర్నర్ కూడా వారందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ, నవరాత్రి, విజయదశమి పండుగలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపు కోవాలని గవర్నర్ సూచించారు. ఈ పండుగలు ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి కొమందూరు శశి కిరణ్, తిదీది కాంతి లాల్, చీఫ్ సెక్యూరిటీ అధికారులు శ్రీనివాస్, మట్టయ్య, ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, లోక్ భవన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. చంద్ర మోహన్, గ్యారేజ్ సూపర్‌వైజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంవిఎస్ఆర్ కాలేజీలో ప్రమాద ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా తీవ్రదిగ్భ్రాంతి

**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:** నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజి నీరింగ్ కళాశాలలో జరిగిన ప్రమాద ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బిటెక్ విద్యార్థిని మృతి అత్యంత బాధా కరమని పేర్కొంటూ, ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలి పారు. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అం దేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇలాంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు, భద్రతాచర్యలు చేపట్టాలని గవర్నర్ సూచించారు.

# 51 డిపోల్లో టిడబ్ల్యుయు కూటమి విజయభేరి

### 9 రీజియన్లలో గుర్తింపు సంఘంగా విజయం

### బస్‌భవన్‌సహా నాన్ ఆపరేషనల్ యూనిట్లలో క్లీన్ స్వీప్

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయూ), స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్.డబ్ల్యూ.ఎఫ్) కూటమి తమ సత్తా చాటిందని టిడబ్ల్యూయూ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 97 డిపోలకు గాను 51 డిపోల్లో ఘన విజయం సాధించ డంతో పాటు, 14 రీజియన్లలో తొమ్మిదింటిలో ఆధిక్యం కనబరి చామని ఆయన పేర్కొన్నారు. బస్ భవన్‌తో సహా రీజినల్ మేనేజర్ కార్యాలయాలు, వర్క్‌షాప్‌లు కలిపి మొత్తం 8 నాన్ ఆపరేషనల్ యూనిట్లలోనూ తమ కూటమి క్లీన్‌స్వీప్ చేసిందని వెల్లడించారు. ఎన్నికల్లో కార్మికులు తెలిపిన ఈ మద్దతు తమపై వారికున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.



మాట్లాడుతున్న టిడబ్ల్యుయు అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి

హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి టిడబ్ల్యూయూ క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బరిలోకి దిగిన తమ కూటమికి కార్మికులు అండగా నిలిచారని చెప్పారు. నాన్ ఆపరేషనల్ విభాగంలో విజయం నాన్ ఆపరేషనల్ విభా గంలోని మొత్తం ఎనిమిదికి ఎనిమిది యూనిట్లలో విజయం సాధించడం తమ కూటమికి దక్కిన ప్రత్యేక గుర్తింపు అని రాజిరెడ్డి తెలిపారు.

రాష్ట్రంలోని 14 రీజియన్లకు గాను 9 రీజియన్లలో గుర్తింపు సంఘంగా తమ కూటమి విజయం సాధించిందని వివరించారు. ఎన్నికల్లో విజయాన్ని అందించిన కార్మికులందరికీ మొగుళ్ల రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి, వారు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు.

# సంక్షేమ గురుకులాలకు 6.25 లక్షల రగ్గులు

### రూ.50 కోట్లతో సహకార సంఘాలకు ఆర్డర్లు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతులు, మైనార్టీ సంక్షేమ గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)లలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉన్ని రగ్గులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సొసైటీల ఆధ్వర్యంలో తయారు చేసిన రగ్గుల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో ఊపందుకుంది. ఈ మేరకు రూ.50 కోట్ల అంచనా వ్యయంతో ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాలకు (ఉన్ని సొసైటీలకు) ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చింది. వీటికి కావలసిన యార్న్ (దారాన్ని) టెస్కో అందిస్తోంది. మొత్తం 6.25 లక్షల నాణ్యమైన రగ్గులకు గాను సొసైటీల ద్వారా సేకరించి నేరుగా గురుకులాలు, కేజీబీవీ పాఠశాలలకు చేరవేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 4 లక్షల వరకు సప్లై చేసినట్టు సంక్షేమ శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఒకవైపు విద్యార్థులకు చలి నుంచి రక్షణ లభించడంతో పాటు, మరోవైపు చేనేత రంగ కార్మికులకు భారీ స్థాయిలో ఉపాధి లభిస్తుంది. అలాగే జోగిపేటలోని ఉన్ని ఫినిషింగ్ ప్లాంట్ కు చెల్లించే ప్రాసెసింగ్ ఛార్జీలను గతంలో ఉన్న రూ.51 నుంచి రూ.71 వరకు పెంచింది. అయితే రాష్ట్రంలో దాదాపు 50 వరకు ఉన్ని సొసైటీలు ఉన్నాయి. అందులో ఎక్కువగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే దాదాపు 20 సంఘాల వరకు ఉన్నాయి. మిగతావి వికారాబాద్, ఉమ్మడి మెదక్ ప్రాంతాల్లో ఉన్నాయి. గడిచిన 15 సంవత్సరాల్లో ఉన్ని సొసైటీలకు ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి ప్రభుత్వ ఆర్డర్ లభించడం ఇదే తొలిసారి.

# ఆయిల్‌పామ్ తోటల్లో కవర్డ్ విద్యుత్తు తీగలు

### ముఖ్యమంత్రి రేవంత్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి

**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:** తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొం టున్న విద్యుత్తు లైన్ల సమస్యకు పరిష్కారం చూ పేలా రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి విధానం రూపొం దించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆయిల్‌పామ్ తోటల్లో ప్రమాదాల నివారణకు 11 కేవీ బేర్ కండక్టర్ల స్థానంలో కవర్డ్ కండక్టర్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలి సిన తుమ్మల పలు కీలక అంశాలపై వినతి పత్రాలను అందజేశారు. రైతుల సమస్యల పరి ష్కారంతోపాటు సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించే ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యుత్తు లైన్లు రైతులకు సమస్యగా మారుతున్నాయని తుమ్మల వివరించారు. ఇప్పటికే సాగు చేస్తున్న రైతులతో పాటు కొత్తగా ఆయిల్ పామ్ తోటలు ఏర్పాటు చేయాలనుకునే వారు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెట్లు ఎత్తుగా పెరిగిన తర్వాత వాటి కొమ్మలు విద్యుత్తు తీగలను తాకే ప్రమాదం ఉందని, దీనివల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆయిల్‌పామ్ తోటల పరిధిలోని 11 కేవీ విద్యుత్తు లైన్లను కవర్డ్ కండక్టర్లుగా మార్చేందుకు రాష్ట్రస్థాయిలో ఒకే విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనివల్ల రైతులకు భద్రత పెరగడంతో పాటు ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ తుమ్మల పలు సూచనలు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో సాధ్యమైన ప్రాంతాల్లో పైపుల ద్వారా నీటిని పంపిణీ చేసే విధానాన్ని అనుసరించాలని ప్రతిపాదించారు.

ఈ విధానం అమలు చేస్తే సుమారు 9,767 ఎకరాల భూసేకరణ అవసరం తప్పుతుందని, తద్వారా దాదాపు రూ.2,148 కోట్ల వ్యయాన్ని తగ్గించవచ్చని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద మీటరు నుంచి మీటరున్నర ఎత్తు వరకు ఇసుక బస్తాలతో తాత్కాలిక అడ్డుకట్ట ఏర్పాటు చేస్తే సుమారు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రతిపాదనను కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నగర అభివృద్ధికి సంబంధించిన అంశాలను కూడా మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఔనగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) ఆమోదించి, అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా, డిసెంబరు 9న కల్లూరిగూడెంలోని ఆయిల్‌పామ్ కర్మాగారం, ఖమ్మంలోని వెలుగుమట్ల హౌసింగ్ మోడల్ కాలనీల ప్రారంభోత్సవాలకు హాజరు కావాలని తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు.

# నీటి పరిరక్షణే నిజమైన దైవారాధన



ఆదివారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్‌పై నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా, చిత్రంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, నటులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్ తదితరులు

### బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

### పాల్గొన్న మంత్రులు జూపల్లి, సీతక్క, అమెరికా, జర్మనీ కాన్సల్ జనరల్స్, సినీనటులు విజయ్, రష్మిక

### ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నింటిన సద్దుల బతుకమ్మ సంబురాలు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం సద్దుల బతుకమ్మ సంబు రాలు ఘనంగా జరిగాయి. మెదక్, ఆదిలాబాద్, జనగామ, నిజామాబాద్, వరంగల్ తదితరచోట్ల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తీరకొక్క పూలతో ఊరూవాడా పూలవనంగా మారింది. బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు, చిన్నారులు ఆడిపాడారు. హైద రాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ట్యాంకబండ్ అమరవీరుల స్మారకం నుంచి మహా బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కలలకు పుట్టినిల్లు తెలంగాణ అని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. ట్యాంక్ బండ్ పై సద్దుల బతుకమ్మ ఉత్సవ వేడుకల్లో గవర్నర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణలోని సోదర సోదరీమణులకు, దేశ విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సుసంపన్న సాంస్కృతిక వారసత్వానికి, నారీ శక్తికి, ప్రకృతి పట్ల మన కున్న ప్రగాఢమైన భక్తికి సజీవ ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. తరత రాలుగా ఈ అమూల్య మైన సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్న తల్లులు, సోదరీమణుల సృజనాత్మకత, అంకిత భావం ఎంతో ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. పూలను దైవ స్వరూపంగా భావించి పూజించే ఈ విశిష్ట పండుగ ప్రకృతిని గౌరవించడమే మానవ జీవిత భవిష్యత్తు అని సమాజానికి చాటిచెబుతుందని ఆయన తెలిపారు. బతుకమ్మ పండుగ వేళ ప్రకృతిని, దాని అత్యంత విలువైన వనరైన నీటిని సంరక్షించుకోవడమే నిజమైన దైవా రాధన అని ఆయన ఉద్ఘాటించారు. నీటి సంరక్షణను కేవలం ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే పరిగణించకుండా, ప్రతి పౌరుడు తన ప్రథమ కర్తవ్యంగా స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పద్ధతుల్లో తగిన మార్పులు తీసుకురావాలని ఆయన రైతు సోదరులను ప్రత్యేకంగా అభ్యర్థించారు. మహిళా సాధికారత, సామాజిక సామరస్యం, ప్రకృతి ప్రేమను ప్రోత్సహించే ఈ మహత్తర సందర్భంలో ప్రజలందరికీ బతుకమ్మ, నవరాత్రి, విజయదశమి పండుగల శుభాకాంక్షలు అందజేశారు. గౌరీ దేవి కటాక్షంతో తెలంగాణలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, జర్మనీ కాన్సుల్ జనరల్ అమితా దేశాయ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ ఐఎఎస్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, టిఎస్ఎస్ చైర్మన్ వెన్నెల గద్దర్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, టిఎస్ఎస్ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ మంగతాయారు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సినీ నటులు విజయ్ దేవరకొండ రష్మిక, కళాబృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

#### ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు–2026లో భాగంగా, బతుకమ్మ పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ట్యాంక్ బండ్‌పై బతుకమ్మ కార్నివాల్‌ను నిర్వహించింది. ఈ కార్నివాల్‌కు ప్రజల నుంచి ఉత్సాహభరితమైన స్పందన లభించింది. తెలంగాణ రాష్ట్ర సంప్రదాయాలు, పండుగ వైభవాన్ని ప్రతిబింబిస్తూ ట్యాంక్ బండ్ సందడిగా మారింది. అద్భుతమైన తేలియాడే బతుకమ్మ, ప్రత్యేక ఇతివృత్తాలతో రూపొందించిన కళా ప్రదర్శనలు, ఫోటో బూత్‌లు ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. సందర్శకులు ఈ ప్రదర్శనలను ఆస్వాదిస్తూ, మధురమైన జ్ఞాపకాలను ఫోటోల రూపంలో భద్రపరుచుకున్నారు. ఘాట్లన్నీ పండుగ శోభతో కళకళలాడాయి. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలంగాణ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించారు.

# పండుగ బస్సుల నిర్వహణలో లోటుపాట్లు లేవు

### స్పష్టం చేసిన ఆర్టీసీ యాజమాన్యం

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** పండు గల సమయంలో బస్సు టికెట్ల ధరల పెంపు, ప్రత్యేక బస్సుల రద్దుకు సంబంధించి వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో పండుగల సమయాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా టికెట్ ధరల నియంత్రణ, నిర్ణయాలు సంస్థ నిబంధనల ప్రకారం తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా 2003వ సంవత్సరానికి చెందిన బీవీ ఆధారంగా నిబంధనల ప్రకారం నిర్ణయాలు జరుగుతు న్నాయని వెల్లడించింది. సంస్థలో ఎలాంటి అదనపు భారం మోపకుండా నిబంధనలకు లోబడే నిర్ణయాలు తీసుకుం టున్నట్లు పేర్కొంది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోందని తెలియ చేసింది. రాష్ట్రంలోని ఆడపడుచులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని యాజమాన్యం స్పష్టం చేసింది. అదేవిధంగా, దసరా పండుగ వేళ బస్సు సర్వీసులను తగ్గించలేదని తేల్చిచెప్పింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా పండుగవేళ ఊర్లకెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఈసారి ప్రత్యేకంగా 7,000 అదనపు బస్సులను ఏర్పాటు చేశామని వివరించింది, ఈ నెల 10వ తేదీ నుండి ఇప్పటివరకు కేటాయించిన అదనపు బస్సుల్లో 97 శాతం సర్వీసులను విజయవంతంగా నడిపించి ప్రయాణికులను సురక్షి తంగా తమ గమ్యస్థానాలకు చేర్చామని చెప్పింది. అదేవిధంగా సంస్థ ఉన్నతాధికారులు నిరంతరం సమీక్షలు చేస్తూ ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నారని సంస్థ యాజమాన్యం వెల్లడించింది.

# పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలంటూ సిఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి

### అక్రమ నిల్వలతో దాణా ధరలు విపరీతంగా పెంచుతున్నారని ఆరోపణ

**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:** పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి. పౌల్ట్రీ రంగానికి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన కోరారు, ఇప్పటికే అనేక ఆర్థిక, సాంకేతిక సమస్యలతో సతమత మవుతున్న పౌల్ట్రీ రైతులకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారిం దని బండ్ల గణేశ్ తెలిపారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, రైతులకు సరసమైన ధరలకు, సకాలంలో ముడిసరుకులు అందేలా చూడాలని కోరారు. తెలంగాణ పౌల్ట్రీ రైతుల తరఫున తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానని, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు.

# రైతుల వద్దకే విద్యుత్ అధికారులు

### గ్రామీణ ప్రాంతాల్లో పొలం బాట

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ వినియో గదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యం తో వివిధ ప్రాంతాల్లో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది నేరుగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షించి అభిప్రాయాలు, సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. సంస్థ పరిధిలోని వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వనపర్తి, గద్వాల, యా దాద్రి, నల్గొండ, మల్కాజిగిరి, సూర్యాపేట తది తర ప్రాంతాల్లోని వివిధ సెక్షన్లు, సబ్ డివిజన్లు, డివిజన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పలు వ్యవసాయ ఫీడర్ల పరిధిలో అధికారులు రైతులను కలిసి విద్యుత్ సరఫరాపై వారి అభిప్రా యాలను సేకరించారు. రైతులతో మాట్లాడటంతో పాటు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సాంకేతిక అంశాలను కూడా పరిశీలించారు. 100 కేవీఏ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద టంగ్ టెస్టర్ ద్వారా విద్యుత్ రీడింగులు నమోదు చేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు, బోరు మోటార్ల స్టార్టర్ల వద్ద వోల్టేజీ, కరెంట్ స్థాయిలను తనిఖీ చేశారు. వ్యవసాయ ఫీడర్ల పనితీరు, సరఫరా పరిస్థితులు, విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో సమీక్షి ంచారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, ఇతర పరికరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు సూచించారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటూ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సమాయత్తం కావాలి

### అర్హులైన ప్రతి పట్టభద్రుడితో ఓటరు నమోదు చేయించాలి:

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:** రాబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) పై కీలక సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీలు) ఏవీఎన్ రెడ్డి, మల్క కొమురయ్యలతో పాటు రెండు ఎమ్మెల్సీ నియోజక వర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలు, ఇన్చార్జ్‌లు పెద్ద ఎత్తున పాల్గొ న్నారు. ఈ సంద ర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ గతంలో హైద రాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని దివంగత నేత వి. రామారావు గారు పలుమార్లు గెలు చుకు న్నారని, ఇతర స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధించిన చరిత్ర ఉందని గుర్తుచేశారు. అభ్యర్థులు ఎవరనే దానితో సంబంధం లేకుండా, పార్టీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని నేతలకు సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడితో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యావంతులను ఓటర్లుగా నమోదు చేయించడంతో పాటు, పోలింగ్ రోజున వారు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చొరవ చూపాలని కోరారు.



సమాజంలో బీజేపీ పట్ల విద్యావంతులు, గ్రాడ్యుయేట్లలో బలమైన సానుకూలత ఉందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఇదే సమయంలో దేశ ప్రతిష్టను దిగజార్చేలా సాగుతున్న 'ఓట్ చోరీ' ప్రచారం వెనుక విదేశీ శక్తుల ప్రమేయం దాగి ఉందని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ నేతలు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు క్షేత్రస్థాయిలో తగిన సమయం కేటాయించి పార్టీని విజయతీరాలకు చేర్చాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

## రవీంద్రభారతి విద్యాసంస్థల అధినేత కుమారుడి వివాహానికి హాజరైన ఎపి మంత్రి నారాయణ



**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:** రవీంద్ర భారతి విద్యాసంస్థలు అధినేత ఎం. సుబ్రమణ్యం (మణి) ద్వితీయ పుత్రుడు ఎం. ప్రణీత్, అలేఖ్యల వివాహము వి.పి.ఆర్ కన్వెన్షన్ హాల్ నందు వైభవోపేతంగా జరిగినది. ఈ వివాహ మహోత్సవమును వీక్షి ంచుటకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, డాక్టర్ పొంగూరు నారాయణ (మున్సిపల్ శాఖ మంత్రి), బీద మస్తాన్‌రావు (పార్లమెంటు సభ్యులు), సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి (శాసనసభసభ్యులు), బీద రవిచంద్ర (శాసన మండలి సభ్యులు) హాజరయ్యారు, అబ్దుల్ అజీజ్ (రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్), కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (నుడా చైర్మన్) సురేష్ రెడ్డి (ఆర్.టి.సి జోనల్ చైర్మన్), సెలబ్రిటీలు, రవీంద్ర భారతి విద్యాసంస్థల పరిశీలకులు, ఉపా ధ్యాయుల బృందం, సహోద్యోగులు అందరూ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# పేదల గుండెల్లో నిలిచిన మహానేత అంజయ్య

### 40వ వర్ధంతి సందర్భంగా లుంబినీ పార్కులో విగ్రహానికి ప్రముఖుల నివాళులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), అక్టోబరు 18, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నిరుపేదల అభ్యున్నతికి పాటుపడిన మహానేత అని టి.అంజయ్య అని పలువురు ప్రముఖులు కీర్తించారు. మాజీ ముఖ్యమంత్రి టి. అంజయ్య 40వ వర్ధంతి వేడుకలు పిసిసి క్యాంపెయిన్ కమిటీ జాయింట్ కన్వీనర్ అభిషేక్‌రెడ్డి ఆధ్వర్యంలో లుంబినీ పార్కులో నిర్వ హించారు. పార్కులో ఏర్పాటు చేసిన టి. అంజయ్య విగ్రహానికి రాష్ట్రం లోని ప్రముఖ రాజకీయ నాయ కులు, వివిధ పార్టీల నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పిం చారు. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కు మార్‌గౌడ్ మాట్లా డుతూ సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎదిగి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్య మంత్రి అయిన గొప్ప నాయకుడు టి. అంజ య్య అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాం తాలను, బడుగు, బల హీన వర్గాల అభ్యున్నతిని ఆయన తన జీవితాంతం ఆచరించి చూపారు అని కొనియాడారు.



మాజీ సిఎం అంజయ్య 40వ వర్ధంతి సభలో పాల్గొన్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, కెకె, విహెచ్, కెవిపి, కోదండరెడ్డి, దానం నాగేందర్, అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజల గుండెల్లో నిలిచిన ప్రజానేత అంజయ్య, ఆయన హయాంలో తీసుకున్న అనేక ప్రజా సంక్షేమ నిర్ణయాలు ప్రజలకు ఇప్పటికీ గుర్తుండే ఉన్నాయన్నారు.

ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, హనుమంత్ రావు మాట్లాడుతూ అంజయ్య తో తమకున్న అనుబంధం గురించి ప్రస్తావించారు. మాజీ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు, మాజీ మంత్రి దానం నాగేందర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



## 137 రకాల కేన్సర్ మందులపై ధరలు తగ్గింపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** క్యాన్సర్ చికిత్సతో ఆర్థికంగా కుంగిపోతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం అతిపెద్ద ఊరట కల్పించింది. అత్యంత కీలకమైన 137 రకాల క్యాన్సర్ నిరోధక మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికే పరిమితం చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ఈ మందుల గరిష్ట చిల్లర ధరలు 70 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. ఈ కొత్త ధరలు నవంబర్ 9వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) అక్టోబర్ 17న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. డ్రగ్స్ (ప్రైసెస్ కంట్రోల్) ఆర్డర్, 2013లోని పారా 19 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు. తయారీదారు నుంచి వినియోగదారుడికి చేరే క్రమంలో స్టాకిస్టులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్ల లాభం కలిపి గరిష్టంగా 30 శాతానికి మించకూడదు. ఈ నిర్ణయంతో రోగులకు ఏటా సుమారు రూ. 2,500 కోట్ల మేర ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు.

ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన 137 మందుల జాబితాలో నివోలుమాబ్, బెవాసిజుమాబ్, అటెజోలిజుమాబ్, ఓలపారిబ్, డెనోసుమాబ్, పెగ్‌ఫిల్‌గ్రాస్టిమ్, ఎన్‌లుటమైడ్ వంటి ఖరీదైన ఔషధాలు ఉన్నాయి. బ్రాండెడ్, జనరిక్, దేశీయ, దిగుమతి చేసుకున్న, పేటెంట్ ఉన్న, పేటెంట్ లేని అన్ని రకాల మందులకు ఈ నిబంధన వర్తిస్తుంది. క్యాన్సర్ మందుల అధిక ధరలపై సుప్రీంకోర్టు సైతం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గతంలో 2019లో కూడా 42 క్యాన్సర్ మందులపై ఇదే తరహాలో ట్రేడ్ మార్జిన్‌ను నియంత్రించడం ద్వారా ధరలను గణనీయంగా తగ్గించారు. ఈ ఆదేశాల ప్రకారం, ఔషధ తయారీదారులు 7 రోజుల్లోగా సవరించిన ధరల జాబి తాను ఎన్‌పీపీఏకి సమర్పించి, తమ వెబ్‌సైట్లలో ప్రచురించాలి. రిటైలర్లు, ఆసుపత్రులు తప్పనిసరిగా కొత్త ధరలనే వసూలు చేయాలని, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్లు దీన్ని పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## గెలుస్తాం.. అయితే నిర్లక్ష్యం చేయొద్దు!

### మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్‌లో ఏపి సిఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలో నామినేషన్ల ఘట్టం ముగిసిందని, అనేక మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. నామినేషన్లు జరుగకుండా అడ్డుకోవాలని వైసిపి ప్రయత్నించి భంగపడిందన్నారు. ఎన్నికలు ఆపడానికి పడరాని పాట్లు పడిందన్నారు. గవర్నర్‌కు, ఎస్ఇసికి ఫిర్యాదు చేసారు. మనం వాస్తవాలు ఆధారాలతో ఇప్పటికే ఎస్ఇసి ఇచ్చామన్నారు. అందుకే జగన్ పాచికలు పారలేదన్నారు. ఆఖరికి హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ కొట్టేసారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు మనం సమన్వయంతో ఉందన్నామన్నారు. ఈ మేరకు అమరావతి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ మరో పర్యాయం నిర్వహించారు. ఎన్నికల్లో 2024 ఎన్నికల ఫలితాలను మించి ఓట్ల శాతం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. గెలుస్తామన్న ధీమాతో నిర్లక్ష్యం చేయకుండా ప్రతి పంచాయతీ, ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపాలిటీలో క్షేత్రస్థాయి లో పర్యటించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా జనాభా ప్రాతిపదికన అన్ని సామాజిక వర్గాలకూ సమాన అవకాశాలు కల్పించామని తెలిపారు. ప్రజాభిప్రాయం, పార్టీ కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో 50 శాతానికి పైగా మద్దతు ఉన్నవారికి ప్రాధాన్యమిచ్చామన్నారు. టిడిపిపోటీ చేసే 11మేయర్ స్థానాలను 11సామాజిక వర్గాలకు కేటాయించామని చంద్రబాబు వివరించారు. క్షేత్రస్థాయిలో కూటమి నేతలంతా మిత్రధర్మం పాటిస్తూ భాగస్వామ్య పార్టీల మనోభావాలను గౌరవించాలని చంద్రబాబు సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు కూటమిని మరింత బలోపేతం చేసుకోవడం ముఖ్యమని స్పష్టం చేశారు. సీట్లు దక్కని ఆశావహులకు నిర్ణయాన్ని వివరించి, ఒకటి రెండు చోట్ల తలెత్తిన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమర్థులైన నాయకత్వం ఎదిగేందుకు సహకరించాలన్నారు. అలాగే స్థానిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వైఎస్సార్సీపీ వ్యవహరిస్తోందని చంద్రబాబు ఆరోపించారు. గొడ్డలిపార్టీ చర్యలు, కుట్రలను నిశితంగా గమనిస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమ త్తం చేయాలన్నారు.

## చెదురుమదురు ఘటనలతో

# ముగిసిన నామినేషన్లు

### ఎపిలో చివరి రోజు భారీగా దాఖలు



ఆదివారం విజయవాడ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వంగవీటి రాధా

గురజాల, రాయచోటిలో పోటీకి దూరంగా వైఎస్సార్సీపి

బరి నుంచి తప్పకుంటున్నాం: పెద్దిరెడ్డి

పుంగనూరుకు రావొద్దు: పెద్దిరెడ్డికి పోలీసుల నోటీసులు

రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఘర్షణలు

కూటమిలో కుదరని సీట్ల సర్దుబాటు

పోటాపోటీగా నామినేషన్లు

కడపలో 70మంది వైసిపి నేతలపై కేసులు

వైసిపి అరాచకాలపై విడియోలు విడుదల చేసిన టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్ర

**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. నామినేషన్లు చివరి రోజున అనేక చోట్ల ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ల దాఖలుకు ఇవాళ మధ్యాహ్నం 3గంటల వరకు సమయం ఉండటంతో అభ్యర్థులు భారీ ర్యాలీలతో ఆర్వో కార్యాలయాలకు చేరుకుని నామపత్రాలు సమర్పించారు. మధ్యాహ్నం మూడు లోగా కార్యాలయాల లోపలున్న వారికి నామినేషన్ వేసే అవకాశం కల్పించారు. గుంటూరు కూటమి మేయర్ అభ్యర్థిగా టిడిపికి చెందిన కోవెల మూడి లక్ష్మీ అపర్ణ నామపత్రాలు సమర్పించారు. అయితే కూటమి పార్టీల (టిడిపి, జనసేన, బిజెపి) మధ్య ఇంకా సీట్ల సర్దుబాటు పూర్తి కాకపోవడంతో ఒకే డివిజన్ నుంచి తెలుగుదేశం, కమలం అభ్య ర్థులు విడివిడిగా నామినేషన్లు వేశారు. సర్దుబాటు తర్వాత ఒకరే పోటీలో ఉంటారని నాయకులు చెబు తున్నారు. విజయవాడ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని మేయర్ స్థానానికి నామినేషన్ వేసిన కూటమి అభ్యర్థి, జనసేన నేత వంగవీటి రాధాకృష్ణ స్పష్టం చేశారు. మూడు పార్టీల నేతలతో కలసి పనిచేసి నగర అభివృద్ధిని మరోస్థాయికి తీసు కెళ్తామని చెప్పారు. ఈ మేరకు కూటమి నేతలతో భారీ ర్యాలీగా వెళ్లి రాధా నామపత్రాలు సమర్పిం చారు. మరోవైపు వైఎస్సార్సీపి తరఫున మేయర్ అభ్యర్థిగా రాయన భాగ్యలక్ష్మి నామినేషన్ వేశారు. కర్నూలు మేయర్ కూటమి అభ్యర్థిగా విజ య ప్రత్యూష నామినేషన్ వేశారు. ఒంగోలు మేయర్ స్థానానికి టిడిపి అభ్యర్థిగా శ్రీ శిల్ప నామినేషన్ దాఖలు చేశారు. అనంతపురం మేయర్ కూటమి అభ్యర్థిగా అజేష్‌బాబు నామపత్రాలు సమర్పించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా పి.శ్రావణి నామినేషన్ వేశారు. ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. నందిగామలో నామినేషన్లు కోలాహలంగా సాగాయి. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి శాఖమూరు వంశీధర్, 32 మంది వార్డు అభ్యర్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి నామపత్రాలు సమర్పించారు. కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ అభ్యర్థి కన్నెగంటి అమూల్య నామినేషన్ వేశారు. కూటమి ఐక్యతను చాటుతూ ఇబ్రహీంపట్నంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా దానం లాజర్ బాబు (కూటమి) నామినేషన్ దాఖలు చేశారు. కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా నాగమణి (టిడిపి), ప్రణీతరెడ్డి (వైఎస్సార్సీపి) తరఫున నామపత్రాలు సమర్పించారు. ఎమ్మిగనూరు ఛైర్‌పర్సన్‌గా మాచాని సునీత (తెలుగుదేశం)నామినేషన్ వేశారు. పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపల్ ఛైర్మన్‌గా షామీమ్‌ఖాన్ (కూటమి), చిలకలూరి పేట మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తోట రాజరాజేశ్వరి (జనసేన కూటమి) నామినేషన్ వేశారు. బాపట్లజిల్లా చీరాల ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎరిచర్ల హానీ స్పందన (టిడిపి) తన 44 వార్డుల కౌన్సిలర్లతో కలిసి ఒకేసారి భారీ ర్యాలీతో నామినేషన్లు దాఖలు చేశారు.

**గురజాల, పుంగనూరు,రాయచోటీలో నామినేషన్లు దాఖలు చేయని వైఎస్సార్సీపి:** గురజాల మున్సిపాలిటీలో వైఎస్సార్సీపి నుంచి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దీంతో ఈ పురపాలిక కూటమి పరమై ఏకగ్రీవం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పుంగనూరులోనూ వైఎస్సార్సీపి అభ్యర్థులు ఒక్క నామినేషన్ కూడా వేయలేదు. ఇక్కడ ఎన్డీఏ కూటమి (టిడిపి, జనసేన, బిజెపి) అభ్యర్థులతో పాటు సిపిఐ, ఎస్‌డిపిఐ అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. రాయచోటి పురపాలక ఛైర్మన్ పదవితో పాటు కౌన్సిలర్ స్థానాలకు కూడా వైఎస్సార్సీపి అభ్యర్థులు ఎవరూ నామినేషన్లు సమర్పించలేదు. పిడుగురాళ్లలో వైఎస్సార్సీపి ఛైర్మన్ అభ్యర్థి షేక్ అబ్దుల్లా నామినేషన్ల కేంద్రానికి 20 నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నారు. అప్పటికే నిర్ణీత సమయం ముగిసిపోవడంతో ఆయన నామినేషన్ వేయకుండానే వెనుదిరిగారు. దర్శిలోనూ గడువు సమయం మించిపోవడంతో వైఎస్సార్సీపి ఛైర్మన్ అభ్యర్థితో పాటు 25 మంది కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్ వేయకుండానే వెనుదిరిగారు. ఇక ప్రకాశం జిల్లా కనిగిరి నామినేషన్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ కేంద్రం వద్ద వైఎస్సార్సీపి నేతలు ఆందోళనకు దిగడంతో ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉందని, గుంపులుగా ఉండరాదని పోలీసులు హెచ్చరించారు. ఈ క్రమంలో పోలీసులు, వైఎస్సార్సీపి నాయకుల మధ్య తోపులాట జరిగింది. నిబంధనలు ఉల్లంఘించి నినాదాలు చేస్తున్న ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు. మచిలీపట్టణం, పెడన, భీమవరం మున్సిపాలిటీల్లో నామినేషన్లు చివరి రోజున వాగ్వాదాలు చోటుచేసుకున్నా, పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. పలుచోట్ల చివరి క్షణాల్లో జనసేన అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడంతో నామినేషన్లు దాఖలు సందర్భంలో వారు గందరగోళానికి గురయ్యారు.

## బెయిల్ విచారణకు ఎస్ఇఎం గైర్హాజరు

### సౌరవ్ దాస్, అశుతోష్ రంకా విడుదలలో జాప్యం



**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా బెయిల్ పిటిషన్ల విచారణ ఆదివారం ఆలస్యమైందని కార్యకర్త రత్నా సింగ్ ఆరోపించారు. నిర్ణీత సమయానికి స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హాజరుకాకపోవడంతో విచారణ ముందుకు సాగలేదని ఆమె పేర్కొన్నారు. బెయిల్ కోసం సమర్పించిన నలుగురు ష్యూరిటీలను కూడా అస్పష్టమైన కారణాలతో తిరస్కరించారని ఆరోపించారు. సీజేపీ న్యాయ విభాగాధిపతిగా ఉన్న రత్నా సింగ్, ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో వెల్లడించారు. మధ్యాహ్నం 12 గంటలకు విచారణ జరగాల్సి ఉండగా, తాను ఉదయం 11 గంటల నుంచే పోలీస్ స్టేషన్‌లో వేచి ఉన్నానని తెలిపారు. సాయంత్రం 4.42 గంటల వరకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు రాలేదని ఆమె ఆరోపించారు. ఇది నిజంగా ఆందోళన కలిగించే విషయం. ఇప్పటివరకు నాలుగు ష్యూరిటీలను అస్పష్టమైన కారణాలతో తిరస్కరించారు. నిరసనల్లో పాల్గొన్నందుకు ఎఫ్ఐఆర్‌లు నమోదైన వ్యక్తులను నేర చరిత్ర ఉన్నవారిగా పరిగణిస్తున్నారని రత్నా సింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈనెల 14న సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను ఐదు రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. నిరసనలకు కేటాయించిన ప్రదేశంగా గుర్తింపును కోల్పోయిన జంతర్ మంతర్‌లోకి, తాళం వేసి ఉన్న గేట్లను ఎక్కి ప్రవేశించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. తాము జాతీయ జెండాను ఎగురవేసి నినాదాలు మాత్రమే చేశామని సీజేపీ నాయకులు చెబు తున్నారు. తరువాత మీడియాతో మాట్లాడిన రత్నా సింగ్ మేము ఉదయం నుంచే ఇక్కడ ఉన్నాం. మొత్తం విచారణ మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుందని మాకు చెప్పారు. ఈ రోజు అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. పత్రాల ధ్రువీకరణ కూడా జరిగింది. మధ్యాహ్నం నుంచే వేచి చూస్తున్నాం. ఎస్ఈఎం మధ్యాహ్నం 1.30 గంటలకే పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పటికీ, సాయంత్రం 5 గంటల వరకు కోర్టు గదిలోకి రాలేదు. చివరకు వచ్చిన తరువాత కూడా సౌరవ్, ఆశుతోష్‌లను జ్యుడీషియల్ కస్టడీ నుంచి విడుదల చేయాలా వద్దా అనే అంశంపై కేసు వాదనలు వినకుండా ఏకపక్ష వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

## శ్రమను గౌరవించే పండుగ దసరా

### మరుగున పడుతున్న సంస్కృతి..

### కన్పించని దసరా వేషాలు..

### అంతా కార్పొరేట్ సందడే

**అమరావతి,అక్టోబరు18,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ లో ఇప్పుడు దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వీధుల్లో తోరణాలు, ఇళ్ళ ముంగిట ముగ్గులు, అమ్మవారి ఆలయాల్లో జయజయ ధ్వానాలు. కానీ ఈ దసరా కేవలం పండుగ మాత్రమే కాదు. ఇది తెలుగు నేలపై శ్రామిక శక్తిని గౌరవించే గొప్ప వేదిక. పూర్వం దసరా వచ్చిందంటే ఊరంతా ఒక పండుగ వాతావరణం. పొలం పనులు ముగిసి, ఆహారపు పంటలు ఇంటికి చేరిన తరువాత రైతు తనకు సాయం చేసిన వ్యవసాయ కార్మికుడిని గుండెకు హత్తుకునేవాడు. కొత్త బట్టలు, ధాన్యం, కానుకలు ఇచ్చి సత్కరించేవాడు. నీవు లేకుంటే నా పంట లేదు అని చెప్పి, ఆ శ్రమకు పాదాభివందనం చేసేవాడు. అదే తెలుగువారి దసరా.ఈ పర్యాయం దేవీ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ నవరాత్రి సందర్భంగా భారత ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా విజయవాడ వచ్చి కనకదుర్గమ్మను దర్శించుకుని తరించారు. ఒక రాష్ట్రపతి ఒక గుడి ముంగిట నిలబడి అమ్మను దర్శించుకోవడం అంటే మన సంస్కృతికి దక్కిన గౌరవం. అదే సమయంలో దసరా ఉత్సవాలకు సమాంతరంగా విజయవాడ ఉత్సవ కూడా ఘనంగా జరిగింది. కళలు, సంస్కృతి, ప్రదర్శనలతో విజయవాడ నగరం మొత్తం ఉత్సవమయమైంది.కానీ ఈ వైభవం వెనుక ఒక విషాదం దాగి ఉంది.

దసరా అంటే కళాకారుల పండుగ కూడా. పులివేషగాళ్ళు ఒళ్ళంతా రంగులు పూసుకుని, డప్పు మోతతో వీధుల్లో ఊరేగేవారు. పగటివేషగాళ్ళు హాస్యంతో, వ్యంగ్యంతో సమాజాన్ని నవ్విస్తూనే ఆలోచింపజేసేవారు. కోతల రాయుడు, గారడీ వాళ్ళు, ఇతర కళాకారులు ఇంటింటికి వచ్చి తమ కళను ప్రదర్శించేవారు. కనక (డప్పు) తప్పట్ల చప్పుల్లే లేవు.ఈ రోజు ఆ కళాకారులు ఎక్క? పులి వేషగాళ్ళు, ఇతర కళాకారులు ఇప్పుడు కరువయ్యారు. ఉన్న కొద్దిపాటి వారికి కూడా ఆదరణ లేదు. వీళ్ళకి పెన్షన్లు లేవు, ఇతర ఆదరణలు లేవు. ఎండలో, వానలో ఒళ్ళంతా రంగు పూసుకుని వచ్చే ఆ పులివేషగాడిని చూసి ఇప్పుడు తలుపు వేసేస్తున్నారు. పది రూపాయలు ఇచ్చే చేతులు కూడా కరువయ్యాయి. ఆ కళాకారుడి కడుపు నిండడం లేదు. అతడి కళ నశించిపోతోంది. తరతరాలుగా వస్తున్న వారసత్వం ఆగిపోతోంది.

**ఇది మనందరి తప్పే.. కార్పొరేట్ సంస్కృతి దసరాను ఒక షాపింగ్ పండుగగా మార్చేసింది**

ఇది మనందరి తప్పే.కార్పొరేట్ సంస్కృతి దసరాను ఒక షాపింగ్ పండుగగా మార్చేసింది. దసరా అంటే ఆఫర్లు, డిస్కౌంట్లు, కొత్త ఫోన్లు. శ్రమను గౌరవించడం పోయి, శ్రమను కొనుగోలు చేసే సంస్కృతి వచ్చింది. విజయవాడ ఉత్సవ్ వంటి పెద్ద వేదికలు ఉన్నా, వీధి కళాకారుడి గొంతు మాత్రం వినిపించడం లేదు.అయినా తెలుగు నేల ఇంకా తన ఆత్మను కోల్పోలేదు. నవమి రోజున అమ్మవారు మహిషాసుర మర్దినిగా అవతరిస్తుంది. మహిషాసురుడు అంటే కేవలం ఒక రాక్షసుడు కాదు. అహంకారానికి, దౌర్జన్యానికి, అన్యాయానికి ప్రతీక. ఆ అహంకారాన్ని సంహరించడానికి అమ్మవారు ఆయుధం పట్టింది. నేడు మన సమాజంలో మహిషాసురులు రూపం మార్చుకున్నారు. కార్పొరేట్ దోపిడీ, కళల విధ్వంసం, శ్రమ దోపిడీ రూపంలో మన ముందున్నారు.దసరా మనకు చెప్పే సందేశం ఒకటే. శ్రమించే వాడిని గౌరవించు. కళను బతికించు. అహంకారాన్ని అణచు.ఈ దసరాకు మనం ఒక ప్రతిజ్ఞ చేద్దాం. రాష్ట్రపతి వచ్చి అమ్మవారిని దర్శించినట్లే, మనం కూడా వీధిలోకి వచ్చే ఆ చిన్న కళాకారుడిని గౌరవిద్దాం. పులి వేషగాడికి పది రూపాయలు లే కాదు, ఒక చప్పట్లు ఇద్దాం. రైతు తన కార్మికుడికి కానుక ఇచ్చినట్లుగా, మనం కళాకారుడికి ఆదరణ ఇద్దాం.అది జరిగినప్పుడే దసరా మళ్ళీ దసరా అవుతుంది. కనకదుర్గమ్మ ఆశీస్సులు మనకు దక్కుతాయి.ఈ దసరా కేవలం పండుగ కాదు. ఇది మన శ్రమకు, మన కళకు, మన సంస్కృతికి మనం ఇచ్చే గౌరవం

**ఊసే లేని బుర్రకథలు,హరికథలు**

దసరా సందర్భంలో ఆకట్టుకునేవి బుర్రకథలు,హరికథలు,ఇవి అలౌకిక చింతనతో పాటు కథకుల చెప్పే లౌకికంశాల ద్వారా సామాజిక స్పృహను కలిగించేవి.ఆదరణ లేక కథకులు తగ్గుతున్నారు.ఒక వేళ ఈ ప్రదర్శనలు జరిగినా, వాటిలో సినిమా పాటలు చొప్పిస్తున్నారు.సాధారణ సాంస్కృతిక ప్రదర్శనలు డిజె హోరులో కలిసిపోతున్నాయి.

## జర్మనీ ఉద్యోగాల పేరుతో మోసమా?

### టామ్‌కామ్ కుంభకోణంపై సిఐడి విచారణ చేయాలి: మాజీమంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

**హైదరాబాద్,అక్టోబరు18,ప్రభాతవార్త:**జర్మనీలో కొలువుల పేరిట ప్రభుత్వ రంగ సంస్థ టామ్‌కామ్ ద్వారా నిరుద్యోగ యువతను రేవంత్ రెడ్డి సర్కార్ నిలువునా ముంచిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 జిల్లాల్లోని 75 మంది నిరుద్యోగుల నుంచి వీసాలు, పరీక్షల పేరిట ఒక్కొక్కరి వద్ద దాదాపు రూ. 4.5 లక్షలు వసూలు చేసి రెండేళ్లుగా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం మాట నమ్మి రైతులు తల్లులు, భార్యల మెడలోని పుస్తెలతాళ్లు తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బుకు ఇప్పటికీ వడ్డీలు కడుతూ రోడ్డున పడ్డారని పేర్కొన్నారు.రెండేళ్లు గడిచినా 75 మందిలో ఏ ఒక్క అభ్యర్థికీ జర్మన్ కంపెనీతో కనీసం ఇంటర్వ్యూ కూడా ఇప్పించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని, బీ1 లాంగ్వేజ్ పరీక్ష పాసైన వారికి మళ్లీ బీ2 అంటూ కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. తొమ్మిది మంది జర్మనీకి వెళ్తున్నారని ఘనంగా ప్రచారం చేసుకుని తీరా ఒక్కరినీ పంపించలేదని,

ఏదైనా సమస్య వస్తే 1,000 కిలోమీటర్ల దూరంలోని లక్నో కోర్టుకు వెళ్లాలని అమాయక యువతతో బలవంతంగా సంతకాలు పెట్టించుకున్నారని పేర్కొన్నారు.టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో ఎందరికి ఉద్యోగాలు ఇచ్చారో ఆర్టీఐ ద్వారా సమాచారం అడిగినా, చట్టబద్ధమైన గడువు దాటినా ప్రభుత్వం సమాధానం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. బాధితులు న్యాయం కోసం ఏడుస్తుంటే, కార్మిక శాఖ మంత్రి మాత్రం మొన్న జూన్‌లో మరో కొత్త బ్యాచ్‌ను ప్రారంభిస్తూ ఉద్యోగాలంటూ మాయమాటలు చెప్పడం దుర్మార్గమన్నారు.ఎన్నికల్లో కాంగ్రెస్ ఇస్తామన్న 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ ఎటుపోయింది రేవంత్ రెడ్డి?

అని ప్రశ్నించారు. టామ్‌కామ్ వసూలు చేసిన ప్రతి పైసాను బాధితులకు వెంటనే వాపస్ ఇవ్వాలి. రెండేళ్ల విలువైన కాలం వృథా చేసినందుకు, తెచ్చిన అప్పుల వడ్డీల భారం, మానసిక క్షోభకు గురిచేసినందుకు ఒక్కో అభ్యర్థికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మోసపోయిన బాధితులందరికీ ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలి.టామ్‌కామ్ కుంభకోణంపై వెంటనే సీఐడీ లేదా న్యాయ విచారణ జరిపించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పటివరకు ఎంత ఫీజు వసూలు చేశారు? ఎంతమందికి విదేశీ ఉద్యోగాలు ఇచ్చారో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి.నిరుద్యోగ కుటుంబాలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని చెప్పారు..

## తొలి రోజే ఆంధ్ర ఆధిపత్యం

- 275 పరుగులకే హైదరాబాద్ ఆలౌట్
- లంచ్ తర్వాత విజృంభించిన ఆంధ్ర బౌలర్లు
- త్రిపురణ విజయ్‌కు నాలుగు వికెట్లు
- ఆంధ్ర, హైదరాబాద్ రంజీ మ్యాచ్



**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్ర, హైదరాబాద్ జట్ల మధ్య మూలపాడులో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో తొలి రోజే ఆంధ్ర జట్టు బౌలర్లు సత్తా చాటారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టు 86 ఓవర్లలో 275 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు రెండు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆటలో ఆంధ్ర జట్టు పైచేయి సాధించింది.తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు లంచ్ విరామం వరకు పటిష్టంగా కనిపించింది. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్, అభిరత్ రెడ్డి నిలకడగా ఆడుతూ జట్టుకు మంచి ఆరంభాన్ని అందించారు. లంచ్ విరామ సమయానికి హైదరాబాద్ జట్టు ఒక వికెట్ నష్టానికి 119 పరుగులు చేసి మెరుగైన స్థితిలో నిలిచింది.

అయితే, లంచ్ విరామం అనంతరం ఆంధ్ర బౌలర్లు ఒక్కసారిగా పుంజుకుని హైదరాబాద్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. వరుస విరామాల్లో వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థి జట్టు స్కోరు వేగానికి అడ్డుకట్ట వేశారు. ఓపెనర్లతో పాటు మిడిల్ ఆర్డర్‌లో రాహుల్ రాదేష్ మినహా మిగిలిన బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో హైదరాబాద్ జట్టు తొలి రోజే ఆలౌట్ అయింది.

హైదరాబాద్ బ్యాటర్లలో తన్మయ్ అగర్వాల్ 75 బంతుల్లో నాలుగు ఫోర్లతో 42 పరుగులు చేయగా, అభిరత్ రెడ్డి 108 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, ఒక సిక్సర్‌తో 67 పరుగులు సాధించాడు. మిడిల్ ఆర్డర్‌లో రాహుల్ రాదేష్ 105 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 58 పరుగులు చేసి జట్టు స్కోరుకు కీలకమైన పరుగులు జోడించాడు. వీరు ముగ్గురు మినహా మిగిలిన బ్యాటర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు.

ఆంధ్ర బౌలర్లలో త్రిపురణ విజయ్ అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు పడగొట్టాడు. సౌరభ్ కుమార్, లలిత్ మోహన్ చెరో మూడు వికెట్లు తీసి హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. ముఖ్యంగా లంచ్ విరామం తర్వాత ఆంధ్ర బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ వరుస వికెట్లు సాధించడం జట్టుకు కలిసొచ్చింది. తొలి రోజే హైదరాబాద్ జట్టును 275 పరుగులకు ఆలౌట్ చేయడంతో ఆంధ్ర జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించే దిశగా అడుగులు వేసింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేయడంతో రెండో రోజు ఆటపై ఆసక్తి నెలకొంది. రెండో రోజు ఆంధ్ర బ్యాటర్లు ఎలా రాణిస్తారు? హైదరాబాద్ బౌలర్లు పుంజుకుని వికెట్లు సాధిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# పరిశ్రమలకూ విద్యుత్ టెర్రర్!

## - ఇప్పటికే సాగులో అప్రకటిత కోత - పెరుగుతున్న డిమాండ్‌తో ఉక్కిరిబిక్కిరి - ఇంధన సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త** ఎల్ నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో తెలంగాణ పరిశ్రమలకు షెడ్యూల్డ్ కోతలు అనివార్యమయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం ఉండదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ, రానున్న రోజుల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఆ సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతరాయం తప్పనిసరి కానుందనే అభిప్రాయం సంబంధిత అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. వ్యవసాయ, వాణిజ్య, గృహ రంగాలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా, గత నెల రోజులుగా రాష్ట్రంలో పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఒక పెద్ద సవాలుగా మారింది. వర్షాభావం నేపథ్యంలో ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం పెరగడంతో, ఇప్పటికే అప్రకటిత కోతలు, లో వోల్టేజ్ అమలు చేస్తుండటంతో రైతాంగం రోడ్డెక్కి ఆందోళనలు సాగిస్తోంది. తాజాగా రెండు రోజుల క్రితం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి 2003 మెగావాట్ల గరిష్ట స్థాయికి విద్యుత్ వినియోగంచేరుకుంది. సూపర్ ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ఇక 60 శాతానికి పైగా విద్యుతును వ్యవసాయ, వాణిజ్య రంగాలు వినియోగిస్తుండగా, 16 నుండి 20 శాతం మేర పరిశ్రమలు వినియోగిస్తున్నాయి. ప్రతిరోజూ వినియోగించే మొత్తం విద్యుత్లో మిగిలిన 25 నుండి 30 శాతం గృహ రంగానికి అవసరం అవుతుంది. మిగతా మూడు రంగాలలో విద్యుత్ డిమాండ్ అకస్మాత్తుగా పెరగడం పరిశ్రమపై ప్రభావం చూపుతుంది. రబీలో వ్యవసాయ అవసరాలు, పరిశ్రమలు, ఐటీ సంస్థలు, గృహోపయోగానికి డిసెంబరు నుంచి విద్యుత్ డిమాండ్ 20500 మెగావాట్లకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ అవసరాల కోసం, అలాగే గృహ అవసరాల కోసం విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని నిధులను సమీకరించాల్సి ఉంటుందని, ప్రధానంగా ప్రతి నెలా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను పొందుతున్న గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఇంధన అవసరాలను తీర్చడానికే ఈ నిధులు అవసరమని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ కొనుగోలు నిమిత్తం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో ప్రభుత్వానికి పెద్ద భారంగా మారింది. ఈ అస్థిరమైన ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది రాష్ట్ర ఖజానాపై కనీసం రూ.2 వేల కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుందని లెక్కకడుతున్నారు. రాష్ట్ర కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వివరాలు ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు 16681 మెగావాట్ల డిమాండ్ నమోదు కాగా, శనివారం 18130 మెగావాట్లుగా ఉంది. దీంతో ఎనర్జీ ఎక్చేంజీలో యూనిట్ రూ.2.69 చొప్పున శనివారం 5943 మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్ర పంపిణీ సంస్థలు కొనుగోలు చేశాయి. ఈ పరిస్థితుల్లో రాబోయే నాలుగైదు నెలల పాటు ఉండే పొడి కాలం మొత్తం, ముఖ్యంగా రబీ సీజన్ ముగిసినప్పటి నుండి ఏప్రిల్ చివరి వరకు విద్యుత్ డిమాండ్ను తీర్చడానికి పలు కఠిన చర్యలు తీసుకోవలసి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా గృహ, పారిశ్రామిక రంగాల వంటి కొన్ని రంగాలకు షెడ్యూల్ ప్రకారం విద్యుత్ కోతలు విధించడం వల్ల, ప్రతిరోజూ గరిష్ట వినియోగ సమయాల్లో ఏర్పడే ఆకస్మిక విద్యుత్ డిమాండ్‌ను అధిగమించవచ్చని విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన ఒక ఉన్నతాధికారి తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో 417 మంది మందు బాబుల పట్టివేత

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివారు ప్రాంతాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి వేళలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 417 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 353 మంది ద్విచక్ర వాహనదారులు, 25 మంది ఆటో డ్రైవర్లు, 39 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 91 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా, 192 మంది 51 నుంచి 100 పాయి ంట్ల వరకు, 71 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 45 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, తొమ్మిది మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఐదుగురు 251 నుంచి 300 పాయింట్ల వరకు వుండగా నలుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సే వించినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమి షనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆ యన వెల్లడించారు సైబరాబాద్‌లో 320 మంది మందు బాబుల పట్టివేత ఇదిలావుండగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 320 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 265 మంది ద్విచక్ర వాహనదారులు,16 మ ంది ఆటో డ్రైవర్లు, 38 మంది కార్ల డ్రైవర్లు, ఒకరు భారీ వాహనాల డ్రైవర్ వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు.

## కారు ఢీకొని అక్కా, తమ్ముడు మృతి

### - సద్దుల బతుకమ్మ రోజున విషాదం



రేఖ(ఫైల్)



ఏదుల్ల నవీన్(ఫైల్)

**హాయత్ నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** సద్దుల బతకమ్మ రోజున సోదరిని పుట్టింటికి తీసుకు వస్తుండగా కారు ఢీకొనడంతో ఆమెతో పాటు సోదరుడు మృతి చెందిన సంఘటన హాయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు...ఇబ్రహీం పట్నంకు చెందిన ఏదుల్ల నవీన్ (25) పెద్ద అంబర్ పేటలోని తన పెద్దమ్మ కందుకూరి సువర్ణ ఇంట్లో ఉంటూ ఫోటో గ్రాఫర్ గా పనిచేస్తున్నాడు. పెద్దమ్మ కుమార్తె పిడుగు రేఖ దసరా పండుగను పురస్కరించుకుని శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి లోని అత్తగారింటి నుండి ఆదివారం పుట్టింటికి వస్తుంది. మధ్యాహ్నం ఆమె ఎల్బీనగర్లో బస్సు దిగగా... అక్కడి నుండి నవీన్ ఆమెను, రెండేళ్ల ఆమె కూతురుని స్కూటీ మీద పెద్దఅంబర్ పేటకు తీసుకువస్తున్నాడు. హాయత్ నగర్ బస్టాండు సమీపంలో ముందు డీసీఎం లారీ ఆగి ఉండగా... స్కూటీని స్లో చేసాడు. ఆ సమయంలో వెనుక నుండి వేగంగా వచ్చిన కారు స్కూటీని బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో నవీన్, రేఖలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన రేఖ కుమార్తెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మరో ఐదు నిముషాల్లో ఇంటికి చేరుకు నేంతలో ప్రమాదంలో అక్కా , తమ్ముడు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

## ఎనిమిది నెలల తర్వాత ఇరాన్‌కు కొత్త రక్షణమంత్రి



**టెహ్రాన్, అక్టోబరు 18:** ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ రక్షణ మంత్రి మరణించిన ఎనిమిది నెలల తరవాత కొత్త రక్షణ మంత్రిని నియమించింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త దాడిలో మొదటిరోజే ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా ఖమేనీతో పాటు పలువురు అగ్రనేతలు మరణించిన సంగతి తెలిసిందే. అయితే మరణించిన వారిలో ఆ దేశ రక్షణ మంత్రి అజీజ్ నాసిర్జాదే కూడా ఉన్నారు. రక్షణ మంత్రి మరణించి ఎనిమిది నెలలకు కొత్త రక్షణ మంత్రిగా మెహర్ దాద్ అఖ్లాఘీని నియమించింది. రక్షణమంత్రి నియామకంపై విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా మొత్తం 277 మంది సభ్యులు ఓటింగ్ లో పాల్గొన్నారు. ఈ ఓటింగ్ లో అఖ్లాఘీకి అనుకూలంగా 237 ఓట్లు వచ్చాయి. దీంతో అఖ్లాఘీ కొత్త రక్షణమంత్రిగా ఎన్నికయ్యారు. ఓటింగ్ కు ముందు అఖ్లాఘీ మాట్లాడుతూ తనకు పార్లమెంట్ విశ్వాస తీర్మానం ద్వారా ఆమోదం లభిస్తే, ఈ కీలకమైన సమయంలో బాధ్యతలు చేపడతానని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశాన్ని రక్షించాలంటే ప్రస్తుత పరిస్థితులపై కచ్చితమైన అవగాహన ఉండాలని అన్నారు. పరిణామాల వెనుక ఉన్న తర్కాన్ని అర్థం చేసుకోవాలని చెప్పారు. ప్రభావం చూపే ధోరణులను గుర్తించాలని, భవిష్యత్ లో ఎదురయ్యే వివిధ అవకాశాలు, పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. అయితే అఖ్లాఘీకి సైనిక హోదా లేకపోయినప్పటికీ, రక్షణ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్నట్టు తెలుస్తోంది. గత 42ఏళ్లుగా ఆయన ఇరాన్ మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయుధాలను తయారు చేసే సంస్థకు కూడా ఆయన అధిపతిగా ఉన్నారు. ఇక ఇలాంటి క్లిష్ట సమయంలో రక్షణశాఖ బాధ్యతలు చేపట్టడంతో అఖ్లాఘీ పరిస్థితులను ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## డిజిటల్ అరెస్టు కేసులో ఇద్దరు నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** డిజిటల్ అరెస్టు కేసులో ఇద్దరు నేరగాళ్లను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ ఇద్దరు నిందితులు మ్యూల్ ఖాతాల నిర్వాహకులుగా తేలింది. దీనికి సంబంధించిన వివరాలను సిసిఎస్ డిసిపి చైతన్య కుమార్ ఆదివారం మీడియా కు వెల్లడించారు. 2025 మార్చి నెల మూడవ తేదీన విశ్రాంత ఉద్యోగిని డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ నేరగాళ్లు సిబిఐ అధికారులమని, ఈడీ అధికారులమని బెదిరించి 29 లక్షల 17 వేల 668 రూపాయలను తమ బ్యాంకు ఖాతాలకు మళ్లించుకున్నారు. మనీలాండరింగ్ కేసులో నింది తుడుగా వున్నావని బెదిరించిన నేరగాళ్లు ఈ దోపిడీకి పాల్పడ్డారు. దీనిపై బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టగా దాదాపు ఏడాదిన్నర తరువాత శనివారం నాడు ఈ కేసులో అమీర్‌పేట్‌కు చెందిన మహమ్మద్ అష్ఫాక్ హుస్సేన్ (27), అహ్మద్ నజీముద్దీన్ (27)లను అరెస్టు చేశారు. ఈ కేసులో అసలు నిందితుడు బెంగళూరుకు చెందిన సచిన్ పరారీలో వున్నాడు. సచిన్ సహకారంతో తొందరగా డబ్బులు సంపాదించాలనే ఆశతో వీరిద్దరు ఈ నేరానికి పాల్పడినట్లు తేలింది. ఇందుకోసం వీరిద్దరు పోలీసులు అను మానించకుండా వుండేందుకు సిడిఎం పద్ధతిని వాడారు. వీరిద్దరు బాధితుడి నుంచి కాజేసిన 29 లక్షల 17 వేల 668 రూపాయలను చెక్కుల ద్వారా డ్రా చేసి వాటిని సచిన్ సూచించిన ఖాతాలకు ఎటిఎం మిషిన్‌ల ద్వారా డిపాజిటన చేయగా ఇందుకుగానూ సచిన్ వీరికి కొంతమేర కమీ షన్ ఇచ్చాడు. ఇక సచిన్ ఇలా వచ్చిన డబ్బులను క్రిప్టో కరెన్సీ కొనుగోలుకు వాడినట్లు తేలింది. అరెస్టయిన మహమ్మద్ అష్ఫాక్ హుస్సేన్, అ హ్మద్ నజీముద్దీన్‌ల వద్ద రెండు సెల్‌ఫోన్లు బ్యాంకు ఖాతాల పుస్తకాలను జప్తు చేశారు. కాగా వీరిద్దరిపై దేశ వ్యాప్తంగా పలు చోట్ల 16 సైబర్ నేరాలు వున్నట్లు తేలింది. ఈ కేసులో కీలక నిందితుడైన సచిన్ కోసం గాలిస్తున్నారు.



## యుద్ధాన్నికోరుకోం.. మాజోలికి వస్తే ఊరుకోం!

### భారత్‌పై పాక్‌మేజర్ పరోక్ష హెచ్చరికలు

**రావల్పిండి, అక్టోబరు 18:** పాకిస్థాన్ మరోసారి అణు హెచ్చరికలతో తెరపైకి వచ్చింది. దేశ భద్రత విషయంలో శత్రువులు ఎలాంటి తప్పుడు అంచనాలకు పోవద్దని, ఒకవేళ పొరపాటున దురాక్రమణకు దిగితే ఊహకందని రీతిలో ప్రతీకారం ఉంటుందని పాకిస్థాన్ నేషనల్ స్ట్రాటజిక్ కమాండ్ కమాండర్ జనరల్ సయ్యద్ ఆమర్ రజా తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కాకుల్‌లోని పాకిస్థాన్ మిలటరీ అకాడమీలో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పాకిస్థాన్ ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోదని, తమ దేశంపై దుష్ట ఉద్దేశాలు పెట్టుకునేవారికి మాత్రం తమ వైఖరి చాలా కఠినంగా ఉంటుందని తేల్చిచెప్పారు. అణు వాతావరణంలో యుద్ధాలకు ఎలాంటి తావులేదని, శత్రువులు చేసే చిన్న పొరపాటు కూడా వాళ్ల ఊహకు అందని స్థాయి ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని జనరల్ రజా హెచ్చరించారు. దేశ సార్వభౌమాత్వాన్ని కాపాడుకోవడానికి, దేశంలోని ప్రతి అంగుళాన్ని రక్షించడానికి తమ సాయుధ బలగాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రాంతీయ భద్రత గురించి మాట్లాడుతూ సరిహద్దు దాటి జరిగే చొరబాట్లను ఏ పరిస్థితుల్లోనూ సహించేది లేదని జనరల్ రజా స్పష్టం చేశారు. కశ్మీర్ అంశంపై పాకిస్థాన్ తన పాత వైఖరినే గట్టిగా వినిపించారు.

# దేశంలో 1.14 లక్షల స్టార్టప్‌లు..

## 12 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన

**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** భారతదేశంలో ఇప్పటివరకు 1.14 లక్షలకు పైగా స్టార్టప్‌లు 12 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించాయని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. భారత ఆర్థిక వ్యవస్థపై తాజాగా విడుదల చేసిన సమీక్షా నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించింది. ది ఇండియన్ ఎకానమీ: ఎ రివ్యూ పేరుతో విడుదల చేసిన నివేదికలో భాగంగా, కేంద్ర ప్రభుత్వ స్టార్టప్ ఇండియా కార్యక్రమం కింద గుర్తింపు పొందిన 1.14 లక్షల స్టార్టప్‌లు 2023 అక్టోబర్ నాటికి 12 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించినట్లు ఆర్థిక వ్యవహారాల విభాగం తెలిపింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని డిజిటల్ వాణిజ్య వేదిక ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ 2023 నవంబర్ నాటికి 63 లక్షలకు పైగా లావాదేవీలను నమోదు చేసింది. 2023లో ప్రపంచవ్యాప్తంగా స్టార్టప్‌లు విలువల అంచనాల్లో సమస్యలు, పరిమిత సంఖ్యలో ఐపీఓలు, నియంత్రణపరమైన మార్పులు, స్థూల ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు వంటి సవాళ్లను ఎదుర్కొన్నాయి. అయినప్పటికీ, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద టెక్నాలజీ స్టార్టప్ వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది. గత ఏడాది దేశంలో 950కి పైగా టెక్ స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయి. నాస్కామ్, జిన్నోవ్ సంయుక్తంగా రూపొందించిన తాజా నివేదిక ప్రకారం, 2019 నుంచి 2023 మధ్య 31,000కు పైగా టెక్ స్టార్టప్‌లు సమీకరించిన మొత్తం పెట్టుబడులు 70 బిలియన్ డాలర్లను మించాయి. 2024లోనూ టెక్ స్టార్టప్ వ్యవస్థాపకులు ఆదాయ వృద్ధిని కొనసాగించాలని భావిస్తున్నారు. ముఖ్యంగా వ్యయాలను నియంత్రించడం, లాభదాయకతను గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లడంపై దృష్టి పెట్టనున్నారు. ముఖ్యంగా వ్యాపార సంస్థలకు సాంకేతిక సేవలు అందించే స్టార్టప్‌లు ఆచితూచి ముందుకు సాగనున్నాయి. డీప్‌టెక్ రంగంలో పెట్టుబడులు 2024లోనూ పెరుగుదల దిశగా సాగనున్నాయి. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, సుమారు 70 శాతం స్టార్టప్ వ్యవస్థాపకులు తమ ఉత్పత్తులు, సేవల్లో కృత్రిమ మేధస్సును అనుసంధానిస్తున్నారు. భారత స్టార్టప్ రంగంలో సాధారణంగా పెట్టుబడుల లభ్యత తగ్గుతున్నప్పటికీ, కృత్రిమ మేధస్సు విస్తరణ వ్యాపారవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులకు కొత్త అవకాశాలను అందిస్తోంది. ఈ రంగానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు అందిస్తుండటంతో, సాంకేతిక ఆధారిత వ్యాపారాలకు మరింత ఊతం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మైనర్‌బాలికపట్ల అనుచిత ప్రవర్తన.. బిజెపి నేతపై పోక్సో కేసు నమోదు

**ఇండోర్, అక్టోబరు 18:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గర్బా పందిరి వద్ద 15 ఏళ్ల బాలికను తోసేసి, దురుసుగా ప్రవర్తించిన ఘటనలో బీజేపీ మండలాధ్యక్షుడు కమల్ చౌహాన్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈనెల 15వ తేదీ రాత్రి ఇండోర్‌లోని హీరా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కనకేశ్వరి గర్బా పందిరికి ఓ 15 ఏళ్ల బాలిక తన కుటుంబంతో కలిసి వచ్చింది. పాస్ విషయంలో తలెత్తిన వివాదం కారణంగా అక్కడ నిర్వాహకుడిగా ఉన్న బీజేపీ మండలాధ్యక్షుడు కమల్ చౌహాన్‌కు, బాలిక కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన చౌహాన్ బారికేడ్ దాటి వచ్చి బాలికను చేతితో పట్టుకుని పలుమార్లు వెనక్కి తోసేశారు. ఇక్కడి నుంచి వెళ్లిపో అని ఆయన అరుస్తుండగా, ఆ బాలిక నన్ను ముట్టుకోవద్దు, ఇది సరైన పద్ధతి కాదు అని ప్రతిఘటించడం వీడియోలో స్పష్టంగా రికార్డయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు 17న హీరా నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కమల్ చౌహాన్‌పై పోక్సో చట్టంతో పాటు, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 74 (మహిళల గౌరవానికి భంగం కలిగించే ఉద్దేశంతో దాడి) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడిని ఇంకా అరెస్ట్ చేయలేదు. ఈ ఘటనపై బీజేపీ నగర అధ్యక్షుడు సుమిత్ మిశ్రా స్పందించారు. కమల్ చౌహాన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి, మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ అంతర్గతంగా ఈ వీడియోపై విచారణ జరుపుతోందని తెలిపారు. మరోవైపు, బాలికతో దురుసుగా ప్రవర్తించాలనే ఉద్దేశం తనకు లేదని, పాస్ వాగ్వివాదం పెరగడంతో అలా జరిగిందని చౌహాన్ చెప్పినట్లు సమాచారం. ఘటనను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ముఖ్యమంత్రి గర్బా పందిరిలో కన్యా పూజ చేసిన గంటల్లోనే ఘటన జరగడం సిగ్గుచేటన్నారు.



ఫోర్ ఫాదర్స్ పబ్ ముందు నీటిని వృథా చేస్తున్న సిబ్బంది

# నీటిని వృథా చేసిన పబ్‌కు రూ.20 వేల జరిమానా

## వాటర్ కనెక్షన్ కట్, టాంకర్ల నిలిపివేత

**జూబ్లీహిల్స్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** తాగునీటిని వృథా చేసిన జూబ్లీహిల్స్‌లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌పై జలమండలి అధికారులు చర్యలు తీసుకున్నారు. పబ్ యాజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తొలగించారు. వాణిజ్య అవసరాల కోసం జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని సైతం నిలిపివేశారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని రోడ్ నంబర్ 45లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌లో నీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో ఈ తనిఖీలు నిర్వహించారు. నీటి దుర్వినియోగం జరిగినట్లు గుర్తించి జరిమానా విధించడంతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తొలగించినట్లు వెల్లడించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సంస్థలు తాగునీటిని వృథా చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు నీటి కనెక్షన్ల తొలగింపు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి వృథా, దుర్వినియోగానికి సంబంధించిన ఘటనలను గుర్తిస్తే ప్రజలు ఫొటోలు, వీడియోలు, సంబంధిత వ్యక్తులు లేదా సంస్థల వివరాలు, ఘటన జరిగిన ప్రాంతం, పూర్తి చిరునామాతో సహా జలమండలి వాట్సాప్ నంబర్ 99499 30003కు పంపించాలని జలమండలి అధికారులు కోరారు. కస్టమర్ కేర్ నంబర్ 155313 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఫిర్యాదులపై విచారణ జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని,

సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. తాగునీటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రేటర్ నోయిడాలో ఎన్సీబి దాడులు

### రూ.45 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం





**నోయిడా, అక్టోబరు 18:** గ్రేటర్ నోయిడాలో భారీ డ్రగ్స్ తయారీ ల్యాబ్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు గుర్తించారు. అంతేకాదు ఈ ల్యాబ్ నుంచి రూ.45 కోట్ల విలువైన డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తయారు చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఒక విదేశీయుడు కూడా ఉన్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. డ్రగ్స్ తయారీకి సంబంధించి ఎన్సీబీకి ఇంటెలిజెన్స్ సమాచారం అందింది. ఈ ప్రకారం ఉత్తర ప్రదేశ్, గ్రేటర్ నోయిడా పరిధి, గౌతమ్ బుద్ధా నగర్ జిల్లా, జహంగాబాద్ కదాల్‌పూర్ గ్రామంలో విదేశీయులు ఈ డ్రగ్స్ తయారు చేస్తున్నారు. నిందితులు రెండు వేర్వేరు ఇండ్లను అద్దెకు తీసుకుని డ్రగ్స్ తయారు చేస్తున్నారు. ఒక ఇల్లును రా మెటీరియల్ నిల్వ చేసేందుకు వాడుతున్నారు. ఇంకో ఇంటిని ఈ మెటీరియల్‌ను ప్రాసెస్ చేసేందుకు, డ్రగ్స్ తయారీకి వినియోగిస్తున్నారు. దీనిపై అందిన సమాచారంతో అక్టోబర్ 16న ఎన్సీబీ అధికారులు ఆ ఇండ్లపై దాడి చేశారు. అక్కడ భారీ స్థాయిలో డ్రగ్స్, ముడి పదార్థాలను అధికారులు గుర్తించారు. వీటిని తయారు చేసేందుకు అవసరమైన ల్యాబ్‌ను కూడా గుర్తించారు. ఘటనా స్థలం నుంచి 379 కిలోలీ విలువైన అంఫేటమైన్ అనే కెమికల్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతర కెమికల్స్ కూడా ఉన్నాయి. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.45 కోట్లు ఉంటుందని అంచనా. అలాగే, డ్రగ్స్ తయారు చేస్తున్న ఇద్దరు నిందితులను కూడా ఎన్సీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని అబ్రహాం దుంబిరి, లల్లావంజువాలి అలియాస్ ఒలివియాగా గుర్తించారు. ఒలివియా మిజోరంనకు చెందిన యువతి. అబ్రహాం నైజీరియా దేశస్తుడు. వీరిలో ఒలీవియా గతంలో డ్రగ్స్ కేసులో అరెస్టైంది. హెరాయిన్ పట్టుబడిన కేసులో ఆమె నిందితురాలిగా ఉంది. ప్రస్తుతం పోలీసులు డ్రగ్స్ తయారు చేస్తున్న రెండు ప్రదేశాలను స్వాధీనంలోకి తీసుకున్నారు. ల్యాబ్‌ను సీజ్ చేశారు. నిందితులు ఇద్దరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.

# యుపిలో పోస్టర్ల కలకలం!

**లక్నో, అక్టోబరు 18:** ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో యాంటీ ఇండియా దషానన్ రావణ పేరుతో వెలసిన పోస్టర్లు కలకలం రేపాయి. ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ సహా పలువురి ముఖాలతో ఈ పోస్టర్లు వెలిశాయి. ఇండియాకు వ్యతిరేక శక్తులుగా అభివర్ణిస్తూ ఈ పోస్టర్లు నగరంలోని అనేక ప్రాంతాల్లో వెలిశాయి. మాజీ ఎంపీ, 2023లో మరణించిన ఎంపీ అతిక్ అహ్మద్‌ను రావణుడిగా చూపిస్తూ మిగతా ముఖాలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యూఎస్ కాంగ్రెస్ మహిళ ఇల్హాన్ ఒమర్, బంగ్లాదేశ్ నేత ముహమ్మద్ యూనస్, జార్జ్ సోరోస్, ప్రశాంత్ భూషణ్, ముఖ్తర్ అన్సారి ముఖాలను దశ ముఖాలుగా చూపిస్తూ పోస్టర్లు వెలిశాయి. వీరంతా ఇండియాకు వ్యతిరేకంగా, దేశాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర పన్నుతున్నారని ఆ పోస్టర్లలో పేర్కొన్నారు. సనాతన్ రక్షా సంగటన్ సంస్థ తరఫున ఈ పోస్టర్లు వెలిసినట్లు తెలుస్తోంది. ఈ పోస్టర్లలో ఉన్న వారంతా దేశానికి వ్యతిరేకులే అని సంస్థ పేర్కొంది. దేశ రాజకీయాలు, సామాజిక వ్యవస్థలపై దాడి చేస్తున్నారని ఆరోపించింది. మస్క్ ఇండియాపై కుట్ర పన్నాడు అనేందుకు ఆయన చేసిన సోషల్ మీడియా పోస్టులే సాక్షాలు అని ఈ సంస్థ పేర్కొంది. ఇల్హాన్ ఒమర్ కూడా గతంలో ఇండియాకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో పర్యటించిన విషయాన్ని గుర్తు చేసింది సనాతన్ రక్షా సంగటన్ సంస్థ. బంగ్లాదేశ్‌లో అధికార మార్పిడి కుట్రలో ముహమ్మద్ యూనస్ ఉన్నాడని, ఆయన కూడా ఇండియకు వ్యతిరేకంగా పని చేస్తారని సంస్థ వివరించింది. ఇక, ఇండియాకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలో నిత్యం వినిపించే పేరు అమెరికాకు చెందిన జార్జ్ సోరోస్. ఇండియాలో ఏదో ఒక అలజడి, అల్లర్లు సృష్టిస్తూ దేశాన్ని జార్జ్ సోరోస్ అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తుంటాడనే ప్రచారం ఎప్పటినుంచో ఉంది. ప్రతిపక్షాలుగా రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ కూడా అదే లక్ష్యంతో పని చేస్తారని సంస్త పేర్కొంది. దీంతో వారందరి ఫొటోలతో రావణుడి తలలను పోలిన పోస్టర్లతో ఈ సంస్థ పోస్టర్లు రూపొందించింది.

## రాయచోటిలో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవ విజయం

### వైసిపి చేసిన కర్మలకు ప్రజలే బుద్ధి చెబుతున్నారు: ఎపి మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**రాయచోటి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** రాయచోటి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పుంగనూరు టిడిపి మాజీ ఇంచార్జ్ చల్ల బాబు హర్షం వ్యక్తం చేశారు. విజయం సాధించిన అభ్యర్థులకు మిఠాయిలను తినిపించి సంతోషాన్ని పంచుతూ అభినందనలు తెలిపారు. గతంలో వైసిపి నాయకులు చేసిన దౌర్జన్యాలు, అరాచకాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతున్నారని మంత్రి మండిపల్లి పేర్కొన్నారు. గతంలో వారు చేసిన పనుల ఫలితాలే ఇప్పుడు తిరిగి కర్మలు ఎదురవుతున్నాయని, వైసిపి అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి కూడా ముందుకు రాని పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసిపికి రాజకీయంగా ఎదురుదెబ్బలు తప్పవని, ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని స్పష్టం చేశారు.

## వైసిపికి హైకోర్టులో ఎదురుదెబ్బ - మున్సిపల్ ఎన్నికల నామినేష్ల దాఖలు గడువు పెంపునకు వేసిన పిటిషన్ కొట్టివేత

**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో వైసిపికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నామినేషన్ల దాఖలుకు గడువును పొడిగించాలని కోరుతూ వైసిపి దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను రాష్ట్రఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. నామినేషన్ల స్వీకరణకు నిర్దేశించిన గడువు ఇప్పటికే ముగిసిపోయిందని, అందువల్ల ఈ పిటిషన్ విచారణకు అర్హత కోల్పోయిందని (నిరర్థకం) హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత తాము సాధారణంగా జోక్యం చేసుకోబోమని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో నామినేషన్ల గడువు పొడిగింపు కోసం వైసిపి చేసిన ప్రయత్నం విఫలమైంది.

## విజయవాడ కనక దుర్గ నేటి అలంకరణ

# శ్రీ మహిషాసురమర్దిని



"మహిషమస్తక నృత్త వినోదిని స్ఫుటరణన్మణి నూపుర మేఖలా
జననరక్షణ మోక్ష విధాయిని జయతి శుంభ నిశుంభ నిషూదిని "

దసరా శరన్నవరాత్రుల్లో నవమి తిథిని మహర్నవమి అనికూడా అంటారు. మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిస్తుంది. దేవీ నవావతారాలలో అత్యుగ్రరూపం మహిషాసురమర్దినీదేవి. ఆశ్వయుజ శుద్ధ నవమి రోజున అమ్మ మహిషాసురమర్దినిగా అవతరించి దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేసింది. ధర్మ విజయానికి సంకేతంగా ఆశ్వయుజ శుద్ధనవమినే 'మహర్నవమి'గా భక్తులు ఉత్సవం జరుపుకొంటారు. సింహ వాహనారూఢియై పాశం, పరుశు, త్రిశూలం, చక్రం, ఖడ్గం, విల్లు, ఆదిగా గల ఆయుధాలను ధరించిన అమ్మ సకల దేవతల అంశాలతో మహాశక్తి రూపంతో దుర్గమ్మవారు దర్శనమిస్తుంది. మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించిన అమ్మను మహిషాసురమర్దినీదేవీగా పూజిస్తే శత్రుభయం తొలగిపోయి సకల విజయాలు కలుగుతాయి. విజయవాడలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారు ఆ ఉగ్ర రూపంతోనే పూర్వకాలంలో దర్శనమిచ్చేది. ఆ తల్లి ఉగ్ర రూపాన్ని శ్రీ చక్రంలోకి ప్రతిపాదించి 'అయిగిరి నందిని నందిత మేధిని' అంటూ స్తుతిస్తూ స్తోత్రం చేశాడు. శంకరాచార్య స్వామి వారు. దీంతో అమ్మవారు శాంతస్వరూపిణిగా సకల జీవకోటిని తన చల్లని చూపులతో అనుగ్రహిస్తోంది. ఈ అమ్మను పూజిస్తే సకల దేవతలను పూజించిన ఫలితం లభిస్తుంది.

**వస్త్ర అలంకారం:** మిరప పండు వర్ణం

**పుష్పాలు :** బకుల పుష్పం

**నివేదన :** కదంబం, చక్కెర పొంగలి

**మంత్రం:** "ఓం ఐం హ్రీం శ్రీం సర్వసమ్మోహిన్యైస్వాహా" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి. చండీ సప్తసతి హోమం చెయ్యాలి.

- భట్టిప్రోలు నటరాజకుమార్

# దత్తత తీసుకుంటున్నారా ?



కొన్ని సందర్భాల్లో పిల్లలు లేని దంపతులు ఎవరినైనా దత్తత తీసుకోవాలనుకోవడం సహజం. అయితే ఈ దత్తత ప్రక్రియకు సంబం ధించిన కొన్ని అంశాల గురించి ముందుగానే తెలుసుకొని, మానసికం గా పూర్తి సంసిద్ధంగా ఉండవలసి ఉంటుంది. నిపుణులు.

**కుటుంబంతో చర్చించాలి..** పిల్లలను దత్తత తీసుకునే విషయం గురించి ముందుగా దంపతులిద్దరూ చర్చించుకోవాలి. భవిష్యత్తులో సమస్యలొస్తే వాటిని ఎదుర్కొనేందుకు ముందుగానే సిద్ధమవ్వాలి. ఈ విషయంలో ఇరువురి కుటుంబ సభ్యుల అభి ప్రాయం కూడా తీసుకోవడం మంచిది. వారి సందేహాలను ఏవైనా మేర నివృత్తి చేసి ఏకాభిప్రాయానికి వచ్చేలా చేయాలి. ఫలితంగా భవిష్యత్తులో సమస్యలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది.

**పిల్లలతో కూడా...** కొంతమంది దంపతులు ఈపాటికే పిల్లలున్నా కొన్ని ప్రత్యేక వ్యక్తుల ను ఇతరులను దత్తత తీసుకోవాలనుకుం టారు. ఇలాంటి సందర్భాల్లో సొంత పిల్లలు కొత్తగా వచ్చేవారితో కలిసిపోయే అవకాశం తక్కువగా ఉంటుంది. కాబట్టి, ముందుగా వారితో కూడా మాట్లా డాలి. వారికి చెల్లి/ తమ్ముడు ఎంత అవసరమో వివరించాలి. ఇలా చేయడం వల్ల చిన్న ప్పటి నుంచి ఇద్దరూ తోబుట్టువుల్లా కలిసి మెలిసి పెరిగే అవకాశం ఉంటుంది.

**ఆర్థిక స్థితిగతులు..** కుటుంబంలోకి కొత్తగా ఒకరు అడుగుపెట్టారంటే ఖర్చు కూడా పెరుగు తుంది. కాబట్టి, దీనికి ముందుగానే మానసికంగా సిద్ధమ వ్వాలి. కొత్తగా వచ్చే బిడ్డకు సంబంధించిన ఖర్చు విషయంలో ముందు నుంచే ప్లాన్ చేసుకోవాలి. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది లేదనుకుంటేనే దత్తత తీసుకోవడానికి ముందుకెళ్లాలి. అలాగే ఆడపిల్ల/ మగపిల్లాడా.. ఎవరిని దత్తత తీసుకోవాలనే విష యంలో కూడా ముందుగానే ఒక నిర్ణయానికి రావడం మంచిదంటున్నారు నిపుణులు. అదేవిధంగా దత్తత తీసుకునే పాప/బాబు ఆరోగ్యం ఎలా ఉంటుందో అవసరమైతే ఖిసంబంధిత నిపుణుల చేత పరీక్షలు చేయించడం కూడా మంచిదని సూచిస్తున్నారు.

**ఆ చిక్కులు లేకుండా...** అలాగే పిల్లలను దత్తత తీసు కునేందుకు ఓ నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. అందులో కొన్ని న్యాయపరమైన అంశాలూ ఉంటాయి. కాబట్టి, భవిష్యత్తులో ఎలాంటి చిక్కులు రాకుండా ఉండేందుకు ఈ అంశాల గురించి ముందుగానే తెలుసుకోవాలి. దత్తత ప్రక్రియ గురించి ఎక్కువగా అవగాహన పెంచుకోవాలి. బట్టి న్యాయ నిపుణులను కూడా సంప్రదించవచ్చు. □

# దుర్గామాత మెచ్చే నైవేద్యాలు



**చిట్టిగారెలు :** తొమ్మిది రోజులు దుర్గమ్మ మహిషా సురుడితో యుద్ధం చేస్తుంది. అలసట రాకుండా 'మాష చక్రములు' అంటే చిట్టి గారెల్ని పెడతారు. అమ్మ వారికి ఇష్టమైన మిను ములతో వీటిని చేస్తారు.



**కట్టెపొంగలి:** పెసరపప్పు బియ్యం, జీలకర్ర, అల్లం, పచ్చి వేసి తయారు చేసే కట్టె పొంగలిని భవానీ మాత, ఎంతో ఇష్టంగా ఆరగిస్తుందాట.



**నువ్వులన్నం :** నువ్వులు, కొబ్బరి ఉప్పు, కారం వేసి ఈ అన్నాన్ని వండుతారు. అసురులతో పోరాడే కాళికకు నువ్వుల్లో ఉండే విష్ణుశక్తి తోడవ్వాలని కోరుకుంటూ ప్రసాదంగా నివేదిస్తారు.



**దద్యోజనం :** శాంతి రూపాన్ని కోరుకుంటూ, అందరికీ చల్లని దీవెనలు అందించమంటూ అన్నపూర్ణాదేవికి పెరుగుతో చేసిన దద్యోజనం ప్రసాదంగా నివేదిస్తారు.



**చిత్రాన్నం :** దుర్గమ్మ మెచ్చే ప్రసాదాల్లో నిమ్మకాయ పులిహోర కూడా ఒకటి. పోపు సామగ్రి వేసి రుచికరంగా చేసే దీన్ని అమ్మ వారు ఇష్టంగా ఆరగిస్తారనేది నమ్మకం.



**గుడాన్నం :** లలితా సహస్రనామాల్లో 'గూడాన్నః ప్రీత మానస' అంటూ చదువుకుంటాం ఇదిఅమ్మవారికి ఎంతో ఇష్టమైన ప్రసాదం. పెసరపప్పు, బియ్యం ఉడకబెట్టి బెల్లం, సుగంధ ద్రవ్యాల పొడి, నెయ్యి, ఎండు ఫలాలను వేసి తయారు చేస్తారు. సకల శుభాలూ అందించమని కోరుతారు.



**అప్పాలు :** అమ్మవారి క్షేత్రపాలకుడు ద్రవ్యాల పొడి వాడి వీటిని చేస్తారు.



**శాకాన్నం :** తొమ్మిది రకాల కూరగాయలు, తొమ్మిది రకాల సుగంధ ద్రవ్యాలపొడి వేసి నవశక్తికి నైవేద్యంగా అమ్మకు పెడతారు.



**కదంబర ప్రసాదం :** దశమిరోజున పదకొండు రకాల కూరగాయలు, పప్పు, బియ్యంతో చేసిన కదంబాన్ని అమ్మవారికి నైవేద్యంగా నివేదిస్తారు. □

# రంగులు మార్చే రుద్రాక్ష పూలు



ఈ కాలంలో ప్రకృతి అంతా పూలతో సింగారించుకుని మురిసిపోతుంది. అందుకే వేడుకల్లో పూలదే సందడి. వాటిల్లో రుద్రాక్ష పూలది ప్రత్యేక స్థానం. సాయంత్రం వేళ విచ్చుకునే ఈ పూలను తాజాగా కోసి.పూజకు ఉపయోగిస్తారు. వీటినే చంద్రకాంత, సాయంత్రం పూలని కూడా పిలుస్తారు. ఇవి ముదురు గులాబీ, పసుపు, ఎరుపు, కాషాయం వంటి ఎన్నో వర్ణాల్లోనూ విచ్చుకుంటాయి. అంతేకాదు, ఒకే మొక్కకి రెండు మూడు రంగుల్లోనూ పేలు వస్తాయి. అంతేకాదు, అప్పటివరకూ ఓ కలర్‌లో పూసిన మొక్కే కొన్నాళ్ల తరవాత మరో రంగులో పుష్పించడమూ వీటిల్లో చూడొచ్చు. ఈ రుద్రాక్ష పూలను మన సంస్కృతికి నెలవైన పలు పండగలు, పూజల్లో వాడతాం. అయితే, ఈ మొక్క పుట్టింది మాత్రం పెరూ దేశంలోనట. ఆహార రంగుల తయారీలో ఈ పూలను వినియోగిస్తారు. వీటికి ఔషద గుణాలు ఎక్కువ. ముఖ్యంగా ఆయుర్వేద వైద్యంలో మూత్ర సమస్యలు, వాపులు తగ్గేందుకూ, గాయాలకు చికిత్సగానూ వాడతారు. వీటి వేర్లకు విరేచనాలను తగ్గించే శక్తి ఉందట. ముఖ్యంగా ఇందులోనికొన్ని రకాల వితనతనాలను కాస్మెటిక్ డైలుగానూ వినియోగిస్తారట. □

# చర్మం మృదువుగా..



**బొగ్గు పొడితో (యాక్టివేటెడ్ చార్‌కోల్) తయారుచేసిన కొన్ని పూతలు చర్మాన్ని తాజాగాఉంచుతాయంటున్నారు నిపుణులు.**

కాలమేదైనా కొంతమందిని జిడ్డు చర్మం ఇబ్బంది పెడుతుంటుంది. ఇలాంటి వారు యాక్టివేటెడ్ చార్‌కోల్‌లో తయారుచేసిన మాస్క్ క్లెన్సర్‌ని వాడితే అతిగా విడుదలయ్యే నూనెలు మారుతుంది. అలాగే ఈ మాస్క్ క్లెన్సర్ చర్మం సహజ నూనెల్ని కోల్పోకుండా చేస్తుంది. వాతావరణంలో ఉండే దుమ్మూ-ధూళి చర్మంపై చేరడం వల్ల స్వేద రంధ్రాలు మూసుకుపోయే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో కొద్దిగా బొగ్గుపొడి కలిసిన ఫేస్ మాస్క్ ఉపయోగిస్తే అది మృతకణాలను తొలగిస్తుంది.మురికి బయటకు వచ్చేలా చేస్తుంది. అయితే ఈ మాస్కులు వాడేవిషయంలో వ్యక్తిగత సౌందర్య నిపుణుల సలహా మేరకు చర్మతత్వాన్ని బట్టి ఎంచుకోవాల్సి ఉంటుంది. □



# డోంట్ స్లీప్ టీజర్ పై కమల్ హాసన్ ప్రశంసలు

ఇంద్ర రామ్ హీరోగా షామ్‌దత్ దర్శకత్వంలో రూపొందుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ డోంట్ స్లీప్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. మమ్ముట్టి నటించిన మలయాళం-తమిళ ద్విభాషా థ్రిల్లర్ స్ట్రీట్ లైట్స్ తో దర్శకుడిగా పరిచయమైన సినిమాటోగ్రాఫర్ షామ్‌దత్ .. ఈ చిత్రంతో తెలుగులో దర్శకుడిగా అడుగుపెడుతున్నారు. చౌర్య పాఠం చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఇంద్ర రామ్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. వీ డ్రీమ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వీ చుడామణి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆ సంస్థకు ప్రొడక్షన్ నంబర్ 2.ఇటీవలే విడుదలైన టీజర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. తాజాగా ఉలగనాయగన్ కమల్ హాసన్ టీజర్‌ను అభినందించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.విభిన్నమైన కథాంశం, విజువల్స్, ఉత్కంఠభరితమైన కథనంతో డోంట్ స్లీప్ టీజర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో పాటు సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఆసక్తికరమైన థియేట్రికల్ అనుభూతిని అందించనుంది.నటీనటులు: ఇంద్ర రామ్, రవీంద్ర విజయ్, తబా రీమా, జోయితా బెనర్జీ, సునీల్ థాపా, ఆడుకలం నరేన్, కల్పలత, అనీష్ కురువిల్లా, వెన్నెల కిశోర్, నాగి జబర్దస్త్, డాక్టర్ భద్రం, రఘుబాబు

# 'క్రేజీ కల్యాణం' సక్సెస్ మీట్



నటి నీల ప్రియ మాట్లాడుతూ క్రేజీ కల్యాణం లాంటి మంచి చిత్రంలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. కేరళ అమ్మాయి అయినా అనుపమ తెలుగింటి అమ్మాయిలా డైలాగ్స్ చెప్పి ఆకట్టుకుంది. నటుడు గౌరిశంకర్ మాట్లాడుతూ మా క్రేజీ కల్యాణం సినిమా థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి చూశాను. థియేటర్ నిండిపోయింది.ఎమోషనల్ సీన్స్‌లో థియేటర్ సైలెన్స్ అవుతోంది. నటుడు లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ డైరెక్టర్ బద్రప్ప నాకు తమ్ముడు లాంటి వాడు. కానీ ఈ సినిమాలో అవకాశం ఇవ్వడం ద్వారా నాకు దేవుడు అయ్యాడు. రైటర్ శ్రీనివా స రవీంద్ర మాట్లాడుతూ ఇది ప్రతి తండ్రి, కూతురు చూడాల్సిన సినిమా. ప్రేమ, బాధ్యత కారణంగా తండ్రి తన కూతురుకు కొన్ని నిర్బంధాలు పెడతాడు. డైరెక్టర్ బ ద్రప్ప గాజుల మాట్లాడుతూ మా క్రేజీ కల్యాణం సినిమా ను ప్రతి ఆడ పిల్ల ఓన్ చేసుకుంటోంది. అమ్మా యిలు తమ కుటుంబంతో కలిసి మా సినిమాను చూస్తు న్నారు. ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రీ రిలీజ్ తర్వాత మా టీమ్ అంద రికీ షో వేశాం.అలాగే బయట నుంచి ఎలాంటి రెస్పాన్స్ ఉంటుందో అని టెన్షన్ పడ్డాం. సినిమా బాగుందని చెప్పారు. మా సినిమాకు సపోర్ట్ చేసి విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ మేము థియేటర్స్ విజిట్స్‌కు వెళ్లినప్పుడు ఆడియెన్స్ రెస్పాన్స్ చూసి చాలా హ్యాపీగా ఫీలవుతున్నాం. నవరసరాయ డా. నరేష్ విజయ కృష్ణ మాట్లా డుతూ మా సినిమాను మీడియా మిత్రులు చాలా సపోర్ట్ చేస్తున్నారు. రివ్యూస్ లో మంచి రేటింగ్స్ ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు మా సినిమాను ప్రశంసించి మా టీమ్ అందరినీ అభినందించారు. ఆయనకు థ్యాంక్స్ చెబుతున్నాం.

# తెర

# 2027 దీపావళికి ప్రభాస్ స్పిరిట్



రెబల్ స్టార్ ప్రభాస్, బ్లాక్‌బస్టర్ ఫిల్మ్‌మేకర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్ర స్పిరిట్ థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను లాక్ చేసుకుంది. భారీ అంచనాలున్న ఈ యాక్షన్ డ్రామా 2027 అక్టోబర్ 29న దీపావళి పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దీంతో వచ్చే ఏడాది బిగ్గెస్ట్ రిలీజ్‌లలో ఒకటిగా ఈ సినిమా నిలవనుంది. మేకర్స్ తాజాగా విడుదల చేసిన కొత్త రిలీజ్ పోస్టర్ ద్వారా విడుదల తేదీని ప్రకటించారు. ఈ పోస్టర్‌లో ప్రభాస్ ఇంటెన్స్, స్టైలిష్, మిస్టీరియస్ అవతార్‌లో కనిపిస్తున్నారు. బ్లాక్ క్యాప్, డార్క్ సన్‌గ్లాసెస్, గడ్డంతో క్లోజప్ ప్రొఫైల్ షాట్‌లో ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. డ్రామాటిక్ లైటింగ్‌తో ప్రభాస్ రఫ్ లుక్‌ను మరింత హైలైట్ చేశారు. బ్లాక్ అండ్ వైట్ విజువల్‌కు, బోల్డ్ రెడ్ కలర్‌లో ఉన్న సినిమా టైటిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.భారీ స్థాయి సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే రెండు పవర్ హౌస్ లు"స్పిరిట్"తో ఒక్కటవుతున్నారు. తన మొదటి మూడు సినిమాలతోనే బాక్సాఫీస్ వద్ద బలమైన ట్రాక్ రికార్డ్‌ను సొంతం చేసుకున్న సందీప్ రెడ్డి వంగా.. ప్రభాస్‌ను మరో ఇంటెన్స్, పవర్ ఫుల్ కథలో ఆవిష్కరించబోతున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కోసం దర్శకుడు ఎలాంటి పాత్రను, ఎలాంటి ప్రపంచాన్ని సృష్టించారో తెలుసుకోవడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. భద్రకాళి పిక్చర్స్, టీసిరీస్ ఫిల్మ్స్ బ్యానర్లపై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్ భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్ స్టార్‌డమ్, సందీప్ రెడ్డి వంగా ప్రత్యేకమైన స్టోరీ టెల్లింగ్, దీపావళి పండుగ విడుదల.. ఈ మూడు అంశాలతో "స్పిరిట్" భారీ థియేట్రికల్ అట్రాక్షన్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న "స్పిరిట్" ను 2027 అక్టోబర్ 29న దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు మూవీ టీం.

# యూట్యూబ్ సెన్సేషన్ అజయ్ (ఏయ్ జూడ్) హీరోగా కొత్త సినిమా




యూట్యూబ్ సెన్సేషన్, ఏయ్ జూడ్‌గా పాపులర్ అయిన అజయ్ హీరోగా తెరకెక్కనున్న కొత్త సినిమా నేడు అధికారికంగా ప్రారంభమైంది. రాము కొప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నెక్సస్ సినిమాస్, స్కైబ్లేజ్ సిల్వర్ స్క్రీన్ బ్యానర్లపై నెక్సస్ శ్రీధర్, దీపక్ ముస్త్యాల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తుండగా, ఫహాద్ అబ్దుల్ మజీద్ సినిమాటోగ్రాఫర్‌గా, క్రాంతి ప్రియమ్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.రామానాయుడు స్టూడియోస్‌లో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ వేడుకకు చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు, ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. ప్రముఖ దర్శకుడు బి. గోపాల్ గారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ గారు తొలి క్లాప్ ఇచ్చారు. దర్శకుడు బుచ్చిబాబు సానా గారు తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు బెజవాడ ప్రసన్న గారు, థామస్ రెడ్డి ఆదూరి, డా. పృథ్వీరాజ్ గారు (క్రాంతిదళ్), శ్రీనివాస్ దాసరి గారు (కలోజీ టీవీ), రఘు గంజి గారు (తొలి వెలుగు), బాబు దేగల గారు, సత్యం రాజేష్ గారు తదితర ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు

# రౌడీ జనార్ధన మూవీ కీర్తి సురేష్ బర్త్ డే స్పెషల్ పోస్టర్

స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నటిస్తున్న క్రేజీ మూవీ ఖిఖిరౌడీ జనార్ధనఖిఖి. స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రవికిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కీర్తి సురేష్ నాయికగా నటిస్తోంది. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా ఖిఖిరౌడీ జనార్ధనఖిఖి సినిమా రూపొందుతోంది. ఈ రోజు హీరోయిన్ కీర్తి సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విశెస్ చెబుతూ ఖిఖిరౌడీ జనార్ధనఖిఖి సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో కీర్తి సురేష్ ట్రెడిషనల్ లుక్ లో బ్యూటిఫుల్ గా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ఖిఖిరౌడీ జనార్ధనఖిఖి సినిమాను సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ డిసెంబర్ లో ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.



# నలుగురు సీనియర్ల కెరీర్ డౌట్


సారాంశ్ జైన్


ఇషాంత్ శర్మ


జయదేవ్ ఉనద్కట్


మహమ్మద్ షమీ

## న్యూజిలాండ్ పర్యటనకు దక్కని చోటు

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ పర్యటనకు టీమిండియా జట్టు ఎంపికతో నలుగురు సీనియర్ ఆటగాళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు తెరపడినట్లేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. న్యూజిలాండ్ పర్యటన ఈ నెల 22 నుంచి డిసెంబర్ 1 వరకు జరగనుంది. ఈ పర్యటనలో మూడు ఫార్మాట్ల 12 మ్యాచ్‌ల సిరీస్ కోసం టి20, వన్డే, టెస్టు జట్లను ఎంపికచేసింది. ఈ జట్లలో పలువురికి తిరిగి చోటు దక్కగా, అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్దగా అనుభవం లేని కొందరికి కూడా అవకాశం లభించింది. అయితే భారత జట్టులో సీనియర్ ప్లేయర్లు మహమ్మద్ షమీ, ఇషాంత్ శర్మ, జయదేవ్ ఉనద్కట్, సారాంశ్ జైన్‌లకు జట్టులో చోటు దక్కకపోవడంతో వారి కెరియర్ ప్రశ్నార్థకమైంది. 2023 వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన 36 యేళ్ల మహమ్మద్ షమీకి ఆ తర్వాత అంతర్జాతీయ కెరీర్ ఆశించిన స్థాయిలో సాగలేదు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తదుపరి జట్టులో చోటు కోల్పోయాడు. న్యూజిలాండ్ సిరీస్‌లో షమీ జట్టులోకి వస్తారని అంచనాలున్నా ఎంపిక చేయలేదు. అలాగే అనుభవజ్ఞుడైన ఫాస్ట్ బౌలర్ ఇషాంత్ శర్మ కొన్నేళ్లుగా టీమిండియాకు దూరంగా ఉన్నాడు. న్యూజిలాండ్ పర్యటన కోసం యువ ఫాస్ట్ బౌలర్లను ఎంపిక చేయడంతో 38 యేళ్ల ఇషాంత్ తిరిగి భారత జట్టులోకి వచ్చే అవకాశాలు దాదాపుగా లేవని స్పష్టమవుతోంది. ఇక 34 యేళ్ల జయదేవ్ ఉనద్కట్ అంతర్జాతీయ కెరీర్ కూడా ముగిసినట్లేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2010లో దక్షిణాఫ్రికా పర్యటనలో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన ఆయన, ఈ 16 యేళ్లలో కేవలం 22 మ్యాచ్‌లే ఆడాడు.
2023లో టీమిండియా తరపున చివరిసారిగా బరిలోకి దిగాడు. న్యూజిలాండ్ పరిస్థితులు ఉనద్కట్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, సెలక్టర్లు ఆయనకు బదులుగా యువ ఆటగాళ్లపై నమ్మకం ఉంచారు. ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌ను శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్ కోసం టీమిండియాకు ఎంపిక చేశారు. రెండో టెస్టులో ఆడిన ఆయన పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. దీంతో భవిష్యత్తులో భారత జట్టులో ఆయనకు అవకాశాలు దక్కడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తాజాగా న్యూజిలాండ్ పర్యటనకు ప్రకటించిన జట్లలో కూడా సారాంశ్‌కు చోటు దక్కలేదు.




## వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్.. ఏక్తాకు మూడు స్వర్ణాలు

**రెనో (అమెరికా):** అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణ పతకాలు గెలిచి ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారిణి ఏక్తా బిష్ణోయ్ చరిత్ర సృష్టించారు. బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన పోటీదారులను అధిగమించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో మాస్టర్స్ 2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారతీయ మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె నిలిచింది. ఐఆర్‌ఎస్ అధికారిగా తనకున్న కఠినమైన బాధ్యతలతో పాటు, బిష్ణోయ్ పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కూడా తీవ్రంగా కొనసాగించారు. పోటీకి కొద్ది రోజుల ముందు, భారత జట్టు కోచ్ సునీల్ కుమార్‌కు యూఎస్ వీసా నిరాకరించబడటంతో ఆమె సన్నాహాలకు ఊహించని సవాలు ఎదురైంది. ఎదురుదెబ్బతో నిరుత్సాహపడకుండా, బిష్ణోయ్ వీడియో కాల్స్ ద్వారా కుమార్‌నుండి మార్గదర్శకత్వం పొందడం కొనసాగించింది. జట్టు అధికారి బినూ ఇబ్రహీం అందించిన క్షేత్రస్థాయి మద్దతుతో, ఆమె ప్రణాళికాబద్ధమైన వ్యూహాన్ని అనుసరించి భారతదేశానికి చారిత్రాత్మక విజయాన్ని అందించింది.

## ఈస్ట్ బెంగాల్ విజయం 4-0తో చర్చిల్ బ్రదర్స్ ఓటమి



**బెంగుళూరు:** ఈస్ట్ బెంగాల్ ఆదివారం ఇక్కడ చర్చిల్ బ్రదర్స్‌పై 40 తేడాతో విజయం సాధించి ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టైటిల్ బరిలోకి దిగింది. డాని రామిరెజ్, ఎడ్మండ్ లాల్‌రిండికా చెరొక గోల్ చేయగా, బిపిన్ సింగ్ థౌనావోజం రెండు గోల్స్ సాధించాడు. రామిరెజ్ రెండు నిమిషాల్లోనే గోల్ సాధించగా, మొదటి అర్ధభాగం చివరి నిమిషంలో డేవిడ్ లాల్‌హ్లాన్సంగా హ్మర్ అందించిన అసిస్ట్‌తో ఎడ్మండ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఈస్ట్ బెంగాల్ గత మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన డేవిడ్, తన పరుగులతో ఆకట్టుకున్నాడు. రెండు గోల్స్ ఆధిక్యంతో ఈస్ట్ బెంగాల్ తిరిగి రక్షణాత్మక వ్యూహానికి మారినా ఆట ముగియడానికి ఐదు నిమిషాల ముందు బిపిన్ ఆ పోటీకి ముగింపు పలికాడు. క్లబ్‌లో కొత్తగా చేరిన అకే అర్నాడ్ లోబా ఇచ్చిన పాస్‌ను బిపిన్ అందుకుని గోల్‌లోకి పంపాడు. ఐదు నిమిషాల తర్వాత బిపిన్ తన రెండవ గోల్‌తో ఆధిక్యాన్ని మరింత పెంచాడు. పివి విష్ణు వేసిన బంతిని బిపిన్ సునాయాసంగా గోల్‌లోకి పంపాడు. ఈస్ట్ బెంగాల్ తదుపరి మ్యాచ్ కోసం ఈ నెల 23న పుణెలో ఇంటర్ కాశీతో తలపడనుంది.



## ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో శైలేష్‌కు టైటిల్

### మహిళల విభాగంలో ధ్యానికి స్వర్ణం



**న్యూఢిల్లీ:** ఆదివారం జరిగిన ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో, అరంగేట్రం చేసిన శైలేష్ కుష్వాహ్ ఇండియన్ ఎలైట్ పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకోగా, అంకితా ధ్యాని ఇండియన్ ఎలైట్ మహిళల విభాగంలో తన తొలి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. 20 యేళ్ల కుష్వాహ్ హోరాహోరీగా జరిగిన పురుషుల రేసును 1:05:05 సమయంలో గెలుచుకున్నాడు. అతను సగం దూరం దాటిన కొద్దిసేపటికే ముందున్న ఐదుగురు సభ్యుల బృందం నుండి విడిపోయి, 1:05:11 సమయంలో రేసును పూర్తి చేసిన గౌరవ్ మాథుర్‌ను ఆరు సెకన్ల తేడాతో వెనక్కి నెట్టాడు. హేమంత్ సింగ్ 1:05:37 సమయంతో మూడవ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఇక ఇండియన్ ఎలైట్ మహిళల విభాగంలో, అంకితా ధ్యాని 1:12:46 సమయంతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, సోనియా 1:14:56 సమయంతో రెండవ స్థానంలో నిలిచింది, భాగీరథి 1:15:51 సమయంతో మూడవ స్థానాన్ని దక్కించుకుంది. ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలలో రజత పతక విజేత ధ్యానీ, రేసు ప్రారంభంలోనే అంతర్జాతీయ అగ్రశ్రేణి పోటీదారులతో పాటు పరుగెత్తింది. ఆమె 1:12:46 విజయ సమయం, ఆమె మునుపటి వ్యక్తిగత అత్యుత్తమ సమయం కంటే ఐదు నిమిషాలకు పైగా వేగవంతమైనది. అరంగేట్రం చేసిన సోనియా, భాగీరథి పోడియంను పూర్తి చేయగా, మాజీ ఛాంపియన్ లిలి దాస్ 1:16:20 వ్యక్తిగత అత్యుత్తమ సమయంతో నాల్గవ స్థానంలో నిలిచింది.

## వరల్డ్ ఇండియా ఛాంపియన్‌షిప్.. చకారా టైటిల్ కైవసం



**న్యూఢిల్లీ:** ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన డిపి వరల్డ్ ఇండియా ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను యూజెనియో చకారా రెండు షాట్ల తేడాతో సునాయాసంగా గెలుచుకున్నాడు. ఫలితంగా, అతను పాట్రిక్ రీడ్‌ను అధిగమించి రేస్ టు దుబాయ్ స్టాండింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఉదయం సెషన్‌లో మూడవ రౌండ్‌లో అద్భుతమైన తొమ్మిది అండర్ 63 స్కోరు సాధించిన తర్వాత, చకారా చివరి రౌండ్‌లో రెండు అండర్ 70 స్కోరు చేసి విజేతగా నిలిచాడు. మూడవ రౌండ్‌లోని చివరి హోల్‌లో, ఆ స్పానిష్ ఆటగాడు 16 గజాల దూరం నుండి చిప్ షాట్‌ను హోల్ చేసి ఈగిల్ సాధించి, మిగతా ఆటగాళ్లందరి కంటే చాలా ముందుకు దూసుకెళ్లాడు. ఛాంపియన్‌షిప్ రౌండ్‌లో అతను తొమ్మిది అడుగుల పుట్‌ను మిస్ చేసి బోగీ నమోదు చేయడంతో ఒక చిన్న తడబాటు ఎదురైంది. అయితే, తర్వాతి హోల్‌లో చకారా క్లీన్ పార్ సాధించాడు. న్యూజిలాండ్‌కు చెందిన డేనియల్ హిలియర్, అద్భుతమైన మూడు రౌండ్ల ప్రదర్శనతో రెండవ స్థానంలో నిలిచాడు. రెండు ఓవర్లతో ప్రారంభించిన తొలి రౌండ్‌లో వెనుకబడినట్లు కనిపించినా, ఈ కివీ ఆటగాడు 64, 64, 67 స్కోర్లతో తిరిగి పోటీలోకి దూసుకొచ్చాడు. రోరీ మెక్‌ల్రాయ్ తన అత్యుత్తమ ప్రదర్శన చేయలేకపోయాడు.

# జియో ఐపిఒ, ఆర్‌బిఐ పాలసీపై ఇన్వెస్టర్ల దృష్టి!




**ముంబయి, అక్టోబరు 18:** దసరా సెలవు కారణంగా ఈ వారం తక్కువ ట్రేడింగ్ రోజులు ఉండనున్న నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లలో కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ సమావేశ వివరాలు, బ్రిటన్ ద్రవ్యోల్బణ గణాంకాలు, అమెరికా కార్మిక మార్కెట్ పరిస్థితులు, వ్యాపార కార్యకలాపాల సూచీలు ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించనున్నాయి. వీటితో పాటు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఐపీఓ కూడా మార్కెట్‌లో కీలక అంశంగా నిలవనుంది. ప్రైమరీ మార్కెట్‌లో జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్, పారాస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూలు ఈ వారం సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు, సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి ఊపందుకోనుంది. బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, హిందుస్థాన్ జింక్ తదితర కంపెనీల ఫలితాలను ఇన్వెస్టర్లు పరిశీలించనున్నారు. ఇవే కాకుండా విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల పెట్టుబడులు, అమెరికా డాలర్ ఇండెక్స్, ట్రెజరీ బాండ్ల రాబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల కదలికలపై కూడా మార్కెట్ వర్గాలు దృష్టి సారించనున్నాయి. దేశీయంగా ఈనెల 21న విడుదల కానున్న రిజర్వ్ బ్యాంక్ తాజా ద్రవ్య విధాన కమిటీ సమావేశ వివరాలపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, ద్రవ్య లభ్యత పరిస్థితులు, వడ్డీ రేట్ల భవిష్యత్ దిశపై విధాన నిర్ణేతల అభిప్రాయాలు వెల్లడికానున్నాయి. ద్రవ్యోల్బణ ధోరణులు, ఆర్థిక వృద్ధి అవకాశాలు, భవిష్యత్ ద్రవ్య విధాన చర్యలపై స్పష్టత లభిస్తే వడ్డీ రేట్లు, మార్కెట్లో నగదు లభ్యతపై ఇన్వెస్టర్ల అంచనాలు మారే అవకాశం ఉంది. దసరా పండుగ సందర్భంగా 22న భారత స్టాక్ ఎక్స్ఛేంజీలు మూతపడతాయి. ఈ వారం ట్రేడింగ్ రోజులు తగ్గనున్నాయి. సెలవు కారణంగా మార్కెట్ కార్యకలాపాలు కొంత మందగించే అవకాశం ఉంది. అదే సమయంలో, మార్కెట్లు మూసివున్న రోజున వెలువడే అంతర్జాతీయ పరిణామాలను కూడా ఇన్వెస్టర్లు నిశితంగా గమనించనున్నారు. విదేశీ మార్కెట్లలో చోటుచేసుకునే మార్పులు తిరిగి ట్రేడింగ్ ప్రారంభమైనప్పుడు దేశీయ సూచీలపై ప్రభావం చూపవచ్చు. ఈ వారం ప్రైమరీ మార్కెట్‌లో రెండు కీలక పబ్లిక్ ఇష్యూలు ఇన్వెస్టర్ల ముందుకు రానున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్, పారాస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ ఐపీఓలు ఈనెల 21న ప్రారంభమై 23న ముగియనున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ మొత్తం రూ.30,213 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వస్తోంది. పారాస్ హెల్త్‌కేర్ ఐపీఓ ద్వారా మొత్తం రూ.1,450 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.500 కోట్లతాజా షేర్ల జారీతో పాటు రూ.950 కోట్ల విలువైన ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ఉంటుంది. ఐపీఓ పరిమాణం రూ.1,450 కోట్లుకాగా తాజా షేర్ల జారీ: రూ.500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్: రూ.950 కోట్లు, ధరల శ్రేణి: ఒక్కో షేరుకు రూ.660-693గా నిర్ణయించారు.

# ఐడిబిఐ బ్యాంక్‌లో రూ.52,878 కోట్లకు వాటా విక్రయం



**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటాను తగ్గించేందుకు పార్లమెంట్ ఎప్పుడూ నిషేధం విధించలేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ అంశంపై ఢిల్లీ హైకోర్టు 2018లోనే స్పష్టమైన తీర్పు ఇచ్చిందని పేర్కొంది. ప్రభుత్వ వాటా విక్రయానికి చట్టపరమైన ఆధారం లేదంటూ వచ్చిన కథనాలకు వివరణ ఇచ్చింది. 2003 బడ్జెట్ చర్చలు, ఐడీబీఐ (రద్దు) చట్టం-2003పై చర్చల సందర్భంగా ప్రభుత్వ వాటా తగ్గింపును పరిమితం చేయాలనే సవరణ ప్రతిపాదన వచ్చిందని మంత్రిత్వశాఖ తెలిపింది. ఆ ప్రతిపాదన తిరస్కరణకు గురైందని, చట్టంలో భాగం కాలేదని వివరించింది. ఆల్ ఇండియా ఐడీబీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 2018 డిసెంబర్ 17న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆర్థిక శాఖ ప్రస్తావించింది. పార్లమెంట్‌లో సుమారు 15 ఏళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలు అమలులోకి వచ్చిన చట్టాన్ని అధిగమించలేవని కోర్టు స్పష్టం చేసినట్లు తెలిపింది. ఉద్యోగులు గతంలో చేసిన ప్రకటనలపై ఆధారపడి నష్టపోయామని చెప్పేందుకు అవసరమైన పరిస్థితులు లేనందున, ప్రామిసరీ ఎస్టాపెల్ సిద్ధాంతం ఈ కేసుకు వర్తించదని కోర్టు పేర్కొన్నట్లు వివరించింది. 2003 చట్టంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని, ప్రభుత్వ వాటా తగ్గింపు లేదా విక్రయంపై నిషేధం ఉన్నట్లు ఆ చట్టాన్ని అర్థం చేసుకునే అవకాశం లేదని తీర్పు చెప్పినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా తగ్గింపుపై కేంద్రం విధానం వరుస బడ్జెట్‌లలోనూ ప్రతిబింబించిందని ఆర్థిక శాఖ తెలిపింది. అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీబ్యాంక్‌లో మార్పుల ప్రక్రియ ప్రారంభమైందని, ప్రభుత్వ వాటాను 50 శాతం కంటే దిగువకు తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని ప్రకటించారు. 2021-22 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాల్సిన వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహారణ లావాదేవీల్లో ఐడీబీఐ బ్యాంక్‌ను చేర్చారు. ఈనెల జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఐడీబీఐ బ్యాంక్ వాటా విక్రయానికి ఆమోదం లభించిన కొద్ది రోజులకే తాజా ప్రకటన వెలువడింది. కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ సంస్థ కేంద్ర ప్రభుత్వం, భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) వద్ద ఉన్న కలిపి 60.72 శాతంవాటాను రూ.52,878కోట్లకు కొనుగోలు చేయనుంది. ఈ ప్రణాళికలో భాగంగా రానున్న రెండేళ్లలో సీఎస్‌బీ బ్యాంక్‌ను ఐడీబీఐ బ్యాంక్‌లో విలీనం చేసే ప్రతిపాదన కూడా ఉంది. దీనికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెబీ అనుమతులు అవసరం. ఫెయిర్‌ఫాక్స్‌కు ఇప్పటికే సీఎస్‌బీ బ్యాంక్‌లో సుమారు 40శాతం వాటా ఉంది. విక్రయానికి ముందు ఐడీబీఐ బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వానికి 45.48 శాతం, ఎల్ఐసీకి 49.24 శాతం వాటా ఉంది. బ్యాంక్ పునరుద్ధరణ ప్రక్రియ పూర్తయిందని కేంద్రం పేర్కొంటోంది. 2026 సెప్టెంబర్ నాటికి స్థూల నిరర్థక ఆస్తులు 2.32శాతానికి తగ్గాయని, మొత్తం వ్యాపారం రూ.6.27లక్షల కోట్లను అధిగమించిందని తెలిపింది.

# టాప్9 కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.3.65 లక్షల కోట్ల వృద్ధి

**ముంబయి, అక్టోబరు 18:** స్టాక్ మార్కెట్లలో గత వారం నమోదైన బలమైన ర్యాలీతో దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో తొమ్మిది సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.3.65 లక్షల కోట్లు పెరిగింది. ఈ జాబితాలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అత్యధికంగా లాభపడగా, భారతి ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. లార్సెన్ అండ్ టూబ్రో ఒక్కటే మార్కెట్ విలువను కోల్పోయింది. గత వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 2,256.94 పాయింట్లు (3.11 శాతం) పెరగగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 625.7 పాయింట్లు (2.77శాతం) లాభపడింది. సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో దేశీయ మార్కెట్లో ముఖ్యంగా ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు నమోదయ్యాయి. అదే సమయంలో భారీ మార్కెట్ విలువ కలిగిన పలు ప్రధాన కంపెనీల షేర్లలో మళ్లీ కొనుగోళ్లు పెరగడం మార్కెట్ ర్యాలీకి తోడ్పడిందని ఆన్‌లైన్ ట్రేడింగ్, వెల్త్ టెక్నాలజీ సంస్థ ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ తెలిపారు. టాప్10 కంపెనీల్లో టీసీఎస్ అత్యధికంగా లాభపడింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.1,08,542.63 కోట్లు పెరిగి రూ.8,91,134.96 కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.61,406.53కోట్లు పెరిగి రూ. 11, 88,815.45కోట్లకు చేరుకుంది. ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.55, 893.05కోట్లు పెరిగి రూ.4,71,409.41 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.53,047.56కోట్లు పెరిగి రూ. 16,37, 437.19 కోట్లకు పెరిగింది. దీంతో దేశంలో అత్యంత విలువైన కంపెనీగా రిలయన్స్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. బ్యాంకింగ్ రంగంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.32,379.05 కోట్లు పెరిగి రూ.11,22,628.07 కోట్లకు చేరింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.30,769.95 కోట్లు పెరిగి రూ.10,02,871.44 కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్‌మార్కెట్ విలువ రూ.14,786.65కోట్లు పెరిగి రూ. 6,11,326.72 కోట్లకు చేరింది. ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ.4,933.5 కోట్లు పెరిగి రూ.5,02,204.82 కోట్లకు చేరగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలువ రూ.3,323.07 కోట్లు పెరిగి రూ.8,87, 722.84 కోట్లకు చేరుకుంది.
టాప్10 కంపెనీల్లో మార్కెట్ విలువ తగ్గిన ఏకైక సంస్థ లార్సెన్‌అండ్ టూబ్రో. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 9,232.26కోట్లు తగ్గి రూ.4,99,725.06 కోట్లకు పరిమితమైంది. దేశం లోని అత్యంత విలువైన కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలోనూ తర్వాతి స్థానాల్లో భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్, ఎల్ఐసీ, లార్సెన్ అండ్ టూబ్రో, ఇన్ఫోసిస్ నిలిచాయి.

# సంక్షోభంలోనూ రికార్డు గరిష్టానికి చేరువలో ఎస్ అండ్‌పి 500

### సూచీ పెరుగుదలలో టెక్ దిగ్గజాలదే కీలక పాత్ర..

### 84 శాతం షేర్లు ఇంకా గరిష్ట స్థాయిల కంటే దిగువనే



**ముంబయి, అక్టోబరు 18:** ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా అంతరాయాలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అధిక రుణ వ్యయాలు, అధిక వడ్డీ రేట్లు, రెండు యుద్ధాలు వంటి ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ అమెరికా స్టాక్ మార్కెట్ సూచీ ఎస్ అండ్ పీ 500 రికార్డు గరిష్ఠ స్థాయికి చేరువలో ట్రేడవుతోంది. ప్రస్తుతం ఈ సూచీ తన ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి కంటే కేవలం 2 శాతం దిగువన ఉంది. గత ఆరు నెలల్లో కొనసాగుతున్న అమెరికా-ఇరాన్ యుద్ధ తీవ్రత పెరిగినప్పటికీ ఎస్ అండ్ పీ 500 దాదాపు 8 శాతం వృద్ధి సాధించింది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఈ సూచీ సుమారు 7,659 పాయింట్ల వద్ద ముగిసింది. ఈనెల 6న నమోదైన 7,844.52 పాయింట్ల గరిష్ఠ స్థాయితో పోలిస్తే ఇది కేవలం 2 శాతం తక్కువ. పైకి చూస్తే ఎస్ అండ్ పీ 500 వరుసగా ఐదో ఏడాది బుల్ మార్కెట్‌లోకి అడుగుపెడుతున్నట్లు కనిపిస్తోంది. కోబెస్సీ లెటర్ విశ్లేషణ ప్రకారం, ఈ విస్తృత సూచీలోని దాదాపు 84 శాతం షేర్లు తమ గరిష్ఠ ధరల నుంచి కనీసం 10శాతం పడిపోయాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలోని షేర్లలో ఈ బలహీనత ఎక్కువగా కనిపిస్తోంది. ఎస్ అండ్ పీ 500లోని 59 శాతం షేర్లు తమ గరిష్ఠ స్థాయుల నుంచి కనీసం 20 శాతం, 41 శాతం షేర్లు 30శాతానికి పైగా, 17శాతం షేర్లు 50 శాతానికి పైగా పడిపోయాయి. ఎన్విడియా కార్పొరేషన్‌తో పాటు మరో తొమ్మిది టెక్ షేర్లు కలిపి ఈ సూచీ మొత్తం ఈక్విటీ రాబడుల్లో దాదాపు 70 శాతం వాటాను అందించాయి. జెన్సెన్ హువాంగ్ నేతృత్వంలోని సెమీకండక్టర్ దిగ్గజం ఎన్విడియా ఒక్కటే ఎస్ అండ్‌పీ 500 మొత్తం రాబడుల్లో 13 శాతం వాటాను అందించింది. ఇతర కంపెనీల్లో మైక్రాన్ టెక్నాలజీ, యాపిల్, మైక్రోసాఫ్ట్, అడ్వాన్స్‌డ్ మైక్రో డివైసెస్ (ఏఎండీ), ఇంటెల్, అమెజాన్, బ్రాడ్‌కామ్, మెటా ప్లాట్‌ఫామ్స్ తదితర సంస్థలు ఉన్నాయి. మరోవైపు, మిగిలిన సుమారు 490షేర్లు కలిపి మొత్తం రాబడుల్లో కేవలం 30 శాతం వాటానే అందించాయి. చారిత్రక లాక్‌డౌన్ అనంతరం అమెరికా ఆర్థిక వ్యవస్థ కోలుకుంటుండగా, ప్రభుత్వం సుమారు 4 లక్షల కోట్ల డాలర్ల మేర ఉద్దీపన చర్యలు చేపట్టింది. యుద్ధం లేకపోయి ఉంటే, మార్కెట్ స్థిరత్వం, కృత్రిమ మేధ రంగంపై పెట్టుబడిదారుల ఆసక్తి, కంపెనీల బలమైన ఆదాయాలు కలిసి ఎస్ అండ్ పీ 500ను 9,000 పాయింట్లకు పైగా తీసుకెళ్లి ఉండేవని కోబెస్సీ లెటర్ విశ్లేషణ అంచనా వేసింది. ప్రముఖ టెక్నాలజీ కంపెనీల షేర్లు రికార్డు స్థాయిల వద్ద లేదా వాటికి సమీపంలో ట్రేడవుతున్నప్పటికీ, వాటి విలువల అంచనాల్లో కొంత ఆకర్షణీయత ఉందని విశ్లేషణ పేర్కొంది. మొత్తంగా చూస్తే, ఎస్‌అండ్ పీ500 రికార్డు గరిష్ఠానికి చేరువలో ఉన్నప్పటికీ, ఆ వృద్ధి కొద్ది టెక్నాలజీ కంపెనీలపైనే ఎక్కువగా ఆధారపడుతోంది.

# ఈక్విటీల నుంచి రూ.52,100 కోట్ల విదేశీ పెట్టుబడులు విత్‌డ్రా

**న్యూఢిల్లీ,అక్టోబరు 18:** విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) అక్టోబర్‌లో ఇప్పటివరకు భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.52,100 కోట్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 2026లో ఇప్పటివరకు మొత్తం ఉపసంహరణలు రూ.3.12లక్షల కోట్లకు చేరాయి. ముడి చమురు ధరలు అధికంగా ఉండటం, అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, డాలర్ బలపడటం వంటి అంశాలుదేశీయ స్టాక్ మార్కెట్లపై పెట్టుబడిదారుల ఆసక్తిని తగ్గించాయి. సెంట్రల్ డిపాజిటరీ గణాంకాల ప్రకారం, సెప్టెంబర్‌లో ఎఫ్‌పీఐలు రూ.35,861 కోట్లను వెనక్కి తీసుకున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో వరుసగా రూ.20,200 కోట్లు, రూ.29,631 కోట్లను భారత ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టారు. దీంతో ఆ రెండు నెలల్లో కనిపించిన పెట్టుబడుల ప్రవాహం మళ్లీ ఉపసంహరణల వైపుమళ్లింది. 2025లో నమోదైన మొత్తం ఉపసంహరణలతో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాల పరిమాణం ఇప్పటికే చాలా ఎక్కువగా ఉంది. గత ఏడాది మొత్తం మీద ఎఫ్‌పీఐలు భారత ఈక్విటీలనుంచి రూ.1.66లక్షల కోట్లను ఉపసంహరించుకోగా, 2026లో ఇప్పటివరకు ఈ మొత్తం రూ.3.12 లక్షల కోట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా బాండ్లపై అధిక రాబడులు, డాలర్ బలపడటం, ముడి చమురు ధరలు పెరగడం వంటి అంశాలు ఎఫ్‌పీఐల అమ్మకాలకు ప్రధాన కారణాలని ఛాయిస్ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ఆఫీసర్ ధీరజ్ గౌర్ తెలిపారు. అమెరికాలో ద్రవ్యోల్బణం కొనసాగుతుండటంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవచ్చనే అంచనాలు బలపడుతున్నాయని, దీంతో విదేశీ పెట్టుబడిదారులకు అమెరికా ఆస్తులు మరింత ఆకర్షణీయంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికా పదేళ్ల బాండ్లపై రాబడి 5.3 శాతానికి పైగా ఉన్న స్థాయి నుంచి 5.08 శాతానికి స్వల్పంగా తగ్గడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం ఈ మార్పునకు రెండు ప్రధాన కారణాలని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయకుమార్ తెలిపారు.
ఫుల్లీ యాక్సెసిబుల్ రూట్ (ఎఫ్ఏఆర్) ద్వారా రూ.1,620 కోట్లు, వాలంటరీ రిటెన్షన్ రూట్ (వీఆర్ఆర్) ద్వారా రూ.772 కోట్లను విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి తీసుకున్నారు. దీనికి భిన్నంగా, జనరల్ రూట్ ద్వారా రూ.3,387 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అధిక చమురు ధరలు, అమెరికా వడ్డీ రేట్లపై అంచనాలు, డాలర్ బలం, దేశీయ కంపెనీల త్రైమాసిక ఫలితాలు రానున్న కాలంలో భారత ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపే కీలక అంశాలుగా ఉండనున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.